UNIVERSAL
LIBRARY
OU_204244
UNIVERSAL
LIBRARY

# ప శ్య ఘ

★

హైదరాబాదు.

పోణంగి శ్రీరామ అప్పారావు, ఎమ్. ఏ.

ఆంధ్రోపన్యాసకుడు

ప్రభుత్వ కళాశాల, మద్రాసు

సర్వస్వామ్యములు
పోణంగి. సత్యనారాయణమూర్తి
(కొవ్వూరు, పశ్చిమ గోదావరిజిల్లా)

ప్రథమ ముద్రణ : 1946
ద్వితీయముద్రణ : 1949
తృతీయముద్రణ : 1952

వెల : రు. 2-8-0

పబ్లిషర్సు :
అద్దేపల్లి అండ్ కో
సరస్వతీ పవర్ ప్రెస్
రాజమహేంద్రవరము

ఓమ్

# విశ్వభారతి

నాలుగు రోజులు వరుసగా వర్షము పడినది. గ్రీష్మము వెనుకంబట్టినదని యందఱు ననుకొనినారు. అంతియె. ఇంక మరలఁ జినుకుపడలేదు. మేఘములు తన్ను మాయముచేసి వర్షించినకొలఁది నీటిని సూర్యభగవానుఁడు తిరిగి హరించి వేసినాఁడు. అయినను, ఎండ తెక్కువగాఁ గాయుటచే నెఱ్ఱె యలు వాఱిపోయిన నేల కా నాలుగుచినుకు లేమి సరిపో వును? ఎందును బొందకుండ వర్షించుటలో మేఘముల యుద్దేశ మేమియో కాని యా చినుకులు నాల్గును భూమిలో నణఁగి యున్న వేడినంతటిని వెలికిఁ దెచ్చినవి. అంతకుఁ బూర్వ మెండలవలన నొక్క శరీరమే బాధపడినది. ఇప్పు డాత్మ కూడఁ గుతకుత నుడికిపోసాఁగినది. ఆ నాలుగు చినుకులును బడకపోయినచో బాగుండిపోయెడిది.

మరల నేఁడాకాశమునం దక్కడక్కడ నల్లని మబ్బు తున్కలు పరుగు లిడుచున్నవి. ఎండయేమో యంత తీక్ష్ణ ముగా లేదు. ఉదయమునఁ బట్టయెండ వలె కాసినను మధ్యాహ్నమునకు మనసునకుఁ గొంత విశ్రాంతి లభించినది. ఇంకను బ్రొద్దు వాలకున్నను, గొంచెము చల్లఁబడుటచే రజనీ కుమారియును, కృష్ణరాయఁడును తోటపనిలో నిమగ్ను లైనారు. వారిరువురును గంతులు వేసికొనిరి—రజని నూతి

నుండి నీటిని జేదవలయును; రాయలు బోదెలను ద్రవ్వి యూ నీవు పూలమొక్కలకును, దీగెలకును బెట్టవలయును.

రజనీకుమారి యుత్సాహముతో నీరు తోడుచున్నది. నూతినుండి నీటిబోదెను జాలుచాలుగా రాయలు చాల దూరము ప్రవహింపఁజేసినాఁడు. సంపంగి పాదపాటున మల్లెయంట్లు గుంపులుగుంపులుగా నున్నవి. వానిపూత యప్పుడే యొకసారి రాలిపోయినది. మరల నాకంతయు దూసి నీరు పెట్టినచో నంతగా శ్రేష్ఠమైన మొగ్గ తొడుగకున్నను, నవి విశేషముగాఁబూయును. అంతకుఁబూర్వమే రజనీకుమారి యాకంతయు దూసివేసినది. కాన కృష్ణరాయలు సావధానముగా గూర్చుండి యొక్కొక్కదానికే మట్టిపళ్ళెమును గట్ట నారంభించెను. మొదటి పళ్ళెములోనికి నీరు వచ్చినది. రెండవదానియందంతటను బెద్దపెద్ద నెఱియ లుండుటచే నెంతనీరును దానికే సరిపోయినదిగాదు. ఇఁక నీరు ముందునకు ప్రవహింపకుండుటచే రాయ లటనే కూర్చుండి, నెఱియలద్వారమున భూమి నీటినిఁ బీల్చుచున్నప్పు డేర్పడిన నీటిబుడగల నాశ్చర్యముగఁ బరికించుచుఁ బరాకుగా మట్టిచేతిని జెక్కిలి కానించి పందిరిగుంజ కానుకొనినాఁడు. అంతలోఁ బెద్దబోదెనుండి నీరువచ్చు టాఁగిపోయినది. పరకాయించి చూచినాఁడు.

"రజనీ! నీరుతోడుట మానివేసితివేమి? అప్పుడే చేతులు నొప్పిపెట్టినవా?" అని రాయలు హేళనగా కేకవేసెను. జవాబు రాకపోవుటచే నాతఁడు కూనిరాగములు

తీయుచు నెత్తియలనుండి వచ్చుచున్న యావిరితోఁ బాటేమో యూహించుచుండెను. ఇంతలో నవ్వుకొనుచు వచ్చిన రజనీకుమారి కంటఁబడుటచే నా భావనాలోకమునుండి యాతడు దృష్టి మరల్చినాడు.

“ ఆదేమి? ఏమి జరిగినది చెప్పు. నీరు తోడుట మానినావు......”

“ అవును. నీవు కూనిరాగములు తీయుచుఁ గూర్చుంటివి. నాకు చేతులు నొప్పి పెట్టినవి. అయినను పౌరుషమునకు నీరుతోఁడితిని. ఎంతకును నీవు చాలుననవు. నాకు కోపము వచ్చినది. చేతుల పట్టుసడలి బొక్కెన నూతిలోఁబడి పోయెను. విసుగుతో నేను వెనుదిరిగితిని......”

ఇంతయు నామె యొక్క గుక్కలోఁ జెప్పివేసి చట్టునఁ జెప్పుట మానినది. ఇంత సేపును నా పెదృష్టియంతయు నాశ్రమము వెనక బెదరి పరుగులిడుచున్న లేడిపైనే యున్నది. ఆదృష్టి కంగారును వెలిఁబుచ్చినది.

“ రాయలూ! కృష్ణ పరుగిడి పోవుచున్నది. పట్టుకోవా?......”

“ కృష్ణ!...నీ పెంపుడు బిడ్డయా?” రాయలు హాస్యమాడెను. రజని కనుబొమలు ముడివైచినది. రాయలు జంకును నటించినాఁడు.

“ ఆలాగు చెప్పు. చేతులు నొప్పి పెట్టుట కిదియా కారణము?...అయినను దానిని విడిచిపెట్టుట నీపనియును, దిరిగి పట్టుకొనుట నా పనియునా? నావలనఁగాదు.”

వేఱొకపరి యంబుదదర్శనమునఁ బరవశయైన కేకివలె నృత్య మొనర్చుచున్నట్లనిపించినది. ఇంకొకపరి గాలిని దూసికొని పోవుచున్న నాగకన్యలవలె మెలికలు తిరిగిపోయినవి. ఒకొ్కక పరి యేదో గాఢానురాగముచే ననుకకు లాగఁబడి తన వంకకే నడచివచ్చుచున్నట్లు తోఁచినది. వనమో తన పాలిటి కొంగు దేవత, తనకు వరప్రదాయిని, తనకే యూర్పులు సాక్షాత్క రించిన ట్లనిపించినది రాయలకు. కృష్ణను దీసికొని మేలమ్మున నిగాఘ్రగను కటక ప్రాంతములకు వచ్చినారు.

ఆ యాశ్రమప్రదేశము మహానది గోదావరి యొడ్డున గోప్యాదక్షేత్ర ప్రాంతములో నున్నది. కుటీరమునకు, నొడ్డు నకు మధ్య నొక గొప్ప వటవృక్షము నున్నది. అది నాల పురాతనమైనది. దాని పుట్టుక నెటిదో యెవ్వరు నిప్పటికి కొంత శతాబ్దములనుండి యెరసుమే చెప్పవచ్చును. దానినుండి నేలకు దిగిన యూడలు కొన్ని తల్లిమ్రానితో సమానముగాఁ బెరిగినవి. ఇంక దానినుండి వ్రేలాడు పిల్లయూడలకు లెక్కయే లేదు. అవి, యెడు కొంతచేసి కలిసి మహావృక్షములుగా సంఘటింపఁ బడియున్నవి. తల్లిమ్రాను మిక్కిలి పెద్దది. దానిలో సహజ ముగనే యొక తొఱ్ఱయేర్పడియున్నది. వృక్షమూలమునకును, కుటీరమునకును మధ్యగలదారి యద్దమువలె నునుపుచేయఁ బడినది. గోదావరియొడ్డునకై పోవుచున్న మెట్లమీఁద మా త్రమే పక్షులు వాసముచేయుచుండును. విశ్వనాథుఁడా వృక్ష మూలమునఁ గృష్ణాజినముపైఁ గూర్చుండి జప మొనరించు

కానును. యోగాభ్యాసములో నున్నంతకాలము మాత్రమె మా-త్రొత్తులలో నుపవిష్టుఁ డగును. అతఁడు ధ్యానములో నున్నఘ-టెప్పుడును పక్షు లల్లరిచేయవు. ఆ చెట్టు క్రింద మందు వేసవిలో కూడ మిక్కిలి చల్లగా నుండును.

కుటీరము తాళపత్ర వినిర్మితమై మిక్కిలి మనోహర-ముగా నున్నది. చుట్టును బంచలును, మధ్య విశాలమైన చావడియును గలవు. అధ్యయనవేళలందు శిష్యులు నాచా-ర్యుఁడును చావడిలోఁ గూర్చుందురు. నాఁటికి చదువు ముగిసి నంతనే శిష్యులు పెంపుడుజంతువులతోఁ గొంత కాలము గడపుదురు. తరువాతఁ దోఁటలో నూతికిఁ జేరువలోనున్న చెట్లకు, పూఁబొదలకు, లతలకు వలసిన యెడ నీరుపెట్టి, వాని మొదళ్లను బాగుచేయుచుందురు. ఇది వారి నిత్యకృత్యము. ఇంతలో వారి నిండ్లకుఁ గొంపోవ గుఱ్ఱపుబండ్లు వచ్చును.

అసలా యాశ్రమప్రదేశ మంతయు విజయేశ్వర సంస్థా-నములోనిది. విశ్వనాథుని ముత్తాతగారితండ్రి పూర్వమెప్పుడో విజయేశ్వరాధీశులకు మొట్టమొదట పౌరోహిత్యమును వహించినారట. నాఁటినుండియు విశ్వనాథుని పైనాల్గు తర-ములవారు నావృత్తియందే కాలముగడిపినారు. వారందఱు-ను వేదవేదాంగ పారంగతులు. వారెల్ల మూర్తిభవించిన వైదికజ్ఞానములనియు, సనాతనధర్మమునకుఁ బట్టుకొమ్మలనియు నేఁటికిని బొగడ్తకెక్కియున్నారు. జమీందారులు వారికి మహోన్నతమైన గౌరవ మొసంగుచువచ్చిరి. వీరును దమ

పవిత్రముల నా జమీందారులకు హితమాచరించుటలోనే గడపివేసిరి. అట్టి యవినాభావ సంబంధముగల్గి విశ్వనాథుని పూర్వులు విజయేశ్వర సంస్థానమునందే యుండి ప్రభువులను పరిరక్షించుచునే వచ్చిరి.

విశ్వనాథుని యన్నగారు వంశపారంపర్యముగా వచ్చుచున్న పౌరోహిత్యమును చేపట్టినప్పటికి విశ్వనాథుఁ డింకను బుట్టనేలేదు. తల్లిదండ్రులకు వృద్ధాప్యమునం దాతఁడు జన్మించెను. అందువలనఁ దండ్రి కాతఁడన్నచోఁ బంచప్రాణములాయెను. ఏ దైవాంశమో యిట నవతార మెత్తెనని యభిమానముప్పొంగిపోవుచుండువారు. విధి యాసంతోషమును సహింపలేకపోయినది. విశ్వనాథుని కైదేండ్లు వచ్చినప్పటికే 'విశ్వనాథుఁడు భద్ర' మని పెద్దకుమారునితోఁ జెప్పి యాయన మరణించెను. తల్లియుఁ దండ్రి ననుసరించెను. అందువలన నన్నయు, వదినయు విశ్వనాథుని బిడ్డగా లాలనమును జేసిరి. విశ్వనాథుఁడు జన్మతః పెంకివాఁడు. అట్టిమొండ నన్నయు వదినయు నిచ్చు చనవుచే నాతని యల్లరి మఱింత మితిమీఱినది. పదేండ్లు వచ్చినను వానికిఁ జదువుసంధ్యలు పట్టలేదు. పురోహితుని తమ్ముఁడు కాన విశ్వనాథుఁడును దివాణములోనికి రాకపోకలు సాగించెను. తన సమవయస్కుఁడగు రాజకుమారునితోఁ బరిచయమును సంపాదించి వానితోఁ నాట పాటలు మొదలు పెట్టెను. విశ్వనాథుని చిత్తము పెనసాంపుగానుండును. రాత్రిఁడు సనివాసములు తీయు నున్నప్పుడు దివాణమునందలి

నెమళ్ళన్నియు వానిచుట్టును జేరి షడ్జమస్వరాలాపము నలవఱచు కొనెడివి. ఆ స్వరమున్నచో రాజకుమారుఁడు చెవికోసికొనును.

ఒకనాఁటిసాయంసమయమం దిరువురును మామిడితోఁటలో నాడుకొనుట మొదలు పెట్టిరి. చాలసే పాడియాడి యొక చెట్టుక్రిందికిఁ జేరినారు. అట నొక్కయొక బండఱాయి యున్నది. రాజకుమారుఁడు దానిపైఁ గూర్చుండఁబోయెను. వానిని ప్రక్కకుఁద్రోసి విశ్వనాథుఁడు తానే యందుఁ గూర్చుండెను. ఆ త్రోపులో రాజకుమారుఁడు తూలిపడి నిలువఁద్రొక్కు కొనినాఁడు. వానికిఁ బట్టరాని కోపము వచ్చినది. తెసి పెంకి తన మంతయు మొగమున నుట్టిపడ విశ్వనాథుఁ డేమియు జరుగనట్లే నిశ్చలుఁడై ఱాతిపై కూర్చుండియుండెను.

రాజకుమారుఁడు—'నన్ను క్రిందికిఁ ద్రోసివేయుటకు నీ వెవ్వఁడవు? ముందు ఱాయిదిగి మఱిమాట్లాడుము!' విశ్వనాథుఁడు భ్రుకుటి ముడివైచి 'నన్నట్లడుగుటకు నీవెవ్వఁడవు?' అని ప్రశ్నించెను.

రాజకుమారుఁడు—'నేను విజయేశ్వర సంస్థానాధీశుని కుమారుఁడను. నీకుఁ బ్రభువను.'

విశ్వనాథుఁడు—'వెఱ్ఱీ! నేనువిశ్వనాథుఁడను. తెలిసినదా? ప్రపంచమునకంతకును ప్రభువనన్న మాట. నీవా నాకుప్రభుఁడవు?'

వాహ్యాళికై బయలుదేరిన జమీందారును, పురోహితుఁడును నాసమయమునకే యచ్చటికిఁ జేరినారు; చేరి తాము వారికిఁ గన్పడకుండ నొక మ్రానిప్రక్క కొదిగి నిల్చిరి.

విశ్వనాథుని జవాబు రాజకుమారునికిఁ దలకొట్టిన ట్లయినది. పురోహితుని తమ్ముఁడా తన్నవమానించునది! వానికి రోష మెక్కు డయ్యెను.

రాజకుమారుఁడు—"నీకుఁ గన్నులు కనఁబడుటలేదు. పొగరెక్కి మాట్లాడుచున్నావు. త్రొవ్వఁగఁగలను."

విశ్వనాథుఁడు రివ్వునలేచి చేతికోలఁది రాజకుమారుని జెంపపైఁ గొట్టెను. రాజకుమారుని సుతిమెత్తని మొగము కందగడ్డవోలెనైనది. పురోహితుడు నిశ్చేష్టితుఁ డయ్యెను. వాని యొడలు వణఁకినది. తా నొక్క పరుగునఁబోయి తన తమ్ముని—తన ప్రేమయు, గారాబము నెటుపోయెనో— చీల్చి చెండాడవలె ననుకొనెను. కాని జమీందారుగారు వారించిరి. వారి మొగమున నేలాకో మందహాస రేఖలు దోఁచినవి.

రాజకుమారుఁడు కొంతవడికి గ్రుక్క తిప్పుకొని పండ్లు పటపట నూరసాగెను.

విశ్వనాథుఁడు 'మిత్రమా! కొవ్వు ఎవరి కణఁగినది? ఇఁక నెప్పుడు నట్టి ప్రేలుడు రానీకు సుమా!'

రాజకుమారునికిఁ గోపాతిరేకమున మాట రాలేదు. ప్రక్కనే పడియున్న యెండుమామిడిపుల్ల నొక దానిని దీసి దానితో విశ్వనాథునిఁ గొట్టబోవునంతలో—

'నాన్నా! తప్పు, తప్పు,' అనుచు జమీందారుగారు వేగముగ వచ్చి కుమారుని చేతిలోని కట్టె నావల పాఱవైచిరి.

ఆయనవెంటఁబురోహితుఁడును వచ్చెను. వారినిఁగాంచి బాలు రిరువురును దొల్లిపోయిరి. విశ్వనాథుఁడు సిగ్గునఁ దలవాల్చెను. రాజకుమారునికి దుఃఖ ముప్పొంగినది. పురోహితుని కను లెఱ్ఱవాఱెను. జమీందారు మొగమున శాంతము తొణికిసలాడినది.

'నాయనా! నీ కింత కోపమేల?' అని జమీందారు గారు కుమారుని లాలించిరి. తన తండ్రి విశ్వనాథునిఁ దప్పక శిక్షించునని రాజనగారుఁ డనుకొనెను. కాని, యాయన యంత శాంతమును వహించెనేమి? పైగాఁ దనకుఁ గోపముకూడ వలదనుచుండెనే! రాజకుమారుని కిది మఱియుఁ జిత్రమయ్యెను. దీన వాని కోపము సగము తగ్గిపోయినది. జమీందారుగారు విశ్వనాథుని, వాని యన్నగారినిఁ జూచి—

'నాయనా! వీరు మన వంశమునకు బ్రహ్మలు. ఎంత కోపము వచ్చినను మనము వీరిని నేమియు ననరాదు. తరతరములనుండి మనకు వచ్చిన మూలధనము శాంతము. అట్టియెడ నేఁడు మనము వైదిక ధిక్కారమునకుఁ బూనుకొనుట మన పూర్వుల నవమానపఱచుటయే యగును......' అని జమీందారుగారు కుమారునికి బోధించినారు. ఆ పల్కుల యర్థ మప్పుడు వానికి విస్పష్టముకాలేదుగాని వారి నేమియు ననగూడదు కాఁబోలు నని వాని పసియెడంద యూఱటచెందినది. వాని కోపము పూర్తిగా తగ్గిపోయెను.

విశ్వనాథుఁడు తలయెత్తిచూచినాఁడు. జమీందారుగారి మోమున దివ్యతేజ మేదియో వాని కనులకు విభ్రమము

కల్గించెను. రాజకుమారుని మొగమున గాఢమగు ప్రేమ యును, గ్రొత్తగావచ్చిన వినయమును దోఁచినవి. ఆ జమీం దారుల సంస్కారపటుత్వమునకుఁ దన యన్నగారి కనులు జోహారులు సేయుచున్నవి. రాజకుమారుఁ డెట్టి యర్థముతో ననినను, ప్రభు వను పదమున కర్థమేమో విశ్వనాథుని కొకింత యిప్పు డవగాహనమైనది. ఇఁక నాతఁ డట నిలువ లేడు. చెరచెర ఇంటికి నడచివెళ్ళినాఁడు. విశ్వనాథు నేమియు ననవలదని పలుమఱు చెప్పి జమీందారుగారును బురో హితునికడ సెలవు తీసికొనిరి.

విశ్వనాథుఁ డారాత్రి యన్నగారితోఁబాటు భోజనము నకు రాలేదు. తమ్ముని బిలువుమని యన్నయును జెప్ప లేదు. ఏదియో జరిగినదని వదినగారు భయపడినది. విశ్వ నాథుఁడు వెక్కి వెక్కి యేడ్చుచుఁ బరుండినాఁడు. వదినగారు మడిబట్టమాట మఱచిపోయి ముద్దుల మఱఁది ప్రక్కలో గూర్చుండి యనునయించినది. దుఃఖకారణ మడిగినది. ఆతఁడు చెప్పలేక పోయినాఁడు. 'బాబూ! విచార మెందుల కయ్యా! నీ కేమి కావలయునో చెప్పుము. నిమిషములో నేను నీకిత్తును. లేచి ముందు భోజనము కావింపుము.' అని బ్రతిమాలినది. ఆమె పుత్రుఁడు రెండేండ్లవాఁడు వచ్చి, విశ్వ నాథుని మొగములో మొగముపెట్టిచూచినాఁడు. 'బాబా యివి, చూడు, నిన్ను వాడు పిల్చుచున్నాఁడు. నీవు భోజ నము సేయలేదని వానికిని దిగులైనట్లున్నది. లేవోయి విశ్వ

నాథా!' అని యామె యన్నది. 'విశ్వనాథా!' యనుటతోడనే యాతఁ డులికిపడినాఁడు. లేచి, దుఃఖమును దిగమ్రింగి యన్నము ముందు కూర్చుండెను. కాని యన్నము రుచించినది కాదు. భోజనానంతర మన్నగారు పిల్చినారు. భయపడుచుఁ బోయి విశ్వనాథుఁ డన్నసమీపమునఁ దలవాల్చి నిలువఁబడెను.

'తమ్ముఁడా! నీవు పెద్దవాఁడ వగుచున్నావు. చదువుకొన వలయును. మన పూర్వు లందఱును విజ్ఞానసంపన్నులు. అది మన ధర్మము. నీవు వంశమునకుఁ బేరు తెత్తువని మన తండ్రిగా రాశించినారు. నీవిట్లల్లరిచిల్లరిగాఁ దిరుగుట బాగుండ లేదు......' అని యన్నగారు బోధించిరి. తన్నేమి కోపించునో యని కంపించుచున్న విశ్వనాథుఁడు తన యన్నగారిని జమీందారుగారి సమీపమున నిల్పి చూచినాఁడు. ఓహో! ఆతఁ డుదాత్తుఁడైన జమీందారు. ఈతఁ డాయనకుఁ దగిన పురోహితుఁడు. సరిపోయినది. లేనిచో నా యొక్క సంస్కార మెచ్చటనుండి వచ్చును? తమ్ముఁ డన్నగారి బోధనలకుఁ దలయూపి వచ్చి పరుండెను. వానికి నిదుర పట్టినదిగాదు. ఆలోచింప సాఁగినాఁడు.

'నాకుఁ బదేండ్లు వచ్చినవి. అక్షరములు వ్రాయుట కూడ రాదు. ఊహ తెలిసి నప్పటినుండియు నే నల్లరిచిల్లరిగానే తిరుగుచున్నాను. అన్నయును వదినయు నిచ్చిన చనవునకు సత్ఫలితమును జూపలేకపోతిని. నా తోడివా రందఱును జాల వఱకుఁ జదువుకొనినా రప్పుడే. నేనును జదువుకొనవలయును.

'మా పూర్వు లందఱును విజ్ఞానసంపన్నులు. విజ్ఞానమే మా ధర్మమఁట. అన్న యెంత చక్కఁగాఁ జెప్పినాఁడు! వంశపారంపర్యముగా వచ్చుచున్న ధర్మమును నేనేల త్రోసి వేయవలెను?

'వంశమునకు పేరు తెత్తునని మా తండ్రిగా రాశించినారఁట. కుమారునిపైఁ దండ్రి కట్టి విశ్వాసముండును గాఁబోలు! నావలన నట్టిపని యగునా? ఏల కాఁగూడదు! నావలనఁ గానిపనియే యగుచో విజ్ఞులైన తండ్రిగా రాపనిని నావలన నేల యాశింతురు?

'అన్నను, నన్నును కుమారునికిఁ జూపి 'వీరు మన వంశమునకు బ్రహ్మ' లని జమీందారుగారు చెప్పినారు. దాని యర్థ మేమి? సనాతన ధర్మమునకుఁ బట్టుకొమ్మలైన వారి యింటఁ బుట్టినాను. అందువలన నేనుగూడ బ్రహ్మ నగుదునా? నాయం దంతటి యర్హతయున్నదా? రాజకుమారుఁడును నన్నేమియు ననఁగూడదఁట! ఇది నా పూర్వజన్మకృతపుణ్యలేశమై యుండవచ్చును.

'ఆ జమీందారుగారి మొగమున నదేమి అట్టి దివ్యతేజము వెలుంగుచున్నది? కుమారునిఁ గొట్టిన నన్నేమియు ననలేదే! శాంతముయొక్క ప్రభావ మట్టిది కాఁబోలు! జమీందారు లెంత నిగ్రహశక్తిని సంపాదించుకొన్నారు! శాంతము వారికిఁ దరతరములనుండి వచ్చుచున్న మూలధనమఁట—విజ్ఞానమే మా పూర్వులఁట; మా పూర్వులే

విజ్ఞానమఁట! ఈ రెండు వంశములును రెండు మహాధర్మము లకు మూలపీఠములై యున్నవి. ఆ రెండు గుణములను నాం యందు నేనేల నైక్యపఱచరాదు?

విశ్వనాథుఁడు దీర్ఘయోచనలలో మునిఁగినాఁడు. అట్టి దివ్యశక్తులను సంపాదించు టెట్లు? ముందు తాను విజ్ఞాన మును సాధించవలెను. అ దెట్లు వీలగును? అప్రయత్నముగ వాని దృష్టి కాశిపై మరలినది. తన ముత్తాతగారు కాశిలో వేదవేదాంగములను జదువుకొనినారని యాతఁడు వినియుండెను. అది గొప్ప విద్యాకేంద్ర మనికూడ నాతఁ డెఱుంగును. అందుచే నచ్చటనే తాను విద్య నభ్యసించుటకు నిశ్చ యించుకొనెను. తనవి మూడే పథములు—యోగము, సంగీతసాహిత్యములు. ఈ యభిప్రాయము కుదురుటతోడనే యాతఁడు చివాలునలేచి, యన్నగారియొద్దకు వెళ్ళి తననిశ్చయ మును దెలియపఱచెను. వాని నిర్ణయము దృఢమైనదని యెఱింగి తమ్ముని విడిచియుండుట కష్టమయ్యును మనసారా దీవించి యన్నగారు సెలవొసంగిరి. వదినగారును వాని శిర మును మూర్కొని 'నాయనా! మీ తల్లిగారి యాత్మకు నమ స్కరించి మఱి వెళ్ళు' మని చెప్పెను. విశ్వనాథుఁ డట్లేచేసెను.

## 2

పదాఱు సంవత్సరముల కా విశ్వనాథుఁడు తిరిగి యింటికి వచ్చినాఁడు.

నాఁటి విశ్వనాథుఁడు వట్టి పోకిరి. అక్షరజ్ఞానము లేని వాఁడు.

నేఁటి విశ్వనాథుఁడు వినయభూషణుఁడు; వేదవేదాంగ పారంగతుఁడు; లలితకళావేత్త.

నాఁటి విశ్వనాథుఁడు సంగీతజ్ఞానములేక కూని రాగములు తీయు బాలుఁడు.

నేఁటి విశ్వనాథుఁడు సంగీతశాస్త్రమును గూలంకషముగ నెఱింగిన మహావిద్వాంసుఁడు.

నాఁటి విశ్వనాథుఁడు ముక్కోపి. ఆతనియంత ధూర్తుఁ డాతఁడే.

నేఁటి విశ్వనాథుఁ డహింసామూర్తి. భూతదయాళువు. శాంతము కరడుగట్టిన జితేంద్రియుఁడు.

రాజకుమారునిఁ గొట్టిననాఁటి రాత్రి విశ్వనాథుని యపర వశ్వ వ్యాకరణము మథింపఁబడినది. ఆ మథనమే వాని నేఁటి యీమార్పునకుఁ గారణము. వాని కళావేతృత్వమువలెనె వాని యహింసాతత్త్వమును మిక్కిలి పరిపక్వమగు స్థితికివచ్చినది. ఈ స్థితిలో విశ్వనాథుఁ డింటికి దిరిగివచ్చెను.

విశ్వనాథుఁ డూరలేని కాలమున విజయేశ్వరమునందు పెక్కుమార్పులు జరిగినవి. విశ్వనాథుని యన్నగారు వృద్ధులైనారు, వారి పుత్రులు పెద్దవారై సంసారమును దిద్దుకొనుచున్నారు. అన్నమాత్రము మహావిద్వాంసుఁడై రాబోవు తమ్ముని జూడ కన్నులు కాయలుకాచునట్లు ప్రతీక్షించు

చుండెను. విశ్వనాథుని మాతృనకుఁ గారణభూతులైన పెద్ద జమీందారుగారు చనిపోయిరి. వారి పుత్రుఁడు జమీందారయ్యెను. ఆయనయే విశ్వనాథుని బాల్యస్నేహితులగు కుమారరామ సాహానులు. తండ్రికిఁ దగిన కొడుకని కుమార సాహానులు కీర్తికెక్కినారు. దాతృత్వమునకు, కళాభిజ్ఞతకు, రాజనీతినైపుణ్యమునకు నాయన తన పూర్వుల నతిశయించె ననుటలో సందియము లేదు.

విజయోత్సవముసందడుగిడుటతోడనే విశ్వనాథుఁడు పెద్ద జమీందారుగారి దర్శనమునకై దివాణమునందు వాకబు చేసెను ఆయన మరణించిన సంగతి తెలియంగఁడు. వారు మరణించిరని చెప్పఁగానే విశ్వనాథుని యుత్సాహము సగము చచ్చిపోయినది. (జీవితాంతమువఱకు జ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల వాని కిది బాధాకరముగనే యుండెడిది) గిరుక్కున వెనుదిరిగి తన యింటికి వచ్చినాఁడు. దివాణము సేవకులు విశ్వనాథుని గుఱించి జమీందారుగారితోఁ జెప్పనేఁగిరి.

అనుకోకుండగనే తమ్ముఁడు కంటఁబడుటచే నన్నగారి యానందమున కవధిలేకపోయినది. హృదయము పట్టని వాత్సల్యమున నానందబాష్పములతోఁ దమ్ముని శిరము నభిషేకించి నాఁడు. అన్న తండ్రియంతవాఁడు. తండ్రికి నమస్కరించునట్లే తమ్ముఁ డన్నకుఁ బ్రణమిల్లెను.

'తమ్ముఁడా! నేఁడుగదా మనధర్మము నిల్చినది. నేఁడుగదా మన నాయనగారి యాశలు ఫలించినవి. నేఁడుగదా నాకు

విశ్వనాథుఁడు నాతమ్ముఁ డన్న గర్వము కలిగినది' అని యన్నగా రుప్పొంగిపోయిరి. వదినయు మఱందిని మాతృవాత్సల్యముతో నాదరించెను.

“విశ్వనాథా! మన పెద్ద జమీందారుగారు మరణించినారు సుమా. చనిపోవుముందు కూడ 'మన విశ్వనాథుఁ డిప్పు డేశాస్త్రమును జదువుచుండునో' యని నిన్ను స్మరించినారు. నీవింత కష్టపడి చదువుకొని వచ్చినందులకు వారే బ్రతికియున్నచో నెంత యానందించెడివారో?”

పెద్దజమీందారుగారి మరణమునకు వారును చాల విచారించిరి. శాస్త్రిగారబ్బాయివచ్చి యన్నదమ్ముల నిరువురను భోజనమునకు లెమ్మనెను, ఆప్యాయముగ భుజించుచు 'వదినా! ఎంతకాలమునకు దొరికినది మళ్ళీ నీచేతిభోజన' మని విశ్వనాథుఁ డానందపడినాఁడు. సాయంకాలమున జమీందారు గారు కబురంపిరి. వెళ్లునప్పటికి మామిడితోఁటలో నున్నారని తెలిసినది. అటఁ దమ చిన్ననాఁటి తగవులకు కారణమైన బండఱాతిపై రామమోహనులు కూర్చుండి యుండిరి. శాస్త్రిగారితోఁ గూడ వచ్చుచున్న విశ్వనాథుని రామమోహనులు మొదట చూచుటతోడనే గుర్తించుట కష్టమయ్యెను. తేజోమయమగు విశ్వనాథునిమూర్తి వారి కాశ్చర్యము కలిగించెను. ఆయన ముందునకు సాఁగి విశ్వనాథునకప్రయత్నముగా నమస్కరించెను. విశ్వనాథుఁడు వారి చేతులు పట్టుకొని నిల్చినాఁడు. రామమోహనుల కాశ్చర్యముపై నాశ్చర్యము !

నాటినిముసము లో నా బాల్యమిత్రు లిరువురును గాఢముగు కౌగిలిలో, నానందబాష్పములతో, విస్మయులై నిల్చిరి. వారి నిరువురను జూచి శాస్త్రిగా రానందపరవశులైనారు.

జీవితములో నేదేని యొక మహాకార్యమును నిర్వహింప వలెనని విశ్వనాథునికి గట్టి యభిలాష యున్నది. వారణాసిలో వాని గురువులును నంతియు. అందువలన విశ్వనాథుఁ డుద్యోగమును చేయ నభిలషింపలేదు. వానికి యోగాభ్యాసము నందత్యంత ప్రావీణ్యమును, మంచిప్రవేశము నున్నవి. నాగరిక జీవముచేతను శాస్త్రవిహితవిజ్ఞానము చేతను నావృతమై వానిమోము దివ్యకాంతుల నీనుచున్నది. ఈ విషయమంతయు నాకలింపుచు వచ్చిన కుమారస్వామిగారు గోపూరుగ్రామ (ఇప్పటి వ్యాయామశాలకు నాలుగు క్రోసులదూరము) పరిసరమున గల యొక్క మంచిప్రదేశమును విశ్వనాథుని మహాయోగార్థ మిచ్చి వేసి, వాని నట నుండుమని వేయువిధముల బ్రార్థించిరి. విశ్వనాథుఁ డంగీకరించెను.

ఆ కాంతప్రదేశము మొత్తము నూఱెకరముల వైశాల్యము కలది. దీర్ఘచతురస్రాకారముగా నది పొడవునను జాలవఱకు వ్యాపించి యున్నది. అందు సమస్త ఫలవృక్షములు, లతలు, పొదలు నున్నవి. అడవి పొదలపై, గుజ్జుగా నున్న వృక్షములపై, పూలతీఁగెలు దట్టముగా నలముకొన్నవి. వాని కేమియును కృత్రిమపోషణ జరుగలేదు. నలయున్నచో విజయేశ్వరాధీశుఁడు వందలకొలఁది తోఁట

మాలులను బంపును. ప్రకృతి సౌందర్యములకే విశ్వనాథుఁడు ప్రాధాన్య మిచ్చువాఁ డగుటచేఁ దోఁటమాలుల యవశ్యకత లే పోయినది. సహజములగు ప్రకృతి రామణీయకములను బరికించి చూచి విశ్వనాథుఁ డొక్కొక్కప్పుడు తన్మయుఁడై పోవుచుండును. సంధ్యాకాలములందు గోదావరియొడ్డున పిరాంగ నిలుచుండి చుట్టుపట్టులను బరికించుచున్నప్పుడు వాని కొలఁతల్ తెలిసెడిదిగాదు. ఒకప్రక్క పాపికొండల వరుసలు; వాని నోరసికొనుచుఁ బ్రవహించు మహానది గోదావరి; ఉదయించుచున్న సూర్యుఁడు, లేక యస్తమించుచున్న సూర్యుఁడు; గోష్పాదక్షేత్రస్థ శివాలయపు ధవళకాంతులు; పక్షులగోలఁ గలకలలాడుచున్న వటవృక్షము; కుటీరము వెనుకనున్న ప్రకృతి రామణీయకములు; ఆ ప్రక్కగా నొకింతదూరమున జనసమ్మర్దముతో నున్న గోవూరు......ఒకటి యననేల ? ప్రతి పరమాణువునందు నున్న సృష్టిసౌందర్యములను విలకించి వానియం దంతర్యాతమైయున్న యేకత్వమును దర్శించి సృష్ట్యనంతరము తన సృష్టిని గాంచి తానే వెఱఁగుపడు విశ్వనాథునివోలె విశ్వనాథుఁడు సంభ్రమించుచుండెడివాఁడు. ఆంధ్రుఁడనై జన్మించుటే కాక యతిపవిత్రమగు గోష్పాదక్షేత్రమున నివసింప ననువుపడినందునఁ దన జీవితమే యుత్కృష్టమైనదని వానికిఁ గించిద్గర్వముకూడఁ బొడముచుండెడిది.

దూరమునుండి చూచిననో ఆ యాశ్రమ ప్రదేశము చిన్న కాఱడవివలెఁ గన్పించును. లతాగృహములు చేర

శక్యముకాని దట్టమైన పొదలువలెఁ జారిపోయినవి. కంటకా
వృతములగు తీఁగెలు చెట్లపై బిలిబిలిగా నల్లుకొన్నవి: అం
సను ఆశ్రమమునఁగాని, యాచుట్టుప్రక్కలఁగాని విషసర్పమృగ
తస్కరాదులవలని భయమావంతయును లేదు. అహింసా
మూర్తియగు విశ్వనాథుఁడున్నచోట హింసకును, క్రూరత
కును దావెక్కడిది?

అట్లు లేడినిఁ దీసికొని రజనీకుమారియును, కృష్ణరాయ
లును గుటీరప్రాంతములకు మెల్లమెల్లన వచ్చిరి.

'రజనీ! నేఁడు శ్రావణపూర్ణిమకదా? గురుపాదుల
జప మప్పుడే ముగియువేళ యైనదంటివేమి?' అని రాయలు
ప్రశ్నించెను. రజని మందహాస మొనర్చినది. ఆ హాసము
వెనుక కించి ద్గర్వరేఖకూడనున్నది.

"అట్లననిచో నీవాకపట్టున లేడినిఁబట్టుకొనియుందువా?"

"అయినచో నిప్పుడు వదలివేసెదను..."

"నీవిప్పుడు వదలివేసినను, అది పాఱిపోదు. నీకా విష
యము తెలియదు కాఁబోలు."

రాయలు లేడిమెడకుఁ జుట్టిన తన యుత్తరీయమును
దీసివేసెను. అది కదలలేదు. బెదరించినాఁడు. కృష్ణ రసాలము
క్రిందికిఁ బోయినది. అది దానికివిశ్రాంతిస్థలము. రజని రాయల
వైపుచూచినది. రాయలు కృష్ణవైపుచూచినాఁడు.

"రజనీ! కృష్ణకూడ నీయంత బుద్ధిమంతురాలేసుమా!"
—రజని మాటాడలేదు. వారిరువు రింకను నడచుచునే

యుండిరి. ఎక్కడికో?... వారికే తెలియదు. అంతర్గాఢ హృదయము లాఘ్రాణింపు మచున్నవి. పాదములు నడచుచున్నవి. అంతలో "అక్కా!" అని వెనుకనుండి పిలుపు వినఁబడెను. రజని యులికిపడి వెనుదిరిగి చూచినది. "ఎక్కడికి?" అని జామిచెట్టుపై నూర్చున్న రామచిలుక యడిగినది. "ఎక్కడికో నీకెందులకు?" అని రాయలు విసుగుతో నేమోయనుకొని నాఁడు. ఆచార్యుఁడు లేచునేమోయని రజని కలవరపడెను. చిలుక ... ను వ్రేలాడుచున్న జామిపండునకు చిన్న తాటి... కట్టబడి యున్నది. ఆపండు తినవలెనని చిలుకయూహ. రజనివచ్చి బుట్టనుపిప్పి పారవేసెను. చిలుక తిండిపోతు... పడినది. రజనివచ్చి రాయలను గలిసికొనెను. ఇరువురు నెడమెడముగా నడచుచుండిరి. కాని తామిరువురు నిట్టుకలిసి నడచుచుండుట వారికే చాల క్రొత్తగా నుండెను.

"రజనీ! ఇంక పదిరోజులలో నీ విద్యాభ్యాసము పూర్తి యగును..." అని రాయలు శ్వాసను బిగఁబట్టి యున్నాఁడు. రజని యూతని మొగమువైపు చూచినది.

"అవును. దశమినాఁడు మానాయనగారు వత్తురఁట" అనియన్నది రజని. అశ్రుబిందులకన్నదో యామెకే తెలియదు.

"ఎందుల" కని రాయలు ప్రశ్నించెను. ఏమిచెప్పవల యునో యని రజని యాలోచించినది.

"నా విద్యాభ్యాసము పూర్తియగును గదా? గురు పాదులనుండి సెలవు గైకొనుట కేమో!" అని రజని సమా

ధ్యానము చెప్పెను...ఇరువురును వడిగా నడచుచుండిరి. రాయలు మరల బల్కరించెను.

"రజనీ మనము పండ్రెండు సంవత్సరములు కలిసి చదువుకొన్నాము..."

"కాదు. ఆఱుసంవత్సరములే కలిసి చదువుకొన్నాము" అని రజని యన్నది.

"ఎట్లు? మనము తారణసంవత్సరములో నిట ప్రవేశించితిమి. ఇది మన్మథసంవత్సరము..."

మన్మథ సంవత్సర మనగనే రజని పెదవులపై చిరు నగవు చిందులాడినది. అంచులలో నీషల్లజ్జారేఖకూడ నున్నది.

"నవ్వెదవేల రజనీ! మన్మథ సంవత్సరము కాదా యిది? లేక ఆపేరు నీకు బాగుండలేదా?"

"చాల బాగున్నది..."

"పేరికి దగిన ట్లీసంవత్సరము చాల నానంద దాయకముగ లేదా, రజనీ!"—రాయల ప్రశ్నకు సమాధానముగ రజని కన్నులలో నానందమే వెల్లివిరిసినది.

"రజనీ! తారణమొదలు మన్మథమువరకును పండ్రెండు సంవత్సరములు కాలేదా?"

"ఈ పండ్రెండు సంవత్సరములలోను ఒక్క పగటి పూటలందు మాత్రమే మన మిచ్చట కలిసి చదువుకొంటిమి. రాత్రులం దిచ్చట లేముకదా?" సమాధానమునకు రాయ

లుత్సాహముతో నడచెను. ఆసన్నపులో వాని యోటమియును ప్రకటిత మయ్యెను.

గురువుగారు పొగడచెట్టుక్రిందికి చేరినారు. అది చాల ఎత్తుగా పెరిగియుండుటచే దానిక్రింద మిక్కిలి చల్లగా నున్నది. గురువుగారు అక్కడి తిన్నెపై నాసీనులైరి. ఏమి మాట్లాడుకొనవలెనో యున్నదో వారికి తెలియుచుకొనలేదు. ఏమి మాట్లాడుకొనవలయునో కూడ వారికి తోచుటలేదు. ఏదో మాట్లాడుకోవలెనని మాత్రము హృదయములు కొట్టుకొనుచున్నవి. ధైర్యము చాలుటలేదు. చాలకాలము నుండి గుర్తు యుపన్యాసమునకై వారెదురు చూచుచున్నారు. గత భీష్మస్త్రీకాదశినాఁడు వ్యాసపూర్ణిమ రోహితయు యోగ నిష్ఠలోనుండుటచే నాఁడిట్టి యుపదేశము లభించినది. కాని యిట్టివనే యేమి మాట్లాడవలయునో తెలియకగ, విష్ణ్వర్యకాలమును ఊరకగాఁ గడిపివేసినారు. ఇందుకూర్చి నవ లనే యున్నవి.

వారి హృదయవేగముకన్నను, వేగముగాఁ బ్రొద్దు గ్రుంకనున్నది. గురువుగారి మనసులం దొక్కటే యూహ యున్నది. మొట్టమొదట వెలువడుచ్చుట కిరువురును జంకుచున్నారు కాని యిరువురి మనసు లంతలోనే తహతహ పడుచునే యున్నవి. వారి కెదురుగా గోదావరి గట్టుమీఁద నుండి పాపిరెండల నసుసలు, నాఁడెనుకఁ దూర్పుకనుమలు నస్తమించుచున్న సూర్యకాంతిపడి మబ్బు దొంతరులవలె

మనోహరముగాఁ గన్పడుచున్నవి. అన్య విషయాసక్తుఁడైన రాయలు వానిని శూన్యదృక్కులతోఁ జూచెనే కాని రజనిని జూడుటయే లేదు. రజనియు చూచినదిగాని యాపె హృదయ మేమియును గ్రహింపలేదు. ఇట్టిస్థితిలోనున్న వారు తమ వెనుక నాకసమున నల్లనిమబ్బాకస్మికముగఁ బట్టుటను గుర్తింపలేదు. సూర్యకాంతి యడ్డఁబడుటచే నా కొండల వరుస లన్నియు నొక్క క్షణములో నీలములై పోయినవి. ఈ మార్పు వారిలో నొకింత చైతన్యమును గల్గించినది. ఏమో మధురములైన యాసలు రేకెత్తి యిరువు రొకరివైపొకరు చూచుకొనిరి. అంతలో వాయవ్యమూలగా నొక్క గాలి వీసుకువచ్చి వృక్షములను గదలించి పోయెను. ఆగాలి చల్లగా నుండుటచే రజని యవయవములను ముడుచుకొన్నది. రాయ లుత్తరీయమును గప్పుకొనెను. వర్షము వచ్చుచున్న ట్లున్నది గాని వారది గుర్తించినట్లు లేదు.

గాలిపాటునకు రజనివలెవాటు గాలిపటమువలె లేచి ప్రక్కనేయున్న కోరింతకంపపైఁ బడెను. రజని వెనుదిరిగి ముళ్ళకంపను వదలింపలేక పోయినది. అంతనాపె సిగ్గుతో సాహాయ్యము నపేక్షించెను. ఆపె యింగితమును గ్రహించి రాయలు సంతోషమున లేచివచ్చి రజని కూర్చున్న శిలపై నాపె ప్రక్కగాఁగూర్చుండి యొక్కొక్క ముల్లునే విదలింప సాగెను. అతఁ డట్లు కూర్చుండుటలో నాపె శరీరమును తాఁకియు తాఁకనట్లుండెను. ఆమె చలింపలేదు. వివశత్వముతో

నాపె కన్ను లరమూఁతపడినవి. రాయలుపైఁటచెంగును గోరింత కంపనుండి విడఁదీసినాఁడుగాని యద్దానిని విడువక చేతితోఁ బట్టుకొనియుండెను. రజనిపయ్యెద సరిదికొనఁ బ్రయత్నించెను. అంతట రాయలు రజనిచేతినిఁ బట్టుకొనినాఁడు. ఆమె వలదన లేదు. విదలించుకొనలేదు. ఇరువురి రక్తనాళము లందును విద్యుత్ప్రసారభావ ముదయించి, రక్తము కించిదుష్ణమై ప్రవహించినది. దేహములు పులకరించినవి. రజని సిగ్గున ననుభవములోలేని యానందమునఁ దలవంచినది. మధురలజ్జా విభ్రమములతో నాపె శరీరము కదలిపోయెను. రాయలీ యనుభవ విశేషమునుగూర్చి యాలోచించినాఁడు.

అనుదినమును మల్లెయూడల యుయ్యాలలపై రజనినిఁ గూర్చుండఁబెట్టి యూపునప్పుడు తా నామెను తాఁకియుండెను. కాని యాస్పర్శ తనలో నింతతిరుగుబాటు నెన్నఁడును గల్గించి యుండలేదు 'ఆ స్పర్శకును, దీనికి నెంతయో భేదమున్న' దని యాతఁడనుకొనెను. రాయలు చిబుకమునుబట్టుకొని యాపె తలను బైకెత్తెను. అహో! ఏమాముఖసంపద? సౌందర్యాధిదేవత యామెయే యగునా?...నిజముగ రాయ లామెలో నొక దివ్యత్వమును భావించినాఁడు.

'తానాపెదవులను చుంబించినచో?...' ఆ తలంపులోని యానందము వానిని మనోగతములగు నడ్డంకులను దాటించి మహావేగమున ముందునకుఁ గొంపోయినది. ఆతఁడా యానందమును భరించలేకపోయి రెండుచేతులను జాఁపి

రజనిని గట్టిగా హృదయమునకు హత్తుకొనినాఁడు. ఆమె మంత్ర ముగ్ధపగిది రాయలవక్షమునకు బల్లివలె నంటుకొని పోయినది. వారిరువురి హృదయములతోఁ బాటు శరీరములు నభిన్నమయి నట్లు తోఁచినది. జారిపోయిన వలెవాటును సర్దుకోవలయు నన్న యూహ రజనికిఁ దోఁచినట్లు లేదు.

పిల్లవాయువులవలన రాలుచున్న పొగడపూలతో వారిరువురి శిరములు నిండినవి. ఆశుభముహూర్తమున వనలక్ష్మి వారిపై శుభాక్షతలను జల్లెనేమో యనిపించినది. కమ్మనిపూల తావి పిల్లవాయువులతో మిళితమై నల్దిక్కుల వ్యాపించెను. సెంపుడు నెమ్మి యెటనుండివచ్చెనో కాని పురివిప్పి వారికెదురుగా నాట్యము సేయసాగెను. ఇంతలో నాకసమునందు దూరదూరముగ నున్న మేఘము లన్నియును, దట్టముగ నలముకొన్నవి. అటనుండి మిక్కిలి చల్లనిగాలి వీచెను. వారి శరీరము లొకింత చల్లఁబడినవి. రక్తప్రవాహవేగము తగ్గినది. సంభ్రమమునను్న హృదయములు కుదుటఁబడినవి. ఇరువురకును దెలివివచ్చెను.

రాయలు కౌఁగిలిని వదలినాఁడు. రజని నిలుచుండి వల్లెవాటును సర్దుకొనెను. మరల నిరువురి చూపులును గలిసికొన్నవి. అంతఁ దమలో నేమో సిగ్గుపడి తలలు వంచుకొనినారు. వారిని భయమావహించినది. ఇట్లు జరుగునని వారెన్నఁ డూహింపలేదు. ఇన్ని సంవత్సరములు కలిసి చదువుకొనినను, మఱ్ఱియూడల యుయ్యాలలపై నూగునపుడుతప్ప

న్నారొకరి నొక రెన్నడును తాఁకి యెఱుంగరు. తాఁకవలయు నన్న కోర్కెయే వారి కుదయింపలేదు. అట్టి యూఁగుటలలోఁ దాఁకినను, ఆ తాఁకుడులోని సౌఖ్యమును వా రనుభవించియుండలేదు. అట్టియెడ నీ విశేషము, ఈ నూతనానుభవము, ఈ స్వర్గసౌఖ్యము అనుకోకుండఁ బ్రాప్తించినది. ఈ విషయ మాచార్యునకుఁ దెలిసిననో యేమగును? ఆచార్యుఁ డేమిచేయునో వా రూహింపలేకపోయిరి. గుండెలు కొట్టుకొనసాఁగెను. ఎవరికి వారే దొంగలయినట్లు భయపడిరి. మరల నెదుటివారిచే తప్పని యూహించిరి. కొంతసేపు పయ్యెద నెగురవేసిన గాలినిఁ దిట్టిరి. కాని యా నిముసమం దనుభవములోనికి వచ్చిన సౌఖ్యమును దలంచి యట్టి సౌఖ్యమునకుఁ గారణమైన యా మారుతమును మనస్ఫూర్తిగా నాశీర్వదించిరి. ఇంతలో మేఘ మురిమినది. గింగురు మను నా శబ్దము వారి శరీరములం దణఁగిపోయెను. హృదయములు బరువెక్కినవి. ఆచార్యుఁడు పిలిచినట్లయ్యెను. వారి గుండెలలో మెఱుపు మెఱిసినట్లయినది. నెమిలి వారి కెదురుగా వచ్చెను. ఇంతవఱకు వారు దానిని జూడలేదు. తమ రహస్యమును కనుంగొన్న గురుదేవులు పంచిన వేగులవాని వగిది నా నెమిలి వారికిఁ దోఁచినది. తమ రహస్యము బట్టబయలైనది. గురుఁడు శిక్షించును. గత్యంతరములేదు' అని భయపడిరి. ఆచార్యుఁడు యోగసమాధిలో నున్న విషయమును వారు మఱచిపోయిరి.

రజనియు, రాయలు నడుగులు తడబడ వేగముగ్గ నడువఁ కొచ్చిరి. వారిని వెనుకనుండి వర్షము తఱుముకొని వచ్చెను. వారు పరుగిడ లేకపోయిరి. కుటీరమును జేరుసరికి నిరువురును బూర్తిగాఁ దడిసిపోయినారు. గుండెలు గుండెలలో లేవు. వటవృక్షమూలమునఁ దొట్టిలో యోగసమాధిలో నున్న తమ యాచార్యునిఁ జూచువఱకు వారి యాందోళనము తగ్గలేదు. తమ రహస్యము గురునకుఁ దెలియుట కవకాశము లేదని వారప్పుడు గ్రహించి మందహాసము లొనర్చిరి. రాయలు నుదుటిపైనున్న వానసీటిని దుడుచుకొనినాఁడు. రజని పావడ కుచ్చెళ్ళను బిండుకొన్నది. వారి గుండెలయదటు తగ్గినది. వెలుపల వర్ష వేగమును మందగించిన ట్లున్నది. ఇరువురును బొడివస్త్రములను గట్టుకొని, ఎవరి వస్త్రములను వారే యారఁగట్టి వాని చాటునఁ గూర్చుండిరి. విశ్వనాథుఁడు మఱునాఁటి యుదయమునకుఁగాని యోగసమాధినుండి యీవలకు రాఁడు. ఆరాత్రి యంతయు వారిరువురును మాటమంతియులేక గడపవలెను. ఆ తీయని నిముసమును దలంచుకొనుచు వారల్లె యొడ్డిగిలిరి.

## 3

అది మహైశ్వర్యముతో తులఁదూగు గ్రామరాజము. పంటలు సమస్తమును సమృద్ధిగా నచటఁ బండును. లేమిచే వెతలఁబడు నొక్కపౌరుఁడైన నందుఁ గన్పడఁడు. పంటసౌఖ్య

ముత్తో పాటు కుటుంబసౌఖ్యము ననుభవించుచు ప్రతిరైతును మహానందమునఁ గాలము గడపుచుండును. అచ్చటివారెల్ల స్వధర్మనిరతులై తమవృత్తుల నేమఱక నీమముతో నెఱవేర్చుచుందురు.

అచ్చట గోసమృద్ధి మెండు. ఆ గ్రామసౌభాగ్యమునకు మూలమైన కారణములలో ముఖ్యముగాఁ బశుసంతతిని పేర్కొనవలసి యున్నది. ఆ గ్రామవాసులు బాలగోపాలము గోసేవలో తమ్మునుతామే మఱచిపోదురు. రాత్రి నాల్గవ జామున లేచి రైతుబిడ్డ లావుదూడలను బాలుకుడుపుటకై విడిచిపెట్టెదరు. ఆసమయమునఁ బ్రతియింటను గోశాలల నుండి యింటియాఁడుపడుచులు పాలుపిదుకుచున్న చప్పుడులు కర్ణపేయముగా వినవచ్చుచుండును. అంతటఁ బాలేరు లరుగుదెంచి గోశాలలను శుభ్రపఱతురు. ముదుసలులులేచి స్వయముగాఁ గోవులకుఁ గుడితిపెట్టుదురు. సూర్యోదయకాలమునఁ గడుపునిండుగాఁ బాలుత్రావిన లేఁగదూడలు వేయు చిలిపి గంతులకుఁ దన్మయత్వమును జెంది కుడితిత్రావుట మాని నిలుచున్న యావులను జూచి యా ముదుసలులు పొందు సంతోషమును వర్ణింపఁ జాలము. ప్రొద్దెక్కుచుండగనే పాలికాఁపుపిల్లలు వచ్చి దూడలను గడ్డివాములయందు విడిచి యావులను బచ్చికబీడులలోనికిఁ దోలుకొనిపోదురు. గ్రామమునకు మూఁడువైపులను విశాలమైన భూములు గోవులు మేయు పచ్చికబీడులకై ప్రత్యేకింపఁబడి యున్నవి. (గ్రామమునకు

నాల్గవవైపున గోదావరినది యున్నది.) పచ్చిక సమృద్ధిగా నున్న దినములందా సమష్టియగు బీడులలో గోవులు మేయును. తదితర కాలములందు రైతులు గోవులకై ప్రత్యేకించుకొన్న సొంత బీడులలో మేయుచుండును.

సాయంకాలమున సూర్యాస్తమయ మగుచుండగా బసులతతి యిండ్లకు మఱలును. అప్పుడు పశుశాలలం దానంద లక్ష్మియే తాండవించుచుండును. పశువులింటికి మఱలు నప్పుడు మందల వెనుక పెద్దకొండలనుబోలి దుమ్ము రేగు చుండును. ఆ సమయమును గోధూళిలగ్నమందురు. గోధూళి లగ్నమందు ప్రయాణములుచేసినచో మంచిఫలితము లొసగ గూడునని యాగ్రామవాసులనమ్మిక. వారెల్లప్పుడు నా సమ యములందే పయనింతురు.

ఇంతపాడియున్నను, ఆగ్రామవాసులు పాలు పెరుగు లమ్ముకొనుట నెఱుంగరు. పేదరైతులు మాత్రము పొరు గింటినుండి యప్పుడప్పుడు పాలుపెరుగులను తెచ్చుకొను చుండెడివారు. పిల్లలుదయముననే యావకాయ యన్నములోc బెరుగుమీగడలను బోసికొని కడుపారc జల్దితిని పాఠశాల లకు వెళ్ళెదరు. అచ్చటివారు పిండివంటకములను నేతి తోడనే చేసికొందురు. ఆ గ్రామమున రోగపీడితులు మచ్చున కైనcగన్పడరు. జారచోరాది భయము లా గ్రామమెఱుం గదు. కారణము లేమి లేకపోవుట; నిత్యసంతృప్తి; ధర్మ భయము:—ఆ గ్రామముపేరు 'కుమారదేవము'. ఆ గ్రామ

ఏర్పడిన మొదటిరోజులలో కుమారుడు (కుమారస్వామి) దైనముగఁ గొల్లుచుండెనట. అందుచే దానికి గుమారదేవ మని పేరు వచ్చెను.

రామయ్యగారి పూర్వు లెప్పుడో ఆ గ్రామమునకు వలసవచ్చినారట. అప్పటినుండియు వా రచ్చటనే స్థిరనివాస మేర్పఱచుకొనిరి. రామయ్యగారి తాతగారికి నల్గురు కొడుకులు. వారిలో రామయ్యగారి తండ్రి కృష్ణయ్యగారు పెద్ద. ఆ నల్వురిలోను కృష్ణయ్యగారుతప్ప తక్కిన ముప్వురును నిరక్షరకుక్షులే. అయినను బూర్వకాలపువారు మడి దున్ని కొని బ్రదికినారు. నమ్ముకొనియుంటచే నాచల్లనితల్లి భూదేవియే వారలకుఁ గడుపునిండఁ దిండి పెట్టినది. కాని యా నల్గు రన్నదమ్ములును తమ చిన్ని రామయ్యను (ఆ నల్వురన్న దమ్ముల సంతానములోను తెలివిగలవాఁ డీయన యొక్కఁడే యని వారినమ్మకము) చదివింపవలెనని యుత్సహించెడి వారు. కాని రామయ్యగారి మనుపు నాఁగేటి చాలుపైనె యుండెడిదట. ఆయన చదువుకొనుటలేదని కోపమువచ్చి చిన్న పినతండ్రి యొకనాఁడు వారి కాలుసేతులను గట్టివేచి గోదావరి యావలియొడ్డునకుఁ బోవుచున్న నావలో బడవేసి నారట. అట్లు వానిని దీసికొనివెళ్ళి పిఠాపురములో నున్న రామయ్యగారి యప్పగారివద్ద చదువునకు నప్పగించి తిరిగి వచ్చినారు.

పూర్వపు పిఠాపురము చాలఁ జిన్నియూరు. మంచినీటి యెద్దడి చాలనెక్కువ. అందుచే మంచినీటికై చాలదూరము

వెళ్ళవలసి యుండెడిదఁట. ఆభారము రామయ్యగారి నెత్తిపైఁ బడినది. చిన్నకూజాబిందెకు ఉగ్గెనకట్టి నీరు తేవలెను. కాని యీపని రామయ్యగారికిఁ గష్టముగానే యుండెను. ఓపిక పట్టి పట్టి యొకనాఁడు కోపముతో నాబిందెను దారిమధ్యమున బండ రాతిపైఁ బగులఁగొట్టి యింటివద్ద చెప్పకుండ నదేదాని కుమారదేవము వచ్చివేసిరి. అప్పటినుండియుఁ జదువునకు స్వస్తిచెప్పి రామయ్యగారు వ్యవసాయములోఁ బడినారు. కాని పిఠాపురమువెళ్ళి నేర్చుకొనివచ్చిన విశేషములలో ముఖ్య ముగాఁ జెప్పవలసినది చుట్టయలవాటు. దానిని దెబ్బదియవ పడిలోఁగాని మాననేలేకపోయినారు.

అదేమి హస్తవిశేషమోగాని రామయ్యగారు పట్టిన దెల్ల బంగారమైనది. అడుగకుండగనే యిచ్చుమహాదాతవలె భూదేవి విశేషముగాఁ బండినది. కుమారదేవమునకుఁదూర్పున గోదావరియున్నది. శక్కిన మూఁడునైపులను విశాలమై, ఒకే సమానముగానున్న భూములుగలవు. పదేనువందల యెకర ముల వైశాల్యముగల్గి యాప్రదేశమంతయుఁ జూచుటకు మైదానమువలె మిక్కిలి మనోహరముగా నుండును. సమప్పియగా పచ్చికబీడులను దాఁటినతరువాత నూరికి దక్షిణమునను, బడ మటను గృష్ణయ్యగారికి నూటయేఁబది యెకరముల క్రొంద్ర యున్నది. అదియంతయును మొరకవ టయే. అందులో రామయ్యగారు వేసిన ధాన్యముపండినది. వారంచనావేసిన దానికిమించి యెక్కువపంట యింటికి వచ్చినది.

పిఠాపురమునుండి పాఱిపోయివచ్చిననాఁటికి రామయ్య గారికిఁ బదేండ్లు దాఁటినవి. కుమారుని తెలివితేటలను గ్రహించి కృష్ణయ్యగారు వ్యవసాయపుఁ బెత్తనమంతయుఁ గుమారుని కప్పగించి వేసినారు. పదుమూఁడవ యేఁట రామయ్యగారి వివాహమైనది. పెండ్లిసమయమునకు భార్య, యీశ్వరమ్మ గారు మూఁడేండ్లపిల్ల. ఊరేగింపు పాలకీలో నామె 'నిద్దర ఒస్తోందిబావా!' అనియన్నదఁట. 'ఇలా పడుకోవే పిల్లా!' అని రామయ్యగారామెను దమతొడపైఁ బరుండఁబెట్టుకొని జోకొట్టినారఁట. వారిరువురిని జూచుచున్న పెండ్లివారికి నవ్వాఁ కఁతులేక పోయినదఁట.

రామయ్యగారికిఁ బాతికేండ్లు దాఁటునప్పటి కీశ్వరమ్మ గారు కాఁపురమునకు వచ్చినారు. రామయ్యగారి హస్తమును మించిన దీశ్వరమ్మగారి పాదము. ఆమె కాఁపురమునకు వచ్చిన సంవత్సరము రామయ్యగారు చాలభూమిని కొన్నారు. ఆ మతము రెట్టింపు చేయఁబడినది. క్రొత్తగాఁ గొన్న భూములు చాల కాలమునుండి బీడువట్టియున్నవగుటచే నవి యమితముగు పంటను బండినవి. ఆపంటను నిల్వచేయుటకు రామయ్య గారు క్రొత్తగా గాదెలను గట్టింపవలసి వచ్చినది.

ఈశ్వరమ్మగారును, రామయ్యగారును ప్రాణైక జీవులు. ఈశ్వరమ్మగారి విధేయతయు, రామయ్యగారి యను రాగమును వానికవియే సాటి. ఆ పవిత్రదాంపత్యజీవితమునకు ఫలముగా నీశ్వరమ్మగారు కాఁపురమునకు వచ్చినవైదేండ్లకుఁ

కృష్ణరాయలు జన్మించెను. రామయ్యగారు మహావైభవముగ పుత్రోత్సవ మొనరించిరి. కృష్ణరాయలు పుట్టిననాడు తమ చిన్నయింటిని మార్చి గొప్పసౌధమును గట్టవలెనను నూహ రామయ్యగారికి దట్టినది. తోడనే యందులకు దగిన పని వాండ్రను రప్పించి వేగముగ సౌధనిర్మాణమునకు బూను కొనినారు. ఆ సౌధము పూర్తియగునంతకు రెండేండ్లుపట్టినది. మహారాజసౌధములను మించుచు గొప్పశిల్పపు బనులచే నది యలరారుచుండెను — రామయ్యగారు శిల్పమున్న జెవి కోసికొనువారు. సౌధమునకు దక్షిణపు దిక్కునను పడమటి దిక్కునను నందనోద్యాన వనమును మించు నుద్యాన వనమును వేయించిరి. సౌధమునకు ఉక్కన రెండు ప్రక్కలను ఆకుల పసందుగల చిన్నరకపు మొక్కలు, వింతరంగుల పూల మొక్కలు వరసలు తీర్చియును, వలయములుగను, జపర ములుగను జక్కగా నాటించినారు. దక్షిణపు దిక్కున నుద్యానవనమునకు మధ్యగా నొకచిన్న కోనేరును ద్రవ్వింప వలెనని కుతూహలపడిరిగాని దానిలోనికి నీరువచ్చు సౌకర్యములులేక, ఆ ప్రయత్నమును మానకొనిరి. కృష్ణరాయల రెండవ జన్మదినోత్సవమునాటికి నుద్యానవనము బాగుగా బెరిగినది. నాడే గృహప్రవేశమును జరిగెను.

ఆ యుద్యానవనమునకు దక్షిణాంతమందు గంధపు దోపు వేయించబడినది. దానిని వృద్ధిపరచుటకై రామయ్యగారు చాలశ్రమపడినారు. శ్రమకు ఫలితముదక్కి గంధపు

దోఁపు బాగుగా నంటినది. ఆ సౌధమునకు ముందొక పెద్ద పందిటిపై మాధవీలతలు నాల్గుమూలలను బ్రాకింపఁబడినవి. అవి పందిటి మీఁదటను దట్టముగ నల్లుకొని పోయినవి. వర్షా కాలమునఁ దెల్లవారుసరికి మాధవీపుష్పములు పందిటి క్రింద బట్టుపరుపులు పఱచిన ట్లొత్తుగ రాలియుండును. గంపలతో నెత్తిపోసినను దఱుగ వాపూలు. రెండేండ్లు దాఁటిన కృష్ణ రాయల కాపూవులన్నచో మిక్కిలి యిష్టము. క్రిందరాలిన పూలపై నింకను వ్రాలుచున్న తుమ్మెదలతోఁ బాటు పడుచు, లేచుచు నాతఁడును గంటలు వేయుచుండును. వర్షము, చిన్న తుప్పరగాఁ బడుచున్న సమయములో నీక వాని చిందులను వర్ణింపలేము. ఆపూలచే నాసౌధమే కాక చుట్టుపట్టులన్నియు ఘుమఘుమ లాడిపోవుచుండును. అందుచే నా సౌధమునకు 'మాధవీమందిర' మను పేరు వచ్చెను.

కృష్ణరాయలకు మూఁడవయేఁడు వచ్చెను. ఈశ్వరమ్మ గారు ద్వితీయ గర్భమునుదాల్చిరి. కృష్ణరాయలు కోలఁదిగాఁ చిక్కినట్లు గన్పడుటచేఁ దప్పకతమ్ముఁడే పుట్టునని యంద ఱనిరి. రామయ్యగారామెకు, మహారాణికివలె నుపచార ములు చేయించిరి. ప్రసవదివసము లేతెంచినవి. విశ్వనాథుఁ డొక సాయంసమయమున గోదావరియొడ్డుననే నడక మొదలు పెట్టి కుమారదేవము వఱకును వచ్చినాఁడు. సాయంసమయ సూర్యకిరణ సంపర్కముచేఁ దళతళలాడుచున్న గోదావరి నీటినిఁ దరంగితము గావింపుచు వీఁచుచున్న మందములగు

నీటి కాలువలు తేజోవంతమగు విశ్వనాథుని సహజమూర్తికి వింతసొంపు నాపాదించుచున్నవి. ఉత్సాహితుడై యున్న విశ్వనాథునియొక్క నడక యనతిదూరములోనున్నట్లు గన్పడుచున్న నున్నని పాపిక్రొండలను జేరుదాక సాగిపోవునట్లు దోచుచున్నది. గోదావరి యగ్గమున్నదన్నమాటనే మఱచిపోయెనేమో?...విశ్వనాథుని ప్రశస్తి నాటికన్ని దిశలందును వ్యాపించినది. అందువలన రామయ్యగారి వంటి పెద్దలందఱును విశ్వనాథు నెఱుంగుదురు. అతడట్లు కాలినడకను వచ్చుచుండుటవిని రామయ్యగారెదురేగి తన్నెదిరించుకొని వారిని మాధవీమందిరమునకు దీసికొనివచ్చినారు.

మాధవీలతల పందిటిక్రిందఁ గోలువుదీర్చి యున్నవాని పగిదిఁ గూర్చుండి పరిచారకులపైఁ బెత్తనము సాగించుచున్న రాయలు రామయ్యగారిని జూచి బాల్యచేష్టావిఖ్యాతమైన యొక మాదిరి యమాయకమగు సిగ్గుతో లేచి నిలఁబడెను. రామయ్యగారు వానియొడలు నిమురుచు "నాన్నా! ఇటు చూడు" మని వానికి విశ్వనాథునిఁ జూపించిరి. రాయలు విశ్వనాథుని, విశ్వనాథుఁడు రాయల నొకపరి చూచినారు. రాయలు సవినమ్రతతో రెండుచేతులను మెల్లగజోడించి నమస్కరించినాఁడు. విశ్వనాథునికి రాయలనైఖరి మహానందమయ్యెను. ఒక్కక్షణము మా బాలు నాతఁడు తేఱిపాఱఁజూచినాఁడు. విశ్వనాథుని యానందము ద్విగుణమయ్యెను. ఎంతకాలమునుండియో తాను సంకల్పించుకొనియున్న యొకమహాకార్య మా నిమిష

మందే నెఱ నేరిన ట్లాతని హృదయము తేలికపడినది. 'బాబూ!' అనుచు విశ్వనాథుఁడు రాయలను చేతులలోనికిఁ దీసికొనినాఁడు. విశ్వనాథుని మోములో వ్యక్తమైన యాభావమును రామయ్యగారు గమనించకపోలేదు. తరువాత వారిరువురును పొలమువైపునకు బయలుదేరిరి. రామయ్యగారి గోశ్రీని చూచి విశ్వనాథుఁడు ప్రశంసించినాఁడు. తిరుగుమొగముపట్టి వారొక్కచో నించుక విశ్రమించుటకై కూర్చుండిరి.

గాలివిసురులు మందముగా నుండియుండి యొక్కమాఱు చెలరేఁగినవి. అప్పుడు ఘుమఘుమలాడుచు నొక మధురమైన వాసన వారినాసికాపుటములందుఁ జొచ్చి వారిని విస్మయులను గావించెను. నిముసనిముసమునకు నా సువాసన మాఱిపోవుచున్నది. మొదట సంపంగిపూవు వాసన గొట్టెను. ఒకింతలో జామపండు మిగుల ముగ్గిన వాసన వచ్చెను. మరల రెండు రోజులు నిలువయున్న వెలఁగపండువాసన వచ్చినది. రామయ్యగా రాశ్చర్య మానసులైరి. చుట్టుపట్టుల నెచ్చటను జిన్నచెట్టు గూడ లేదు. ఆసువాసన లెచ్చటనుండి వచ్చుచున్నవి? ...... విశ్వనాథునిదృష్టి యచ్చటి కనతి దూరమునందున్న యొక వల్మీకముపైఁ బడినది. అచ్చటికిఁ బోయి దానిని బరీక్షించి మిక్కుటమగు సంతసమున రామయ్యగారినిఁ బిల్చి యాతఁడిట్లు చెప్పెను.—

"ఇందొక తెల్లత్రాఁచున్నది. దాని శరీరమే యిట్టి సువాసనలను జిందుచున్నది. సుమారు మూఁడు నిలువుల

లోతున నాసర్పమున్నది. అటనే యొక గొప్పనీటిజాలకూడ నున్నది. ఆనీటితో వేయి యెకరముల భూమిని సాగుచేయ వచ్చును."

చివరివాక్యము రామయ్యగారికి వినఁబడలేదు. ఆ నీటి వలన సాగై, యీమాటకుసిద్ధముగా నుండి నిండుచూలాలు వోలె కదలలేక కదలలేక పిల్లవాయువులవలనఁ గదలుచున్న వరిచేలు రామయ్యగారి మనోవీథిలో సంచరించినవి. ఏమి యీ యదృష్ట లక్ష్మీకటాక్షము! ... సిరి యయాచితప్రాప్త మగుట సామాన్య విషయము గాదు. సజ్జనసాంగత్య ఫలిత మిది. రెండురోజులైనను దన యాతిథ్యమును స్వీకరింపవల సినదిగా రామయ్యగారు విశ్వనాథుని ప్రార్థించినారు. ఆ మఱునాఁడు రామయ్యగారు పనివాండ్రను బిలిపించి పుట్టను ద్రవ్వించిరి. అంత మహాకోపమున త్రాఁచు పైకివచ్చినది. దాని కఱువదియేండ్లు దాఁటియుండును. లేఁచిచోఁ దేల్లత్రాచున కా సువాసనలు వయసులో నుండవు. అంత కోపముతో నది పైకి వచ్చినను, శాంతమూర్తియగు విశ్వనాథుఁడెదురు పడగనే యంతత్రాఁచును, త్రాడువలె నైపోయినది. రామ య్యగారు దానికిఁ బాలు నాహారమునకై నమస్కారపూర్వ కముగ సమర్పించి 'స్వామీ! ఈ ప్రదేశమును విడిచిపెట్టి నీచిత్తమువచ్చిన చోట నివసింపు' మని వేఁడెను. ఆ త్రాఁచు వాయుభక్షణముతోఁ బాటు మంచు బిందువులను ద్రావుట తప్ప నింకేమియు ముట్టదు. అందుచే నది చెరచెర ప్రాకి

పోయి యుద్యానవనమందున్న గంధపుఁదోపులో నివసింప సాఁగెను. కాని యీవిషయము నెవ్వరును గమనింపలేదు.

ఆ త్రాఁచు నివసించుచోట నొక యుసుగెత్తు చదరపు దిమ్మ గలదు. ఆ స్థలము మంచిగంధపు వాసనలను విరజిమ్ముచు శరీరము కొంకిఁబోవునంత చల్లగా నున్నది. గొప్పజాతిసర్పము లన్నియు నట్టిస్థలములందే నివసించు నని ప్రతీతి. అచటి గడ్డను కొలఁదిగ త్రవ్వించినంతనే మహా వేగమున నీటిధార పైకిఁ జిమ్మెను. ఏనుఁగుతొండములావున నా నీటిధార మూఁడునిలువుల పైవఱకుఁ బోయి నేలపైఁ బడుచుండెను. చూచుచుండగనే యా ప్రదేశమంతయును కొల్లేఱయి పోయెను. ఇంతలో సీతారమ్మగారు సుఖముగాఁ బ్రసవించిరనియు, మగశిశువు గల్గెననియు వార్త వచ్చెను. ఆనీటిధార పైకి వచ్చుటయు, నిచ్చట శిశుజననమును సరిగా నొకే క్షణమందు జరిగినవి. సంతోష సంభ్రమములు ముప్పిరిగొనఁ, దేజోమయమైన విశ్వనాథుని యౌగికమూర్తిని రామయ్యగారీసారి తేఱిపాఱఁ జూచినారు.

'నీవు మాలిటి భాగ్యదేవతవు. నీకు సర్వదా మేము కృతజ్ఞులము. ఏమి సెల' వని రామయ్యగారు విశ్వనాథుని పాదములను గనుల కద్దుకొనిరి.

'ఇందులో నేఁ జేసిన దేమున్నది? అంతయును భగవదిచ్ఛ. కృతజ్ఞత చూపవలెనని మీకంత యుత్సాహముగా నున్నచో మీకృష్ణరాయలకు విద్యాభ్యాసమునకై నావద్ద

కంపవలయును. ఇదియ నాకోరిక.' అని చెప్పి విశ్వనాథుఁడు వెడలిపోయెను. రాయలపై విశ్వనాథుని కట్టి సదభిప్రాయము కలుగుట తమ యదృష్టమని రామయ్యగా రనుకొనిరి.

త్వరత్వరగఁ జల్లపువ్యవసాయమునకుఁ బనులు ప్రారంభింపఁబడినవి. ఎడతెగక నీటిజల వచ్చుచున్నది. ఒక నీటిచుక్కైన వృథాగాఁబోనీక పొలములకుఁ బెట్టుచుండిరి. నీరు వేయి యెకరములకును బ్రవహించినది. ఆ వేయియెకరములను రెండు సమభాగములుగఁ జేసిరి. ఒకభాగము పూర్తిగ సాగైన తరువాత రెండవభాగమును సాగుచేయుదరు. ఆ వేయి యెకరములు రెండుపంటలు పండును. రామయ్యగారికిఁ బిత్రార్జితమైన యాస్తియును గ్రొత్తగా కొన్న భూములును గలిసి మొత్తము నాల్గువందల యెకరమున్నది. దానిలో రెండువందల డెబ్బది యెకరములు సాగైనవి. తక్కిన యేడువందలముప్పది యెకరములనుండియు రామయ్యగారికి నీటిశిస్తు వచ్చును. రామయ్యగారి కిప్పుడు తీరుఁబడి లేనంత పని కలిగినది. అందులకుఁ దోడాయన 'గ్రామపెద్దగ'గూడ నెన్నుకొనఁబడిరి.

పుత్రలాభముతోఁబాటింత యదృష్ట మాకస్మికముగఁ గలిసివచ్చుటకు రామయ్యగారును, ఈశ్వరమ్మగారును మహానందపడిరి. ఆ బాలుని పేరు కేశవమూర్తి. రాయల జననమే తా మొక మహాసౌధమును నిర్మించుటకుఁ గారణమయ్యెను. కేశవుని పుట్టుక యనుకోని యొకమహైశ్వర్యము ననాయాసముగా సమకూర్చినది. ఇట్టి తలంపులచే నిలువెల్ల నిండి

యున్న యాదంపతులకుఁ గుమారులపై నింతింత యనరాని ప్రేమ కుదురుకొనెను. తరువాత నీశ్వరమ్మగారికిఁ బుత్రిక జనించెను. ఆమె పేరు భవాని. కేశవుఁడు నడక మొదలుపెట్టి నప్పటినుండియు రామయ్యగారు వానినిఁ దమతోఁగూడఁ బొలములకుఁ దీసికొని వెళ్ళెడివారు. విశ్వనాథుని యాదేశ మెల్ల ప్పుడు క్షత్రియం దంచుకొనుచుఁ దమ పెద్దకొడుకు చదువు కొనుననియు, చిన్నకొడుకు వ్యవసాయము చేయించుననియు రామయ్యగా రందఱకును జెప్పుచుండెడివారు. వారికి రాయు లన్నచో నింతింత యనరాని ప్రేమ యున్నదిగాని, తనచేతి కక్కఱకువచ్చు కేశవునిమీఁదనే యాయన హృదయములో నేమూలనో యిాషదిష్ట మెక్కువ యున్నదనక తప్పదు. అది యిట్టిదని యాయనియును గ్రహింపలేదు కాని, రాయులన్న చోఁ బుత్రవాత్సల్యముతోఁ బాటేదియో చెప్పరాని గౌరవము మాత్ర మాయన కున్నది.

ఈసారి రామయ్యగా రుద్యానవనములోఁ జిన్న కోనే టిని త్రవ్వించి నీటిజలవచ్చు ప్రదేశములనుండి తూములద్వారా నీటిని బ్రవహింపఁజేసి కోనేరునింపినారు. ఆకోనేటిలో నక్కడక్కడ నల్లగలువ, తెల్లదామర దుంపలు కూడ నాటఁ బడినవి.

## 4

కృష్ణరాయుల కేడవయేఁడు వచ్చినది. అన్న మాట ప్రకారము రామయ్యగారు కుమారునిఁదోడ్కొనిపోయి విద్యా

భ్యాసమునకై విశ్వనాథుని కప్పగించినారు. సరిగా నా సమయముననే విజయేశ్వరాధీశులగు రాజా కుమార రామమోహనులును దమ యేకైక కుమార్తె యగు రజనీకుమారిని, వెంటఁబెట్టుకొని యాశ్రమమునకు వచ్చిరి. ఇది విశ్వనాథుని యేర్పాటు. రజనీకుమారి విశ్వనాథుని యభిమాన పుత్రిక. రజనీకుమారి చిన్ననాఁటి చిలిపిపలుకులెంతో మనోహరముగా నుండెడివి. ఆ పలుకులే విశ్వనాథు నాకర్షించినవి. నిజముగ కాపెది కోయిలకంఠము. కావుననే విశ్వనాథుఁడామెను సంగీతమందు నిధిని గావింపవలయు నని తలంచియుండెను.

కృష్ణరాయలును, రజనీకుమారియును విశ్వనాథుని కాకేపర్యాయము నమస్కరించిరి. విశ్వనాథుఁడు వారిని దీవించి యిరువురిచేతులను కలిపి పట్టుకొని ముద్దిడుకొనినాఁడు. ఇరువురను జెఱియొకప్రక్కను గూర్చుండఁబెట్టుకొని వారిశిరస్సులను గలిపియే మూర్కొనినాఁడు. లోన నేమో యాశీర్వదించుకొనినాఁడు. ఆ స్థితిలో వారలను జూచి రామమోహనులును, రామయ్యగారును ఒకరివైపొకరు చూచుకొనిరి. వారికను లేమో మాటలాడుకొన్నవి. విశ్వనాథుని సెలవుగైకొని రామయ్యగారింటికేఁగి యవ్యక్తానందముతో నేమో చెప్పవలెనని యీశ్వరమ్మగారి నొక్క కేక వేసినారు. కాని యా యానంద మేమో తెలియఁజెప్ప నేరక "ఏమియు లేదు, కుఱ్ఱవాని నాశ్రమములో నప్పగించి వచ్చితిని" అని చెప్పి

పొలమునకు వెడలిపోయిరి. "ఏమో యున్న" దని మ్యాత్రి మిూశ్వరమ్మగా రనుకొనిరి.

ఆశ్రమమును ప్రవేశించునాటికి రజనీకుమారి కొంచెమ మేడు రానై యున్నది. రాయ లాపె కన్న నొకసంవత్సరము పై నాల్గునూసములు పెద్ద. అక్షరాభ్యాస మారంభముగా విశ్వనాథుండా యిరువురను గలిపి యాఱుసంవత్సరములపాటు చదువు చెప్పినాడు. అప్పటినుండియుఁ గృష్ణరాయులమార్గము సాహిత్యము; రజనీకుమారిపథము సంగీతము. మొట్టమొదట రెండుసంవత్సరములు వా రిరువురును విశ్వనాథు నాశ్రమము నందే యుండిరి. ఈ రెండేండ్లలోను శబ్దమంజరి, అమరము, లఘుకౌముది పూర్తియైనవి.

ఈ కాలములో నప్పుడప్పుడుమాత్రము వారు తమ గ్రామములకు వెళ్లి తల్లిదండ్రులను జూచి వచ్చెడివారు. ఒకొక్కసారి రెండుమూడు నెలలవఱకు నిండ్లకుఁ బోవలెనన్న దృష్టియే వారి కుండెడిదిగాదు. అట్లు వా రిరువురు నవ్యక్త మధురభావములతో, నాచార్యుని బోధనలను మనస్సులకుఁ బట్టించుకొనుటలో నా రెండేండ్లను రెండు నిముసములవలె గడిపివేసిరి. పిమ్మట గుర్వాజ్ఞానుసారముగా రాత్రులు లచ్చట నుండుట మానివేసిరి. ఉదయముననే జోడుగుఱ్ఱములను బూన్చిన శకటములపై వా రిరువురు నాశ్రమమునకు వత్తురు. సాయంకాలమువఱకు నచ్చటనుండి, తిరిగి వచ్చినశకటములపైఁ దమ తమ గ్రామములకు మఱలిపోదురు.

రఘువంశ మది పూర్తియైన తరువాత విశ్వనాథుఁడు శిష్యు లిరువురకును పంచకావ్యములలో నైషధము తప్ప తక్కిన నాల్గుకావ్యములను, కొన్ని నాటకములను, గాఢంబని బాగా చేసినాఁడు. ఇవి పూర్తి యగునప్పటికి నాల్గుసంవత్సరములు పట్టినవి. శిష్యు లెంతో శ్రమతో దీక్షతో జదివినారు. ఎంతసేపును గురుముఖమునఁ గ్రొత్త క్రొత్తపాఠములు నేర్చుకొనుటయే వారికి సంతోషముగా నుండెడిది. ఒకరి కంటె నొకరు మించవలెనని వారిలో వారికిఁ దెలియకుండ ప్రయత్నించెడివారు. విద్యాభ్యాసమునం దా వారికున్న పట్టుదలను జూచి "నా విజ్ఞానమునకు వన్నె పెట్టు శిష్యులు దొరికినా" రని విశ్వనాథుఁ డమందానంద మందుచుండును. ఈచదువుతోఁబాటప్పుడప్పుడు ప్రపంచచరిత్రలుకూడఁ జెప్పుచుండెడివాఁడు.

మధ్యాహ్నమందు విశ్వనాథుఁడు విశ్రమించు సమయమునఁ గృష్ణరాయలును, రజనీకుమారియును మఱ్ఱిచెట్టుక్రిందికిఁ జేరెడివారు. దానిని వ్రేలాడుచున్న మఱ్ఱియూడల యుయ్యాలలన్నియును వారు సంధించినవే. ఆ యుయ్యాలలపైఁ బ్రథమమున నూగు టెప్పుడును రజనీకుమారి వంతు. కృష్ణరాయ లామె నూపును. కోతిపిల్లలవలె కిచకిచ లాడుచు నామె యీమూలనుండి యామూలవరకు నూగుచుండును. ఉయ్యాల యెంత పైకిఁబోయినను రజనీకుమారికి భయములేదు. ప్రాణము చాలివచ్చుటలేదు. తరువాత రాయ లుయ్యాల నెక్కును. అప్పుడు రజనీకుమారి యూపును. ఒక్కొక్కప్పు డిరువురును

పాటకొనుచు ఉయ్యాలపై నొకే సమయమున నూగెదరు. ఉయ్యాలపై రజనీకుమారి నూపుచు రాయలు కెంత సంబరమో, రాయలు నూపుట రజనికి నంతియే. ఏ సమయమున రాయలు కొట్టుమాహా పాడమునో, సరిగా నా సమయమున నదే రజనికిని దట్టును. వారు ఒక్కమాటనే కలిసి చదువుకొందురు. ఒక్కమాటనే భూజించెదరు. ఒకమాటనే సంధ్యావందనము చేసెదరు. ఒకమాటనే తోఁటపని చేయుదురు. వారిలో నెడమాటలు కేవే లేవు. అది యా యాచార్యుని ప్రభావమో? లేక యా శిష్యుల హృదయనైర్మల్యములమో— రెండును జతపడినవని చెప్పవచ్చును.

రజనీకుమారికిఁ దొమ్మిదవ యేఁడు వచ్చుటతోడనే విశ్వనాథుఁ డామె కప్పుడప్పుడు సంగీతమును గూడ చెప్ప నారంభించెను. సప్తస్వరములతోఁ బ్రారంభించి యామెకుఁ బండ్రెండవ యేఁడు వచ్చునప్పటికి గాత్రమున జంటస్వరములు, వర్ణములు, గీతములు, వేంకటేశపదములు మొదలైనవి చెప్పినాఁడు. అట్లే రాయుల కాయుర్వేదమును, ధర్మశాస్త్రమును బోధించెను. ఇట్లు రజనీ రాయుల విద్యాభ్యాసములో మొదటి యాఱేండ్లును గడిచిపోయినవి.

ఆశ్రమప్రాంతము లన్నియును గాఢాడవివోలె నున్నను దా నాశ్రమమునందు కాలు పెట్టినప్పటినుండియు రజనీకుమారియును కృష్ణరాయలును నిర్భీతిమై నెల్లెడలను సంచరించెడివారు. కుటీరము చుట్టుప్రక్కలను, నూతి చుట్టు

ప్రక్కలనుమాత్రే మాయిరువురును బాగుచేసి సాయంకాలము
లందు పుష్పలమొక్కలు మొదలైన వానికి నీరుపోయ నారంభిం
చిరి. నాలుగింటికి చదువు ముగిసినతరువాత నిరువురు నా చిన్న
యరణ్యములోఁ గ్షేత్రమువచ్చినట్లు తిరిగెదరు. ఒక పరుగులే
కాదు, ఒక దాఁగుడుమూఁతలే కాదు, ఒక కోతికొమ్మచ్చులే
కాదు... ఎన్ని చిలిపియాటలకు పేరులున్నదో యన్నియు నాడు
దురు. వారి యాటలకు విశ్వనాథుఁ డేమియు ననఁడు. ఆ కీకార
ణ్యమువంటి ప్రదేశములలోఁ బిల్లలు జడిసికొందురేమో యని
[illegible]డు నాతఁ డెన్నఁడును యోచింపలేదు. వయస్సులోఁ జిన్న
వారైనను, ఒక విచిత్ర సంఘటనమువలన వా రిరువురును
శాంతస్వభావులమైన తమ యాచార్యుని ప్రభావమును
గుర్తించిరి. కావుననే వారికి భయము నాస్తి. ఆ విచిత్ర
సంఘటన మిది :—

కుమారదేవమున కుత్తరముగా నిరువదిమైళ్లలో భీమాలు
ప్రాంతములందొక యడవి కలదు. పూర్వ మందు క్రూర
మృగములు విశేషముగా నుండెడివి. వానివలన నా ప్రాంత
ములవారు చాల బాధపడుచుండెడివారు. ఇట్లుండగా నా
యడవిలో 'అక్క దేవత' లని యేడ్గురు [illegible] విగ్రహ
ములు బయలుపడినవి. భీమాలులోని యొక శుభ్రాసాదా
రా విగ్రహముల నచ్చటఁ బ్రతిష్ఠించి ప్రతిసంవత్సరము నుత్స
వములను జేయసాగెను. అక్కదేవతలు గొప్పమాహాత్మ్యము
కలవారని నేఁటికిని ప్రసిద్ధి. అప్పటినుండి క్రూర మృగముల

బాధ తగ్గినట్లు. కాని యిప్పటికైనను, ఆ యడవి నొంటిగా పోవుట కెంతో ధైర్యశాలులమనువారైనను జంకుచునే యుందురు. రజనీకమారియును రాయలును, ఆశ్రమమునకు వచ్చిన రాత్రిలోఁ గొంతసేపులో నొకటికి యెటనుండి వచ్చినదో, యా యడవినుండి బయలుదేరి దారిఁబడిన గ్రామ పశువులను జంపి తినుచు విజయేశ్వరపుఁ బొలిమేరను ప్రవేశించినది. దాని కథను గర్ణాకర్ణిక విసుచున్న ప్రజ లడలిపోయిరి. అది పొలిమేరవఱకును వచ్చినదని తెలియుటతోడనే జనుల ప్రాణము లఱచేతులలో నిలిచినవి. వేఁట యన్న నుత్సాహపడు కుమారరాయలు తుపాకి దీసికొని మేటి విలుకాఁడైన యొక కోయవానిని మద్దతుగాఁ దోడ్కొని యా చిఱుతను వేఁటాడుటకై బయలుదేరిరి.

జాముస్నర ప్రొద్దెక్కినది. చుట్టుప్రక్కల నావులమంద కాని, మేకలదొడ్డికాని లేకపోవుటచేఁ జిఱుతపులి వచ్చియెత్తినట్లు తిరుగుచు విశ్వనాథు నాశ్రమప్రాంతముల వారిరువురికంటఁ బడినది. పులి వారినిఁ జూడలేదు. కాని రామసామానులు తుపాకిగుండు కాల్చిన వెంబడినే యది వారిపై దూకినది. అంతలోఁ గోయవాఁడు విడిచినయమ్ము వచ్చి దాని కుడిడొక్కలో గ్రుచ్చుకొనెను. ఆ రెండు దెబ్బలును గాఢముగాఁ దగులుటచే నది వారిపై నింక లంఘింపనేరక వెను దిరిగి పరుగిడినది. వారిరువురును దానిని వెన్నంటిరి. చిఱుత సరాసరి వటవృక్షముక్రిందికి వచ్చినది. ఇఁక నడువలేకపోయి

నది. విశ్వనాథుఁడా వృక్షమూలమున ధ్యానములోనున్నాఁడు. యోగమూర్తియైన విశ్వనాథుని ప్రశాంతమగు మోము కంటఁబడగనే చిఱుత తనబాధను, క్రూరతనుగూడ మఱచి పోయి వాని పాదములను నాకసాఁగెను. కుటీర మందున్న రాయలును, రజనియు దానినిఁజూచి చాల భయపడిరి. అఱచుటకైనను వారికి ధైర్యము లేకపోయెను. విశ్వనాథుఁడు కొలఁదిసేపటికిఁ గనులు తెఱచి పాదములను నాకుచున్న చిఱుతనుజూచి చిఱునగవున దానియొడలు నిమిరెను. అది సాఁగిలి పడి తోఁక యూడించినది. విశ్వనాథుఁడు దాని శరీరమందున్న బాణమును మెల్లగ నీవలకు లాఁగి కమండలువులోని గోదావరి నీటితో గాయము చుట్టుపట్టులను శుభ్రపఱచెను. తుపాకి గుండు శరీరములోనికిఁ జొచ్చుకొనిపోవుటచే దానిని తీసి వేయుటకు సాధ్యమైనదిగాదు. పిమ్మట సమీపమందున్న యొక యాకును తెచ్చి పసరు పిండి గాయములపై పూసెను.

అంతలోఁ గుమారరామోహను లాశ్రమమును ప్రవేశించి యాదృశ్యమునుజూచి యట్టె నిలఁబడిపోయిరి. విశ్వనాథుఁడు తుపాకితోనున్న విజయేశ్వరాధీశులకు మందహాసముతో స్వాగత మొసంగెను. రజనీకుమారి పరుగున వచ్చి తండ్రిని కౌఁగిలించుకొనెను. విశ్వనాథుఁడు రాయలనుగూడఁ బిలిచెను. చిఱుత తనహంతను గుర్తించినది, అది మరణవేదనలో నున్నది. ఆబాధలోనే యది రామమోహనులవైపు దీనముగఁ జూచెను. రామమోహనుల మనస్సు నీరైపోయినది.

విశ్వనాథుని యలౌకికశక్తికి విభ్రమమొంది రామమోహనులు తాము వహించిన క్షాత్రధర్మమునకు సిగ్గిలిరి. నాఁటినుండియు రాయలకును, రజనీకుమారికిని భయ మన్నదిలేదు.

ఆతేండ్లు పూర్తియగునప్పటికి రాయలును, రజనియును తమతమ యభిమాన విద్యలందు ప్రత్యేకముగ కృషి సల్పుటకు శక్తివంతులైరి. సర్వకళావేత్తయైన విశ్వనాథుఁడు రజనీకుమారికిఁ బండ్రెండవయేఁడు వచ్చుటతోడనే యామెకు వీణను బ్రారంభించినాఁడు. రాయలు పాణినీయము నేకాగ్ర చిత్తతతోఁ జదువ మొదలిడెను. అప్పుడప్పుడు విశ్వనాథుఁడు వారిరువురనుగలిపి భరతశాస్త్రము నితరాలంకార గ్రంథములను జెప్పుట కారంభించెను. పాణినీయమును, నైషధమును, జ్యోతిషమును బూర్తిచేసి రాయలు తెలుఁగుకావ్యములను జదువ మొదలిడెను. అప్పటికి రజనీకుమారి వీణెయపై త్యాగరాజకృతులను సాధించెను. రాయలతోఁ గలిసి యామెయును గొన్ని యాంధ్రగ్రంథములను జదివినది. పిమ్మటఁ బ్రత్యేకముగా సంగీతముపైనే దృష్టియుంచి ప్రతిభావంతుఁడగు విశ్వనాథుని శుశ్రూషలో నామె భూమికవతరించిన శారదాదేవియైనది. రాయ లాచార్యునిసాహాయ్యముతో నాంధ్రకావ్యములందుఁ బ్రత్యేకమగు కృషి సల్పినాఁడు.

విద్యాపథములు వేఱైనప్పటినుండియు వారిరువురును గూడ దూరదూరముగ నుండసాఁగిరి. అదియునుగాక, యీ వఱకువలె సావకాశముగా మాటాడుకొనుటకైనను వారికి

పిలుచిక్కిడిది కాదు. ఒకవేళ పిలు చిక్కినను బూర్వమంతటి చనవు లిప్పుడులేవు. రాయలకుఁ "బెద్దమనిషితరహా" వచ్చినది. రజని పొడవెదిగి వలెవాటుతో నొడలు నింపుకొన సాఁగినది. అలంకారాది శాస్త్రగ్రంథములను, గొన్ని తెలుఁగుకావ్యములను జదువుచున్నప్పుడు తప్ప వారిరువురును వేఱువేఱుగాఁ బాఠములు చెప్పించుకొందురు. రాయలు శ్రోత్రపాఠము చదువుకొనునప్పుడు రజని యెక్కడనో యొక పంచలోఁ గూర్చుండి తన ప్రాఁతపాఠమును సాధక మొనర్చుకొనుచుండును. రజని శ్రోత్రపాఠమును జెప్పించుకొనునప్పుడు రాయలు నట్లే వేఱొక చోటఁ గూర్చుండి తనప్రాఁతశ్రోత్రపాఠములను సమన్వయించుకొనుచుండును. ఒకొక్కప్పుడిష్టమున్నచో నొకరు పాఠము చెప్పుకొనునప్పుడు తక్కినవారు ప్రక్కగాఁ గూర్చుండి విను చుందురు. సాధారణముగా రజనియే యట్లు చేయుచుండును.

మధ్యాహ్నము విశ్వనాథుఁడు విశ్రమించు సమయము లందెప్పుడో కాని వారయ్యాలల నూఁగుట మానివేసిరి. ఎప్పుడైన నూఁగినను, ఒకరి నొకరు తూపుకొనుటలు తగ్గినవి. రజనికిఁ బెంపుడుజంతువు లన్నచోఁ జాలనిష్టము. రాయలు దూరముగనుండి యాజంతువులను జూచి యానందించువాఁడే కాని పోషణచేయుటకు దొరకొనఁడు. సాయంకాలమునందు మాత్ర మిద్దరును వంతులు వేసికొని పరస్పర సాహాయ్యమునఁ దోఁటపని చేయుచుందురు. అప్పుడు వారినిండ్లకుఁ గొంపోవ గుఱ్ఱపుబండ్లువచ్చును.

విజయేశ్వరాధీశులు రజనీకుమారి సంగీతసాధనమునకై అంతఃపురము వెనుకనున్న యుద్యానవనములో నొకచిన్న పర్ణకుటీరమును నిర్మింపించి యిచ్చిరి. అంతియకాక యామెకుం బదేండ్లు వచ్చినప్పటినుండియు నామెకొఱకై యంతఃపురములో విశాలమైన గదియొకటి ప్రత్యేకింపఁబడినది. ఈరెంటను రజనీకుమారి యధీనములోనివి. చివరకి విజయేశ్వరాధీశ్వరికైనను గుమార్తెయగు రజనీకుమారి యనుజ్ఞలేనిదే వానియందుఁ బ్రవేశింప నధికారము లేదు. రజనీకుమారికిఁ జిన్నప్పటినుండియు నాటపాటలలోఁ దోడునీడలై యున్న యిరువురుకన్యలకు మాత్రమే యనుజ్ఞయక్కఱలేదు. వా రామెబంధుకోటిలోనివారే. రాత్రు లామె కుటీరమునందు సంగీతసాధనములో నున్నంతసేపుండి తరువాతఁ దనగదికిఁబోయి నిద్రించును. లేనిచో నొకొక్కప్పు డామిత్రు లిరువురితో నా కుటీరమందే నిద్రించుచుండును.

భవానికై దేండ్లు రాఁగానే కృష్ణరాయలే యామె కక్షరాభ్యాసము చేసెను. భవాని చాలఁ జుఱుకైనపిల్ల. పదియవ నెలలోనే యామె చిలుకపలుకులు పలికెడిది. పదునొకటవ నెలలోఁ జెరచెర నడచినది. ఆమె యన్నచో రాయలకెంతో ముద్దు. అతఁ డాశ్రమమునుండి వచ్చి బండి దిగునప్పటికి భవాని వాని కెదురుగా వచ్చెడిది. ఆమె నమాంతముగా నెత్తుకొని రాయ లీశ్వరమ్మగారియొద్దకు వచ్చెడివాఁడు. "అమ్మా! అన్నయ్యా!" అని రాయలచేతులలోఁ దన కాలుసేతులను దప

తపఁ గొట్టుకొనుచు సంభ్రమమున మాట పూర్తిగాఁ జెప్పలేక చెప్పలేక చెప్పెడిది. రాయలు ఇంటికి వచ్చినంతనే గృహమున కెంతో కళవచ్చునని యీశ్వరమ్మగారితలంపు. ఎప్పుడేని దంపతు లిరువురును దీరుబడిగాఁ గూర్చున్నప్పుడు "రాయలు చాల గొప్పవాఁడగు"నని రామయ్యగా రీశ్వరమ్మగారితోఁ జెప్పు చుండెడివారు. ఈశ్వరమ్మగారికి నదియే నమ్మిక. అందువలనఁ గిలకిల నవ్వుచున్న భవాని నెత్తుకొని, చిఱునగవు పెదవుల మీఁదను, ఆనందము కన్నులలోను, ఔన్నత్యము మొగము నందును దోఁచుచుండ, నొకమహాపురుషునిఠీవితోఁ దనయొద్దకు మెల్లఁగ నడచివచ్చెడి రాయలనుజూచి యీశ్వరమ్మగా రానందపరవశులై మాటాడలేకపోయెడివారు. ఆ చల్లని తల్లిలో వాత్సల్యజన్యమగు పరవశత్వమేకాని, కించిద్గర్వమైన నెన్నఁ డును దలఁచూపలేదు. ఆ ప్రీతియంతయు నామె చల్లని చూపులోఁ దరంగించుచుండెడిది.

అక్షరాభ్యాస మైనప్పటినుండియు భవాని శ్రద్ధతోఁ జదువుకొనెడిది. రాయలింటికి వచ్చుటతోడనే ప్రాతఃపాఠము నప్పగించుటయుఁ బెందలకడనే భోజనములైన తరువాతఁ గ్రొత్తపాఠమును జెప్పించుకొనుటయు జరుగును. అట్లు చదువు చెప్పుటకుఁ బగలంతయును జదువుకొనవచ్చి మరల రాత్రి చదువుకొనవలసియున్నను రాయలకు విసుగులేదు. చదువుకొను టకు గృహకృత్యములలోఁ దల్లికి సాయమొసర్చు భవానికిని విసుగులేదు. రాత్రులందుఁ జెల్లెలికిఁ జదువుచెప్పుట పూర్తియైన

తరువాత రాయలు మేడపైనున్న తనగదిలోనికిఁబోయి తన చదువును జూచుకొనెడివాఁడు.

రాయలు పాఠముచెప్పి వెళ్ళిన తరువాత, కేశవమూర్తి వచ్చి చెల్లెలియొద్దఁగూర్చుండును. కేశవుఁడెప్పుడును రాయలున్న చోట నుండఁడు. ఆ యన్నదమ్ముల స్వభావము నెన్నఁడును మాఱుచుకొనినట్లే యుండదు. వారి ప్రవృత్తులు చాలఁ జిత్రమైనవి. రాయలకు సాహిత్యపాఠమన్నచో నెంత యిష్టమో కేశవునికి గోసేవయున్న నంతప్రీతి. రాయల కనుక్షణమును ప్రకృతి పరిశీలన మెంత యానందదాయకమో కేశవుని కనుక్షణమును గోతతి బాగోగులను జూచుకొనుటంత యానందదాయకము. రాయ లెన్నఁడేని గోవు లెట్లున్నవో యని చూడ నేఁగునట్లే కేశవుఁడును బుద్ధికుదిరినప్పు డెప్పుడైనఁ బుస్తకము చేతఁబట్టును. అతఁ డక్షరములను జెల్లెలియొద్ద నేర్చుకొనినాఁడు. చెల్లెలియొద్దనే పుస్తకమును జదువ నారంభించినాఁడు. చెల్లెలే వానికంతో యింతో ప్రబంధములం దాసక్తి కల్గించినది. కాని యేదేని యొకటి పూర్తిగా జదువవలెనని యెంత పట్టుదలతోఁ గూర్చున్నను, గోతతిమాట తలంపునకు వచ్చెనేని చదివెడు పొత్తము నటనే పాఱవేసి యాతఁడు గోశాలకుఁ బరువెత్తును. అతఁడు గోవులను దన ప్రాణముకంటె నెక్కుడుగఁ జూచుకొనును. రామయ్యగారు వృద్ధిచేసిన యావులమందలోనున్న యొక పడమటావన్నచో నాతనికిఁ బ్రాణము. మిలమిల మని మెఱసిపోవు తెల్లని పట్టువలె నాయావు శరీరముండును. కేశ

వుఁడు పుట్టినరోజులలోనే యదియును బుట్టినదఁట. ఇప్పు డది మొదటియీఁత యీనినది. దానిమీఁద తెలుపురంగుపై సన్నని జేగురురంగు చుక్కలు కలిగియుండును. ఈ రెండింటి సంరక్షణ యంతయును గేశవుఁడు స్వయముగఁ జూచుకొనుచుండును.

మధ్యాహ్నము భోజనములయి తల్లి విశ్రమించిన తరువాత భవాని యొక గంటన్నరసేపు రాట్నము వడుకును. భవాని ప్రతిదినమును విధిగాఁ జేయుపనులలో నిది యొకటి. కుమార దేవము కుటీరపరిశ్రమలకు నాకాలములోఁ జాల ప్రసిద్ధ మందియున్నది. ఆ గ్రామములో మిక్కిలి సన్ననినూలును దీయువారు చాలమంది యున్నారు. చాలవరకు స్త్రీలే వడుకుచుందురు. భవాని కొంచెముగా సన్ననినూలు తీయు కౌశలము సంపాదించినది. సంవత్సర మంతటిలో నామెకుఁ గావలసిన బట్ట లించుమించుగ సగ మామె వడికిన నూలుతోడనే తయారగును. రాత్రులందుఁగూడఁ దాను చదువుకొని కేశవునికిఁ జదువు చెప్పినతరువాత నొక యరగంటసేపు మరల నూలు తీయును. కేశవునికిని నూలు వడుకుట యందుఁ బ్రవేశమున్నదికాని వానికి గోసేవయందుఁ దప్ప నింకే యితర కార్యమునందును బుద్ధినిలుకడయే యుండదు.

రజనీకుమారీ కృష్ణరాయుల విద్యాభ్యాసము పూర్తి కావచ్చినది. ఏండ్లుగడచినకొలఁది వారిహృదయములు సన్నిహితము లగుచు వచ్చినవి. ఒకరిపై నొకరికి గాఢానురాగ మేర్పడినది. అది పైకిఁ దెలియునదికాదు. కేవలసహాధ్యాయనస్నేహము

క్రమ పరిణామముచెంది వారి హృదయగత భావములకు నిదానమును, గాంభీర్యమును తెచ్చిపెట్టినది. పెద్దవారైన కొలంది వారు దూరదూరముగ నుండసాగినను, సంగీతసాహిత్యములు తమ గురుపాదుల మేధయం దైక్యమైనట్లు తత్త్వకళావేత్తృత్వమును సంపాదించుచున్న యీ యిరువురి యాత్మల యైక్యమును వృద్ధిపొందసాగెను. ఆ యైక్యమును వారికి దెలియకుండగనే వృద్ధినొందినది. వారు పూర్వ మెంత నిర్మలమానసముతో సంచరించెడివారో యిప్పుడు నంతియే. కొంటెతన ముచ్చటలోనైన నింతవరకును బ్రకటీకృతము కాలేదు. గతించిన ఫాల్గుణ ఏకాదశి రోజున మాత్రమే మనో మాట్లాడుకొనవలయునని లోలోన యనుకొనిరి కాని ధైర్యము లేకపోయినది. అటుపిమ్మట శ్రావణ పూర్ణిమనాడు జరిగిన నొక్క సంఘటనమును మన మెఱింగియే యున్నాము. ఆనాడైనను రాయుడే యగ్రగామి.

కృష్ణరాయలును, రజనీకుమారియును దమ తమ యభిమానవిద్యలందు నాలుగు సంవత్సరములు గట్టిగాఁ గృషిసల్పిరి. విశ్వనాథుఁడు తనవిజ్ఞానమునంతటిని శిష్యులకుఁబూర్తిగాఁ బంచి యిచ్చివేసెను. సంగీతమందు రజనియు, సాహిత్యమందుఁ గృష్ణ రాయలును నిష్ణాతులైనారు. శ్రావణ పూర్ణిమకు ముందే వారి విద్యాభ్యాసము పూర్తియైనది. కాని దశమివరకు వారి నిరువురను బూర్తిగా నాశ్రమమందే యుండుఁడని విశ్వనాథుఁడు కోరెను. విశ్వనాథుని కిప్పుడు దాదాపుగా నలువది సంవత్స

రములున్నవి. యౌగిక తేజము వానిశరీరము నెంత కాంతి వంతము చేయుచున్నను వానియాత్మకు మాత్రము వృద్ధ భావము వచ్చివేసినది. గతించిన పండ్రెండేండ్లును వానికి శిష్యులతోఁ బ్రొద్దుపోయినది. ఇఁకఁ దానొక్కఁడే యాశ్రమమునం దుండవలెను. ఒక్కసారిగా శిష్యులను విడిచి యుండవలయు నన్న తలంపే వానికిఁజాలఁ గష్టమనిపించినది. అందువలన వారిని మఱి పదివదేను రోజు లాశ్రమమునందే నిల్పినాఁడు. అంతియకాక వారల నట్లుండు మనుటలో విశ్వనాథుని కింక నేమి యూహ యుండును?... వాని కేమి యూహాయున్నను దామింకను బదిరోజులపాటైనఁ గలిసి యుండవచ్చును గదా యని వారిరువు రాశ్రమమునం దుండుటకు సంతోషముతో నంగీకరించిరి. దశమిలోపలఁ గృష్ణ యీనినది. ఈనినంతనే రజనీకుమారి దానికి వేడివేడిగంజి తెప్పించి పట్టించినది. అప్పుడే యీనిన లేడికి వేడివేడి గంజి చక్కని యాహారము. తరువాత సమందానందమున నామె దానికన్ని యుపచారములను గావించెను.

నేఁడు వారిఁక వెడలిపోదురు. వారి నింద్లకుఁ గొంపోవ గుఱ్ఱపుబండ్లు వచ్చి గోదావరి యొడ్డుపై నిల్చియున్నవి. శిష్యులిరువురును ప్రయాణమై యాచార్యునితోఁ గుటీర ప్రాంగణములోనికి వచ్చిరి. ఇరువురు శిష్యులు నాచార్యుని కొకేసారి పాదములంటి నమస్కరించిరి. వాత్సల్య పూర్ణుఁడగు విశ్వనాథుఁడు వారి చేతులను గలిపి ముద్దిడుకొనినాఁడు. రాయలును

రజనియును జెజీయొకప్రక్క నున్నారు. విశ్వనాథుఁడు వారి శిరములనుగలిపి మూర్కొనినాఁడు. రజనీకుమారియును, కృష్ణ రాయలును బ్రప్రథమమున నాశ్రమమునం దడుగిడి నమస్కరింపగా నప్పుడును విశ్వనాథుఁ డిట్లే చేసినాఁడు. నాఁడాతఁడు లోలోన నేమేమో యాశీర్వదించుకొన్నాఁడు. నేఁ డా యాశీర్వాదము పెదవి దాఁటినది—"మీామనోరథము నెఱవేఱుఁగాత" అని. ఆయుచ్చారణలోఁ బ్రశాంతత యున్నది. గంభీరత్వమున్నది. సామాన్యాశీర్వాదమువలె నున్నది. వారి యిరువురి మనోరథ మేమో యెఱింగి యాశీర్వదించిన ట్లున్నది. శిష్యు లిరువురు సంతోష సంభ్రమములు ముప్పిరిగొన నొకరి నొకరు చూచుకొనిరి. ఇరువురి మనోరథ మొక్కటియే యగునా? లేక వేఱువేఱా?......

"నీ మనోరథమేమి?"యని రాయలకనులు ప్రశ్నించినవి.

"నీమనోరథమే!" యని యన్నట్లు రజని సునుసిగ్గునఁ దలవంచెను. రాయలు మందహాస మొనర్చెను. తమ రహస్యమాచార్యునికెట్లు తెలిసెను?...ఏమో!...ఇరువురు నాశ్చర్యమానసులైరి.

"స్వామీ! గురుదక్షిణ"యని రాయలు బద్ధహస్తుఁడై నిలిచెను. విశ్వనాథుని మోము దివ్యతేజమున వెలుఁగొందుచున్నది. శిష్యులు ఘనులైరని వానిమానసంతోషముపట్టరాకున్నది.

"పుత్రులారా! మీారు సౌఖ్యముగనుండి, నేను మీాకిచ్చిన విద్యలను సఫల మొనర్చుటయే నాకు గురుదక్షిణ. అధీతి

బోధావస్థలు మీరు దాఁటినారు. ఆచరణ ప్రచారము లింక మిగిలియున్నవి. రాయలూ! విద్యకు సార్థకత చతుర్విధ పురుషార్థ సిద్ధిలో నున్నదని నీకు నేను వేఱుగాఁ జెప్పనక్కఱలేదు. కాని విదేశ సంపర్కము వలనను, మన దురదృష్టము వలనను నేఁటి కర్థ కామములు రెండుమాత్రమే నిల్చియున్నవి. అందుచే యోగము కంటె మహితములును, సర్వజన సన్నిహితములు నగు కళ లటు పారమార్థికములుగ, నిటు ప్రాపంచికములు రెండునుగాక తుచ్ఛములైనవి. రజనీకుమారి సాహాయ్యముతో వానిని బునరుద్ధరించు భారము నీయది. ఇది మా శ్రీ గురు దేవుల సందేశము! మీకందిచ్చితిని" అని నిర్వికారుఁడగు విశ్వనాథుఁడు పలికెను. శిష్యులు వినమ్రులైనారు. తమ జీవితములను గళలయున్నతికై ధారవోయుదుమని నిష్కల్మష హృదయములతో వారు శపథములను గైకొనిరి. విశ్వనాథుఁడు శిష్యులను గౌఁగిలిలోనికిఁ దీసికొని యానందబాష్పములచే వారి శిరములను దడిపివేసెను. ఆజానుబాహువగు విశ్వనాథుని యండలో రజనియు, రాయలును మూఁగభావలో నేమో మాట్లాడుకొనిరి. రజనీకుమారి వెడలిపోవునని గుర్తించినవి కాఁబోలు పెంపుడు నెమిలియు, హరిణ శిశువును బిక్క మొగములతో నిల్చినవి. అల్లనేరేడుపండ్లను దినుట మాని వాని నెల్లఁ బిచ్చియెత్తినపగిదిఁ జిదిపి పాఱవేయుచున్న రామచిలుక వారియొద్ద వ్రాలి "అక్కా" యని పిలిచెను. రజనీకుమారి వానిని సముదాయించినది.

విజయేశ్వరము గోదావరినదికి దిగువంగా నున్నది. మాధవీమందిరమున కెగువగాంబోవలెను. గుఱ్ఱపుబండ్లు సిద్ధముగా నిల్చియున్నవి. ఆయేండు వఱద లస లాలస్యముగా వచ్చుటచే గోదావరినది వఱద లింకను దగ్గలేదు. నీరు పెద్దగట్టును దాచియున్నది. ప్రవాహము పెద్దపెద్ద సుళ్ళు తిరుగుచు మహావేగమునం బోవుచుండెను. ప్రవాహమున కెగువగా నున్న పాపికొండలు నదికడ్డము నిల్చినట్లు కనంబడుచున్నవి. ఆశ్రమప్రాంతముల గోదావరి యతివిస్తార మగుటచేం దూరపుటొడ్డు కనిపించుటలేదు. గోదావరి దిగువను విజయేశ్వరమునొద్ద నేడు పాయలుగాం జీలిపోయి సముద్రములోం బడుచుండుటచే నావైపునంగూడ నేమియుం గన్పడుట లేదు. ఆచార్యుని యనుజ్ఞం గైకొని రజనియు, రాయలును శకటములయొద్దకు వచ్చిరి. అంతవఱ కింకొక లోకములోనున్న వారిరువురును గోదావరి నకస్మాత్తుగాంజూచి యొక పెద్దచెఱువువలె నున్నదనుకొనిరి. కాని చెఱువులో నా ప్రవాహ మేమి ?...ఇరువురును దమ భ్రమను గుర్తించి సిగ్గిలిరి.

"మరల కలయిక యెప్పు" డని రాయ లడిగెను.

"ఆచార్య ననుమతి..." అని రజని బదులు చెప్పెను.

ఇరువురును శకటముల నారోహించినారు. హృదయభారముతో రజని 'సెలవు' అని యన్నది. రాయ లతికష్టము మీందం దలయూపెను. విడందీసికోరాని వారిచూపులను గుటీ

రాంగణమునుండి విశ్వనాథుఁడు పరికించుచునే యుండెను. శక టములు కదలినవి; యిరువురిపెదవులును గదలాడినవి. శకటము లింకను గొలఁదిసేపాఁగిన బాగుండునని వారి మనస్సులలో ననుకొనిరి. అశ్వముల కింత వేగిరపాటేల యని యాగ్రహ పడినారు. శకటచోదకులకు వీరియూహ యెట్లు తెలియును? క్రమముగ గుఱ్ఱములవేగము హెచ్చినది. శకటములు కను చూపుమేర దాఁటిపోయినవి. ఇరువురును దీర్ఘమ్మైన నిట్టూ ర్పులు విడిచినారు. ఆ యూర్పులు గుఱ్ఱముల డెక్కలవలన రేఁగిన పలుచనిదుమ్ములో లీనమైపోయినవి.

నాఁటిసాయంకాల మాశ్రమమునకు రమ్మని విశ్వనా థుఁడు రామయ్యగారికిఁ గబురంపెను. ఆయన యాశ్రమము నకు వెళ్ళునప్పటికి విజయేశ్వరాధీశులుకూడ వచ్చుట నుండిరి. మువ్వురును గూర్చుండిరి. లోకాభిరామాయణ మైన పిదప విశ్వనాథుఁడు కనుసైఁగఁజేయఁగా రామమోహనులు తమ కుమార్తెను కృష్ణరాయలకిచ్చి పెండ్లిచేయ నిచ్చగించుచుంటి మనియుఁ దమయంగీకారము నొసంగవలసినదనియు రామయ్య గారిని గోరిరి. రామయ్యగారి కాశ్చర్యము, నానందము నొకేపరి కల్గినవి.

"పిచ్చుకగూఁటిపై భాగీరథి ప్రవహించుచున్నది. వల దనువా రుందురా?... ఇది యంతయు విశ్వనాథుని కృప" అని రామయ్యగా రనలేక యనలేక యన్నారు. రామయ్యగారి యంగీకారము రామమోహనులకుఁ గర్ణోత్సవ మయ్యెను.

విశ్వనాథుఁడు ముహూర్తమును నిర్ణయించినాఁడు. అందఱికంటె వాని యానందము పట్టపగ్గములు లేకున్నది.

రామయ్యగారింటికి వచ్చి యీశ్వరమ్మగారి నొక్క కేక వేసినారు. ఆమె వచ్చెను. మొట్టమొదట రాయల నాశ్రమమునందు విడిచిపెట్టి వచ్చినప్పుడు తెలియఁ జెప్పలేక పోయిన తమయానందమును రామయ్యగారొక్క గుక్కలో నీశ్వరమ్మగారి కీనాఁడు చెప్పివేసిరి. "నిజమా నా..." అనిమాత్ర మీశ్వరమ్మగారడుగఁగల్గిరి. రజనీకుమారినిగూర్చి రాయలు చెప్పఁగా నామె వినియుండెను. "ఆమె తనకోడలగునేమో" అను నూహ రామయ్యగారికిఁ దట్టిన యామెకును దట్టెను. అది నేఁడు నిజమైనది. ఇఁక వారి యానందమున కంతేమి యున్నది? ముహూర్తము నిశ్చయమైనదని విన్న కృష్ణరాయలకును, రజనీకుమారికి నా రాత్రి నిద్ర పట్టనేలేదు.

## 5

వర్షర్తు ప్రారంభములో రజనీకుమారీకృష్ణరాయల విద్యాభ్యాసము పూర్తియైనది. శరత్తులో రాయలు దేశసంచారమును జేసి తన ప్రతిభను నలుమూలలను జాటి వచ్చినాఁడు. అవి పాశ్చాత్యవ్యామోహము పూర్తిగాఁ బ్రబలిన రోజులు. ఒకప్రక్క జాతీయమహాసంస్థ, మహానాయకుల యాధ్వర్యమున దేశాభిమానమును, నైకమత్యమును బ్రబోధించుచున్నను, వేఱొకప్రక్క నల్లదొర లెందఱో తెల్లదొరల మానస

పుత్రులై రాజభక్తిని ప్రకటించుచునే యుండిరి. తమ యాచార్యుని స్వాతంత్ర్యోపన్యాసమును, దేశపరిస్థితులను సమన్వయించి చూచుకొని రాయలు తన భావిజీవిత కర్తవ్యము నుసాధమైనది కాదని గ్రహించినాఁడు. కళలను బునరుద్ధరించు మార్గమేది?...అది తనచేతనగునా?...రజనీకుమారి యేవిధముగా సాయపడునో?...రాయ లేమియును నిర్ణయించుకొనలేకపోయెను.

శిశిర ఋతువులో రజనీకుమారీకృష్ణరాయుల వివాహము సర్వవైభవోపేతముగా జరిగినది. సంస్కారవంతురాలు, రజనీకుమారి కోడలై తమయిల్లు మెట్టినదని రామయ్యగారును, సాహిత్యాచార్యుఁడు, రాయ లల్లుఁడగుభాగ్యము తమకు లభించినదని రామమోహనులు నానందామృతాప్లావితులైనారు. ఆ వివాహమహోత్సవవైభవమును, నాఁటి పండిత సన్మానములను, సంతర్పణలను, ఆ యైదురోజులలో జరిగిన వివిధములగు నుత్సవములను జాలఁ గాలమువఱకుఁ బ్రజలు కావ్యములుగా వర్ణించుకొనిరి.

భవానికి శరదృతు వంతమునకుఁ బదునాల్గవ యేఁడు వచ్చినది. పెద్దన్నతోసమానమైన తెలివి కలదని యామెను గూర్చి యందర అనుకొనెడివారు. సరస్వతియే యిట్లవతరించిన దేమోయని రాయలుకూడ ననుకొనెడివాఁడు. తనతోఁబాటుగా నాశ్రమమునకువచ్చి తమ గురుపాదులయొద్దనే చదువుమని తన విద్యాభ్యాసకాలములో రాయలు చెల్లెలి కనేకసారులు

బోధించెను. ఆమె యంగీకరింపలేదు. "మీచెల్లెలిని జూపించు" మని రజనీకుమారియును రాయల నప్పు డప్పు డడుగుచుండె డిది. ఆసాకుఁ జెప్పి తనతోఁగూడ నప్పుడప్పు డాశ్రమమునకుఁ దీసికొనివెళ్ళి యామెకు రజనీకుమారి పరిచయమును గావించి నచో నామెనుజూచియైన నాశ్రమములోఁ జదువులకు భవాని యలవాటుపడునేమో యని రాయలు ప్రయత్నించి చూచెను. కాని భవాని యాశ్రమమును జూచుటకైన నిష్టపడలేదు.

"ఆశ్రమములోఁ జదువుట నీకిష్టములేనిచో మానివే యుము. కాని నిన్నుజూపించుమని రజనీకుమారి చాలసారు లడిగినది. అందుచే నీవొకసారియైన నచ్చుటకి రావలయును" అని రాయలు భవాని నడిగెను.

"నన్ను జూడవలెనని యామె యంత యుత్సహిం చుచో నామెనే యొకసారి యిచ్చటికి రమ్మనుము." అని భవాని సమాధాన మొసంగెను. రాయ లేమియును జెప్పలేక పోయెను. ఆమె తమయింటికి వచ్చుట కంగీకరించునో! అంగీక రింపదో?...

"అయినను ఆశ్రమమునకు వచ్చుటకు నీ కభ్యంతర మేమి భవానీ!"

"అన్నా! నేను నీకు శిష్యురాలి నగుదును. నా సోద రుఁడే యొక మహావిద్వాంసుఁడై యుండఁ జదువునకు నేనింకొకరి కడ కేఁగనేల? అంతియకాక నేనుగూడ నాశ్రమమునకు వచ్చుచో నింట గృహకార్య నిర్వాహణములో నమ్మకుఁ దోడు

పడువా రెవ్వరు?......పెద్దది యగుచున్నకొలఁది నామెకు నోపిక తగ్గుచున్నది.” అని భవాని సమాధాన మిచ్చెను. రాయలు సంతృప్తినొంది మరల నాప్రస్తావన నెన్నఁడును దేలేదు. కాని యప్పటినుండియు రాయలు ద్విగుణీకృతోత్సాహముతోఁ జెల్లెలికిఁ జదువు చెప్పెను. అంతకు మూఁడింతలు పట్టుదలతో భవాని చదువుకొన్నది. అన్నకును, రజనీకుమారికిని వివాహము నిశ్చయమైనదని తెలిసినంతనే భవాని రాయలయొద్దకు వేగముగా వచ్చినది.

“అన్నయ్యా! ఒక్కసారియైన రజనీకుమారిని మన యింటికి రమ్మనుటకు సిగ్గుపడినావు. జమీందారుల బిడ్డయని నీయూహ కాఁబోలు. ఆమె యింక మనయింటిలోనే ‘తిష్ట’ వేయునఁట. నీవుమాత్రమింకను సిగ్గుపడెదవేమో నన్నా!” అని భవాని యన్నగారితో ననెను. రాయలు నవ్వి యూరకొనెను. అవును. ఇంకను దనకు సిగ్గెందులకు?...

భవాని సుగుణాల ఖని. ఆమె వినయవతి. ఆ దూర దృష్టియు, నానెమ్మదియు నేవడుచులోను గాన్పింపవు. అయినను, జిన్నప్పటినుండియు నున్న చుఱుకుతన మామెలో వృద్ధి నందుచు వచ్చినదే కాని రవంతయును దగ్గలేదు. అంత నెమ్మదిలోను మాంద్యము మచ్చునకైన నుండదు. ‘మనిషి’ బక్కపలుచగాఁ గొంచెము పొడవుగా నుండును. మొగము కొంచెము కోలగా, సౌందర్యరేఖా సమన్వితమై యుండును. ఆమె విగ్రహములో నచ్చువుఁ దెనుఁగుఁదన ముట్టిపడుచుండెడిది.

అన్న కల్గించిన విద్యాసంస్కారమునకుఁ దోడుగ నామెకుఁ దల్లి కడ లోకజ్ఞాన మలవడెను. ఇవియన్నియునుగాక, యామె కాత్మవిశ్వాస మెక్కువ. తనకుఁదట్టినదే సరియైన యూహాయని యామెనమ్మిక. అది యహంభావ మనరాదు కాని, యాత్మ విశ్వాసమే యనవలెను.

రాయలు భవానికి గురువు; భవాని కేశవమూర్తికి. భవాని సాహిత్యములోఁ జాలఁగృషిసల్పినది. కాని కేశవుని కంత చదు వక్కఱలేకపోయినది. అసలు వానికిఁ జదువునం దంత శ్రద్ధ లేదు. అతఁడు వ్యవసాయపుఁ బనులందుఁ దండ్రికిఁ దోడుపడుచుండెడివాఁడు. కేశవునికిఁ బండ్రెండేండ్లు వచ్చి నప్పటినుండియు రామయ్యగారు వ్యవసాయపుఁ బెత్తన మంతయుఁ జిన్నకుమారుని కప్పగించివేసిరి. కేశవునికి వ్యవసాయపుఁబనులందు తీరికయే యుండదు. కాని బుద్ధి కుదిరినప్పు డెప్పుడేని చదువునకుఁ గూర్చుండెడివాఁడు. అకూర్చున్న కానే ఘను గొంచెము పట్టుదలతోడనే చదివెను. ఏపుస్తకమునైనను, అర్థము చేసికొనఁగల శక్తి వానికి వచ్చినది. వ్రాఁత యన్నచో వానికి మిక్కిలి ఇష్టము. పాలేరు పద్యాలనుగూడ వ్రాయుఁడు. ఏమేని వ్రాయక తప్పనిచో రెండురోజుల తరువాతఁ దా నేమి వ్రాసినదియుఁ దనకే తెలియదు. అందుచే వచ్చినంతే చాలు ననుకొనినాఁడు. మఱియు నాతఁడు చెల్లెలి ప్రోత్సాహముతో మాతృభాషనుగల వన్నెకెక్కిన కావ్యములను ప్రబంధము లను జాలవఱకుఁ జదివియున్నాఁడు.

కాని యాగ్రంథములలోని లోతుల నాతఁడు పరిశీలింప లేదు. పరిశీలింపవలసిన యావశ్యకము నాతనికిఁ గన్పింప లేదు చిత్రకళలకుఁ బ్రధాన గుణమగు నానందదాయకత్వము తోడనే యాతఁడు సంతృప్తి పడినాఁడు. వాని యిష్టకవి అల్లసాని వారు. చదివినంతటిలోను పెద్దన్నగారి ప్రబంధ సరణియే వానికి నచ్చినది. ప్రబంధముయొక్క పూర్తిస్వరూప మంతయు నాకవితాపితామహుఁడొక్క గ్రంథములోనే చూపించి వేసినాఁడని కేశవుని నమ్మిక. ఇతర దేశ సారస్వతములనుగూర్చి వానికేమియును తెలియదు కాని మనుచరిత్రవంటి మహాప్రబంధ మింకే సారస్వతమున నుండదనియు, నది యాంధ్రుల ప్రత్యేకత యనియుఁ దత్కర్తయగు పెద్దనామాత్యుఁడు ప్రపంచ సారస్వతోపాసకు లందఱిచేతను మన్నింపఁబడఁ దగినవాఁడనియు నాతఁడూహించెను. పెద్దన్నగారి ప్రవరుమూర్తి కేశవుని హృదయములో నాతుకొని పోయినది. ప్రవరుని వర్ణనమును జదువునప్పుడు వానికి మైమఱపు కలిగెడిది. ఆపద్యములను గంఠస్థముచేసి యప్పుడప్పుడు లోలోనఁ బాడుకొను చుండెడివాఁడు. కేశవుని కంఠముకూడ వినుటకు సొంపుగా నుండును. కాని యెంత తెలియుత్వములో నున్నను బడమటిగావు జ్ఞాపకమునకువచ్చె నేని చదువునకు స్వస్తి చెప్పవలసిన దే. కేశవుఁడొక విచిత్రవ్యక్తి. పడమటిగావు వాని కాప్తురాలు. పాలేరులు చుట్టములు. పంటభూములు విహార ప్రదేశములు. ఆ నీటిజల వచ్చుస్థలము కేళీగృహము. ఆతఁడు దయాస్వరూపుఁడు. కాలి

క్రిందఁ బడి చీమనైన నలిఁగినచో వానిహృదయము తునుకలై పోవును. ఎన్నఁడు నొకరి కపకార మొనర్చి యెఱుఁగఁడు. ఉపకార మొనరించి ప్రత్యుపకారము నాశింపఁడు. తల్లిదండ్రు లన్నచో వానికిఁ బవిత్రభావము. అన్నను గారవించును. చెల్లెలిని గారవించును. అందులోఁ దన శిష్యభావముకూడ నున్నది. వానినందఱును 'చిన్నబాబు' అని పిలుతురు.

వ్యవసాయపుఁ బనులతోఁగాని, గృహకార్యములతోఁ గాని, యన లితర ప్రపంచముతోడనే రాయలకు సంబంధము లేదు. ఎల్లప్పుడును దన పనియేమో? తానేమో? అంతియ. పగలంతయు నాశ్రమమందే గడచిపోయెడిది. సాయంకాల మింటికి వచ్చుటతోడనే చెల్లెలికిఁ జదువుచెప్పును. తరువాతఁ దన చదువు. కాని రాత్రులందు భోజనము లైనతరువాత, భవానియును, దానును జదువునకుఁ గూర్చుండు లోపల మాత్రము కొంచెమువ్యవధి యుండెడిది. అప్పుడు తండ్రితోడను, భోజన సమయములందుఁ దల్లితోడను బ్రసంగించుచుండును. విద్యాభ్యాసము పూర్తియగునప్పటికి రాయలకు పదునెనిమిదేండ్లు దాఁటినవి. రాయలు సంస్కృతాంధ్రములందు గొప్ప పాండిత్యమును సంపాదించెను. తెనుఁగునఁ బ్రౌఢకవిత్వమును వ్రాసెడి నేర్పలవడినది. రాయలు కవియన్న ప్రఖ్యాతి గోదావరినది రెండుపక్కలను వ్యాపించినది. వాని కంఠము చాల మధురముగ నుండును. ఆతఁడు పద్యములను జదువుచోఁ బంట మీఁదనున్న చేను గాలికి నల్లనల్లన నూగిసలాడుచున్నట్లుండును.

వాని కంఠమునం దెంతయో యాకర్షణశక్తియున్నది. ఆతఁడు మాటాడినచో నెంతయో మనోహరముగ నుండును.

మొదటినుండియు విజయేశ్వరాధిపులకు రాయలతోఁ బ్రసంగించుటయన్న చాల నిష్టము. రాయ లెవ్వరితోనైనను జాల గౌరవముగ మాట్లాడును. ఆతఁడు తానై ప్రసంగము నెత్తఁడు. ఎవ్వరైనఁ గానిండు, గౌరవముగఁ బల్కరించి యేదేని ప్రసంగములోనికి దించినచో నింక ననర్గళముగా నుపన్యసించును. వాని వచఃపాటవమునకుఁ గుమారమోహనులు ముగ్ధు లగుచుందురు. పరిపాలనా వ్యవహారములలో మనస్సెంత చీకాకు పడినను, సాయంకాలము వాహ్యాళిగా నాశ్రమమునకువచ్చి యింటికి వెడలిపోనున్న రాయలతో రెండు ముక్కలు మాట్లాడినచో నాయనకు నవజీవము వచ్చినట్లయ్యెడిది. ఏకాంతమున విశ్వనాథుఁడుకూడ రాయల వచోమాధుర్యమును, వాని దినదినప్రవర్ధమానమగు విజ్ఞానమును రామమోహనులయొద్దఁ బ్రశంసించెడివాఁడు. రాయలన్నచో రామమోహనుల కింతింత యనిరాని ప్రేమయు, గౌరవము నేర్పడుటకు ముఖ్యముగా విశ్వనాథుని ప్రశంసయు, నాతఁ డప్పుడప్పుడు బయల్పఱచుచు వచ్చిన కొన్ని భావములు కారణ మనక తప్పదు.

భవాని యన్నయొద్ద సంస్కృతాంధ్రములను జక్కఁగాఁ జదువుకొన్నది. కొన్నికొన్ని ప్రౌఢగ్రంథముల నామె యన్న సాహాయ్యమక్కఱలేకయే యర్థముచేసికొనఁగల్గెను. పదుమూ

డవయేఁటనే యామెయును గవిత్వమును జెప్పసాఁగెను. అది యును జాలబాగుండెడిది. ఆపై దృష్టి నూత్నభావసంకీర్ణము లైన గ్రంథములవైపు మఱలినది. అప్పటికిఁ గందుకూరి, చిలక మర్తి మొదలగు పురోగాములు ప్రబంధశైలి వీడి సంఘ సంస్కారాశయపూరితములైన కావ్యములను రచింపఁబూనిరి. (భారతదేశములో మహాత్మునికంటె ముందుగా నాంధ్రదేశ ములోఁ జిలకమర్తివారు హరిజనసంఘసంస్కారమును బ్రారం భించుట సర్వజనవిదితము.) భవానియు నా మహామహుల కవిత్వము ననుసరించుచు ఖండకావ్యము లల్లసాఁగినది.

అప్పుడప్పుడు భవానియు, రాయలును సాహిత్యవిషయ ములనుగూర్చి ప్రసంగించుకొనుచుందురు. ఆసమయమునకుఁ దానింట నుండుట సంభవించినచోఁ గేశవుఁడు ప్రక్కగదిలోఁ గూర్చుండి వారిరువురి వాదములను శ్రద్ధతో వినుచుండెడి వాఁడు. అన్నగారి ప్రతిభావిశేషములను దలంచుకొని భవా నియుఁ గేశవుఁడును విస్మయ మొందుచుందురు. చెల్లెలి విమ ర్శనాబుద్ధిని స్వతంత్రాభిప్రాయముఁ నన్న ప్రశంసించెడివాఁడు. సంప్రదాయమహానది కొక క్రొత్త యుపనదిని, జేర్చుచున్న నాఁటికవులను దన చెల్లె లర్థము చేసికొన్నదని రాయలు సంత సించి, క్రొత్తమార్గమును ద్రొక్కినందుల కామె లోకమున కాదర్శప్రాయ కాఁగలదని యూహించుచుండును.

అన్నతో మాటాడని రోజు భవాని కొక యుగము గడపినట్లుగా నుండును. ఎల్లప్పుడు నాతఁ డేదేని యొక క్రొత్త

విషయమును జెప్పుచుండవలయును. ఆమె వినుచుండును. రజనీకుమారి కాంపురమునకు వచ్చిన తరువాత ముగ్గురును గలిసి చాల సేపు ప్రసంగించుకొనుచుండెడివారు. సారస్వత విషయికములగు చర్చలైనతరువాత రజనీకుమారి కొంతసేపు వీణ వాయించి యుండవలకు నానందమును గొల్పెడిది.

కొడుకు కోడండ్ర యన్యోన్యతను; వారి సంస్కారతను; భవానికిని, రజనీకుమారికి నేర్పడిన స్నేహమును జూచుచు నీశ్వరమ్మగారును, రామయ్యగారును దమంత యదృష్టవంతు లింక లేరనుకొనిరి. వారి కేమో కావ్యలోకములో నున్న ట్లున్నది. ఆనందమయమైన రెండు సంవత్సరములు జరిగి పోయెను. కొంతకాలము రజనీకుమారీ కృష్ణరాయలు విజయే శ్వరమునం దుండి, తిరిగి వచ్చునప్పుడు విశ్వనాథుని సంద ర్శించి వచ్చినారు. తా నంతకుముందే చదువుటకుం బ్రారం భించి, హైందవ వేదాంతమును గూర్చి రాయలు కొన్ని క్రొత్తవిషయములను గురుముఖమున నేర్చుకొనినాడు.

భవాని పదునాలేండ్ల బంగారు పదుమైనది. కేశవునికిం బదునెనిమిది దాటినవి. ఆయేడు భవానికి వివాహము చేయ వలెనని యీశ్వరమ్మగారు సంకల్పించిరి. "విధి దానంతట నదే త్రోసికొనివచ్చు" నని రామయ్యగారి సమాధానము. రాయల వివాహ మనుకోకుండగనే జరిగిపోయినది. అట్టి యనుకూల సంబంధము కుదురునని యెవ్వరు నూహించి యుండలేదు. అందువలన నీవివాహనిర్ణయముగూడ దైవేచ్ఛకే రామయ్య

గారు విడిచిపెట్టివేసినారు. వివాహములు కుదురుట, కుదరక పోవుట మనచేతిలో నెంతమాత్రమును లేదని రామయ్యగారి యూహ—లగ్నఘడియ సమీపించినచో నొకరిప్రమేయము లేకయే వివాహము నిర్విఘ్నసమాప్త మగును. ఆటంకము లెన్నియైనను దాని నడ్డలేవు.

గోదావరి కావలియొడ్డున రామగిరి యను నొక పెద్ద జమీందారీ కలదు. ఆ సంస్థానాధీశుఁడు గిరిరా వను నాతఁడు. వానికిఁ బాతికేం డ్లుండును. వాని మొదటిభార్య యొక యాఁడుశిశువును బ్రసవించి చనిపోయినది. ఆతఁడు తన మొదటిభార్యను సరిగాఁ జూడలేదని యొకవదంతి యున్నది. వాని కింక "నా" యనువా రెవ్వరును లేరు. భవానిని దన కిచ్చి వివాహము చేయవలసినదిగాఁ గోరుమని యాతఁడు తన పురోహితు నాకస్మికముగా నొకనాఁడు రామయ్యగారి యింటికిఁ బంపించెను. అందఱి యిష్టానిష్టము లొకచో నుంచుదము; భవాని మాత్రము వానిని వివాహ మాడుట కంగీకరించినది. ఆ కుటుంబములో నామె యిష్టమును గాదనువా రెవ్వరును లేరు. కాని కేశవుఁడుమాత్ర మామెను "భవానీ! వెనుకముందులు నీవు బాగుగా యోచించుకొంటివా?" యని ప్రశ్నించెను. ఆమె తల యూపినది. కేశవుఁ డూరకుండెను.

భవాని గిరిరావుబాబు కథ నంతటిని గర్ణాకర్ణికగ వినియున్నది. అప్పుడే యన్నగారి శుశ్రూషలో నామె నాగానందమును బూర్తిచేసెను. బోధిసత్త్వుఁడైన జీమూతవాహ

నని దివ్యానివేదనము నన్నగారు వ్యాఖ్యానము చేసి చెప్పుచున్నప్పుడామె మహానందముతో మైమఱచి యేలోకముననో సంచరించెడిది. ఆ యద్భుత నాటకమును బోధింపుచు నహింసావ్రతము సర్వాశయ సాధనములలో నుత్తమోత్తమమనియుఁ బరమపవిత్రమనియు జ్ఞానస్వరూపులగు శ్రీకృష్ణ, శంకరాచార్యాది యవతారములు ప్రపంచోద్ధరణ కెంత ముఖ్యములో, నహింసాస్వరూపులగు జీమూతవాహన, బుద్ధ, మహావీరాది పరమభాగవతుల యవతారావిష్కరణము నంతియు ముఖ్యమనియు, నట్టి పురుషుఁ డొకఁ డుద్భవించి యున్నాఁడనియు, నాతని యవతారము కొలఁది సంవత్సరములలో వ్యక్తమగునని తనదేశికులు చెప్పిరనియు రాయలు భవానికిఁ జెప్పెను. అవి భవానిహృదయమున నాఁటినవి. గిరిరావుకథ వినినప్పుడును, ఈనాఁడాతఁడు తన్ను వివాహమాడఁగోరి సందేశమంపినప్పుడును, అతని క్రూరత్వమున కాహుతియైన వాని భార్య విషాదగాథ వినినప్పుడును, దిక్కులేని యా దొడ్డ యిల్లాలి పసికందు బ్రతుకుయొక్క సంకటస్థితిని దలఁచుకొనినప్పుడును, ఆమెకనుల నీరునిండి, ఆమెలో నేమి స్పందనము కల్గినదో కాని, గిరిరావుబాబునే తాను వివాహమాడి యాతనిని మరల నొకసత్పురుషుని జేయ నామె సంకల్పించుకొనెను.

రామగిరినుండి గిరిరావు బాబు పురోహితులు కుమారదేవము వచ్చిననాఁడే సంజీవపురమునుండి యింకొక రాయబారము వచ్చినది. సంజీవపురము భీమోలు ప్రాంతములలో

నొక మొఖాసా. అది రామగిరి జమీందారీలోఁ జేరినదే. ఆ మొఖాసాదారు కుమార్తె చంద్రావతియను నామెను కేశవమూర్తికిచ్చి వివాహము చేయవలెనని యీ రాయబారము. పెండ్లికి ముందు పెండ్లికుమారుఁడు వధువును జూచుకొను నాచారము రామగిరిజమీలోనివారికి లేదఁట. అందువలఁ భవానియు, నీశ్వరమ్మగారును, రజనీకుమారియును వెళ్ళి చంద్రావతిని జూచివచ్చిరి. వారి వర్ణనలను విని కేశవుఁడు వివాహమున కంగీకరించెను.

వివాహములు నిశ్చయమైనవి. ప్రథమమున భవాని వివాహము జరిగినది. తన రెండవ వివాహమును ప్రథమ వివాహమును మఱపించు వైభవముతో జరిపింపవలెనని గిరిరావు సంకల్పించుకొనెను. భవాని యందమును, సౌశీల్యమును, విజ్ఞానమును విని ముగ్ధుఁడై యున్న గిరిరావుబాబు, ఆమె మనస్సునుగూడఁ గరఁగింపవలె నను నిశ్చయముతోఁ దన వైభవమునంతటిని బ్రదర్శించినాఁడు. ఆ వివాహమైదురోజులలోను నాతఁడు కుమారదేవమునందు జరిపించిన గానసభలకు, నాడించిన భోగముమేళములకుఁ, గాల్పించిన బాణసంచాకును, గుమారదేవము చుట్టుపట్టులందలి ప్రజలెల్ల విస్మయమొందిరి. భవాని పెండ్లియైన పదునేనుదినములకుఁ గేశవుని వివాహమైనది. అంతవఱకును గిరిరావు కుమారదేవమునందే యుండెను. చంద్రా కేశవుల వివాహముకూడ నుదాత్తమై, మధురముగ జరిగిపోయినది. వివాహకార్యకర్త రాయలు కదా?

సంజీవపురమున వివాహానంతరములో నూతన వధు వగు చంద్ర భవాని ననవరతము నంటిపెట్టుకొని యుండెడిది. పెండ్లిచూపులకు వెళ్ళినప్పటినుండియును జంద్ర యన్నచో భవాని కేదో చెప్పరాని గౌరవమేర్పడినది. అందువలన నామె యును జంద్రనొక్క నిమేషమేని విడిచియుండలేదు చిన్నన్న గారి వివాహమైన వెంటనే భవాని భర్తతో రామగిరికిఁ బ్రయాణము కావలసియున్నది. కాని వారిరువురు నింకొక్క నాల్గురోజులపాటైనఁ గుమారదేవముులోనుండి వెళ్లుఁ డని యందఱును గోరిరి. గిరిరావు తా నుండుట కొప్పుకొనలేదు. నీవైన నుండుమని చంద్ర భవానిని బలవంతపెట్టినది. రజనీ కుమారి యామెను బలపఱచెను. భర్త యాజ్ఞ కైకొని యొక నాల్గురోజులు మాత్రము తాను బుట్టింట నిల్చియుండుటకు భవాని యొప్పుకొనెను.

భవాని, చంద్రావతి, రజనీకుమారి— ఈ మువ్వురును వివిధ సౌందర్యపూర్ణలు. ఉషస్సౌందర్యము భవానిది. సంపూర్ణ శారదాజ్యోత్స్నాసౌందర్యము చంద్రావతిది. రజనీ కుమారి సర్వగుణపూరిత మధుమాససౌందర్యపూర్ణ. సౌందర్య సృష్టిరహస్యము మువ్విధముల నామువ్వురిలోన నిమిడియున్నది.

ఈ మువ్వురిలోను జంద్ర నిరాడంబరజీవిని. నగలు నాణెములపై నామె కంత శ్రద్ధయుండదు. నిరలంకారముగా నున్నప్పుడే యామె సహజమూర్తి మిక్కిలి మనోహరముగా నుండును. మెడలో నొంటిపేట గొలుసును, చేతులకుఁ బోచీలు,

గాజులును ; కాళ్ళనందెలు నామె యెల్లప్పుడును ధరించి యుండును. ఆపె పెదవులపైc జిఱునగ వెల్లప్పుడును దాండవించుచుండును. విగ్రహము పొడవును, బొట్టియునుగాక సమత్వము కలది. ఆ శరీరచ్ఛాయ చాయcదేఱిన మేలిమి బంగారువలె మిసమిస లాడుచుండును. శిరోజములు చాల నొత్తుగా నుండి, యా పొడవైన జడ నితంబశ్రేణిపై నడయాడుచుండును. శరత్తులోc బుట్టిన దగుటచే నామె చిన్నప్పటినుండియు శరచ్చంద్రికcబోలు తెల్లనిచలువబట్టలనెక్కువగాc గట్టుచుండెడిది. అందులకుcదోడు కేశవునికిc దెలుపన్నచో మిక్కిలి యిష్టమగుటచే నిప్పుడామె నిత్యమును వానినే ధరింపసాcగెను.

చంద్ర యంతగాc జదువుకొన్నదికాదు. విద్యయందాసక్తి యున్నదికాని యామె బాగుగాc జదువుకొనుటకుc జిన్నతనములో వీలుకలుగలేదు. ఆ పల్లెటూరిలో నామెకుc జదువు చెప్పెడివారే లేకపోయినారు. ఇంటి పురోహితులే యేమాత్రమో చెప్పియున్నారు. దానినే యామె యింకొక కొంచెము వృద్ధిచేసికొన్నది. భవానియును, జంద్రయు నొకే యీడువారు. రూపగుణవిలాసములం దిరువురు నించుమించుగా సమాన లనవచ్చును. కాని చంద్ర సౌందర్యమున మిన్న. భవాని విద్యాధికురాలు. చంద్ర లోకానుభవజ్ఞురాలగు తల్లికి శిష్యురాలు. భవానియును దల్లియొద్దనే శిక్షపొందినను, ఆమెకుc బుస్తకజ్ఞానమే యెక్కువ.

భవానికివలె చంద్రకుcగూడ నూలుతీయుటన్నc జాల

నుత్సాహము. చంద్ర భవానికంటెను సన్ననినూలు తీయఁ గలదు. చంద్రయొక్క సుకుమారతయంతయును సాలెగూఁటి తంతులంతటి సన్నముగా నూలు తీయుటలోనే కన్పించును. ఆ సుకుమారత భవానిలో లేదు. రజనికుమారి పేరుపురికంటె సుమారు మూఁడేండ్లు పెద్ద. ఆమె కేశవపురికంటెఁ గొంచెము పెద్దది. అయినను రజనీకుమారికూడ నా యిరువురితో సమాన వయస్సు కలదానివలెనే యుండును. మువ్వురు నొకేరకపు దుస్తులను గట్టినచో దూరమునుండి వారిని గుర్తించుటకూడఁ గష్టమే! ఈశ్వరేచ్ఛగా రా నాల్గురోజులు నాముప్పురితోఁ బాటు తామును నవయౌవనమును జెందినారు. అప్పుడు మాధవీమందిరములో మధువులే కురిసినవి.

రామగిరి సంస్థానాధీశుఁడగు గిరిరావు విలాసపురుషుఁడు. ఈ సంస్థానమునకు సాలీనా మంచి యాదాయము వచ్చును. గిరిరావింద్రభోగముల ననుభవించుచుండును. ప్రజల మొఱ నాతఁ డాలింపఁడు. అప్పటి కింకను జమీందారీ లుచ్చదశలో నున్నవి. ఆ చుట్టుప్రక్కలనున్న జమీందారీలలోఁ బ్రసిద్ధ కెక్కినది విజయేశ్వరము. గిరిరావు తండ్రిగారి కాలములో రామగిరియుఁ జాల నుచ్ఛస్థితిలోనుండి విజయేశ్వర సంస్థాన ముతో సమానమై యుండెను. కాని గిరిరావు మదోన్మత్తుఁడై యభయుఁడై సంచరించి సంస్థానమును జిందరవందర చేసివేసి నాఁడు. చిన్నతనములో నధికారము చేతికివచ్చినది. ప్రాయము, ధనము, అధికారము—మూఁడును వానికున్నవి. ఈమూఁడును

వానికున్న వివేకము నణఁచివేసినవి. సంస్థానము న కాదాయము క్రమముగాఁ దగ్గఁజొచ్చెను. వ్యయము హెచ్చయ్యెను. పరిపాలనమంతయును దుష్టులచేతిలోని కేఁగినది.

గిరిరావునకుఁ బానీయములును, స్త్రీజనము నున్నచోఁ జాలును. పరిపాలన మక్కఱలేదు. రైతు లుద్యోగస్థులచేఁ బీడింపఁబడిరి. వారి మొఱ నాలకించు నాథుఁడు లేఁడు. ప్రజలను బీడించి పిప్పిచేసి వసూలుచేసిన మొత్తమంతటిలో నుద్యోగస్థులు సగమువఱకు స్వాహా చేయుదురు. మిగిలిన సగములో నూటికిఁ దొంబదివంతులు దివానాఫు భోగవిలాసములకు. మిగిలినదేమేని యున్నచో నది తక్కిన యన్ని పరిపాలనా వ్యయములకును—అందులో మరల నుద్యోగస్థుల జీతములు కూడనున్నవి. రామగిరి సంస్థానమునకు దుర్గతి పట్టిన ప్రథమ దివసము లవి.

రామగిరి జమీలోనివారి కందఱకును వివాహమునకు ముందు పెండ్లికుమారుఁడు వధువును జూచుకొను నాచారము లేకపోవుటచే గిరిరావును వివాహమునకుముందు తనమొదటి భార్యను జూడలేదు. ఆమె యంతయందమైనది కాదు. కేవల మామె గుణసంపత్తికి మెచ్చియే గిరిరావుతండ్రిగా రామెను దమ కోడలిగా నంగీకరించియుండిరి. ఆయనకును గిరిరా వన్నచో నభిప్రాయములేదు. గుణవంతురాలు భార్య యైనచో నామెయైన వానినిఁ జక్కఁదిద్దుకొనునేమో యని యాయన యూహించెను. కాని గిరిరావునకుఁ గావలసినది

రూపముమాత్రమే. అంతరూపవంతురాలుకాని భార్య వానికి నచ్చలేదు. మొదటిరోజులలో నేమిపాలించినాఁడో అంతియే. క్రమముగా నామెమోమును జూచుటకూడ మానివేసినాఁడు. ఎప్పుడైనను నెదురుపడినచో నాతఁడు చీదరించుకొనసాఁగెను.

కాని సుగుణఖని యగుటచే నాతఁడు పెట్టు బాధలన్నిటి నామె యోర్చుకొనెను. ఎంతయోర్పు వహించినను దనభర్త నడవడియుఁ దత్ఫలముగ రామగిరి సంస్థానమునకుఁ బట్టుచున్న దుర్గతియుఁ దలంపునకు వచ్చినప్పుడెల్ల నామెకు దుఃఖ మాఁగెడిదికాదు.

ఆమెదుఃఖము గర్భస్థదనానలము. బెంగతో నామె కృశించిపోయెను. గర్భవతియైయున్న దినములలో గిరిరావు నడత మఱియును మితిమీఱిపోయినది. నెలలునిండిన సమయములోఁదనకొక్కసారియైన దర్శనమీవలెనని యామెభర్తకుఁ గబురుచేసెను. కానియాతఁడు రాలేదు. శల్యావశిష్టయైయున్న యామెపడిన ప్రసవవేదన కంతులేకపోయినది. అనుభవశాలినులైన దాదు లతిప్రయత్నముమీఁదఁ బుట్టిన యాఁడుశిశువును రక్షింపఁగల్గిరి. తల్లిమాత్రము మూఁడురోజుల వఱకును స్పృహయెఱుంగదు. దాదులు నిరాశచేసికొనినారు. నాల్గవనాఁడామె కొంచెము తెప్పరిల్లినట్లు కన్నువిప్పి బిడ్డను జూపింపుమన్నది. కాని కన్నబిడ్డను రెండుకనులు విప్పి యాతల్లి చూచుకోలేక పోయినది.

అది యవసానదశయని యందఱును గ్రహించినారు.

కడసారిగా నొక్కపరియైన దర్శన మిప్పించవలెనని తన భర్తకుఁ దాను విన్నవించినట్లుగాఁ జెప్పుఁడని యామె దాదులను గోరెను. గిరిరావు వచ్చినవారిని జీవాట్లుపెట్టి పంపించి వేసెను. ఆమె విరక్తి చెందినది. తన భర్త మరల వివాహ మాడును. తన పసినిసుఁగుగతి యేమి? పసిపిల్లనైనను దిన్నగాఁ జూడుఁడని యామె భర్తకు విన్నవింపనెంచెను. ఆయొక్క విషయమే యామె యాలోచించెను. అతఁడు రానప్పు డామె యేమిచేయఁగలదు? ఏమియు నామెకుఁ దోఁచినదికాదు. కనులు మూసికొని తనకుఁ గాఁబోవు సవతికి నమస్కరించినది. తనభర్తను సంస్కరింప వలసినదనియుఁ దన కన్నబిడ్డను సంరక్షింప వలెననియు నామె కోరుకొనెను. చుట్టు నున్నవారంద ఱాదృశ్యమునుజూచి కనుల నీరు నించిరి. ఆమెతోఁ బుట్టింటినుండి వచ్చినదా దిమాత్ర మామెయొద్దకు వచ్చి "అమ్మా! నీ బిడ్డకేమియును భయములేదు. నేను పెంచెదను. రాఁబోవు నమ్మగారును బసిపాపను ప్రేమగానే చూతురు. మీరు చింతపడవలదు." అని యోదార్చినది. కృతజ్ఞతతో నామె శాశ్వతముగాఁ గనులు మూసికొనెను.

కుమారదేవమున నాల్గునాళ్ళుండి భవాని రామగిరి కేఁగినది. ఈలోపున గిరిరా వంతఃపురమును, బురమునుగూడ నలంకరింప నాజ్ఞాపించి మహా వైభవముగా నూత్నవధువు నాహ్వానింప నాయత్తుఁడై యుండెను. భవాని వచ్చుటతోడనే గిరిరా వామె హస్తమును బట్టుకొని యత్యుత్సాహమున

నామెకుఁ దనయంతఃపురమును జూపించినాఁడు. దానిని గాంచు నప్పటికి భవాని కన్నులు తిరిగిపోయినవి. ఆ యంతఃపుర శృంగారమును వర్ణింప నలవికాదు. ఆ యలంకారములను గలయఁజూచినంతనే భవానికన్నులవెంబడి రెండశ్రుకణములు రాలినవి. వానిని గాంచి యానందబాష్పము లనుకొని గిరిరావు పొంగిపోయెను.

ఆ సాయంకాలమే యే విషయమును దాఁచుకొనలేని కొందఱు పరిచారికలు పెద్దరాణియొక్క దీనగాథ నంతటిని రహస్యముగ భవాని కెఱింగించిరి. ఆపె హృదయము తునుక లై పోయినది. ఆపిచ్చితల్లి యెడ నిదివఱకామె కేర్పడిన భక్తియు, గౌరవము నిప్పుడు సహస్రముఖముల నామెలోఁ బ్రవహించినవి. ఆపె రెండు కోరికలను దాను దీర్ప దీక్ష వహించి సవతి చిత్రపటముకడ భవాని శపథమును గైకొనెను. "చెల్లీ! కళంకపూరితు లగువారల నిష్కళంకితుల నుగాఁ జేయుమని మా దేశికు లిదివఱలో నొకనాఁడాదేశించి యున్నారు. దానిని నేను నీకుఁగూడ నాదేశించుచున్నాను." అని తన యన్నగారు తనకు బోధించినమాట లామె కాకస్మికముగా జ్ఞప్తికివచ్చినవి. తాను విజయమందినట్లే యామెకుఁ దోఁచెను.

గిరిరావుబాబు నాజ్ఞచొప్పున నంతఃపురపరిచారిక లా రాత్రి భవానిని సౌందర్యాధిదేవతగా నలంకరింప వచ్చిరి. మె యేమియు నడ్డుచెప్పలేదు. పిమ్మటఁ బరిచారిక లామెను

శయనమందిరమునకుఁ గొంపోయి యామె నచ్చట దిగవిడి చిరి. ఆ పరమసౌందర్యమూర్తిని జూచి గిరిరావు చకితుఁడై పోయెను. వానిలో నణఁగియున్న కాంక్షలన్నియును విజృంభించినవి. ఆతఁడామెకడకు వేగముగా వచ్చినాఁడు. వాని పెదవులును జేతులును జలించుచున్నవి. భవాని నిశ్చలయై నిలిచియుండెను. ఆతఁడు మీఁదికి వచ్చుచుండుటను గమనించి యామె చేయెత్తి వారించినది.

'మీరొకక్షణనే కొలఁదిసేపు నిల్చి నామనవి వినుఁడని ప్రార్థించుచున్నాను. నేను మీకు భార్యనగుటచే నెల్లపుడును మీ యధీనములోని దాసనే. మీకును, మీ బాలికకును సేవ చేయుటయే నా జీవితపరమావధి. కాని మీరు ధనమత్తత చేత సంస్కారహీనుఁడైన యధమమానవుని క్రోవలఁ బడి యొక దొడ్డ యిల్లాలి మృతికిఁ గారణభూతులైనారు. మీ నడతకు మీరు పశ్చాత్తాపమునంది యుత్తమమానవ జీవిత క్షేత్రమునకు యాత్రికులు కానంతవఱకును నేను సార్థకమగు భార్యను గాఁజాలను. సౌందర్యవతినన్న గర్వము నాకు లేదు. నా సౌందర్యమున మిమ్ము సత్పథములకుఁ దెచ్చుటకు విని యోగపడినచో, ధన్యురాలను' అని భవాని చేతులను జోడించి నిల్చినది.

గిరిరావున కొకక్షణము మతి చలించినట్లైనది.—

"భవానీ! నన్ను నీవవమానించుటకుఁ బెండ్లియాడితివా? లేక నా యాస్తి నాశించి పెండ్లియాడితివా?"

"మీ రట్టిమాట లనకుఁడు. నేను మీ చరణదాసిని మాత్రమే."

"ఈనీతులు నాకుఁ దెలియవు. నన్ను బెండ్లి యాడు మని నిన్ను నే బలవంతము చేసియుండ లేదు. మొదటనే నీవు మేలుకొని యుండవలసినది. ఇప్పుడు నీవు నా భార్యవు. భార్య భర్తమాటను విని తీరవలయును. లేనిచో వినునట్లు చేయఁగలశక్తి నాకున్నది." గిరిరావు కంఠము కఠినమైపోయెను.

"మీరట్లు చేయుచో మీకు నాశరీరము మాత్రమే వశమగును. నామనస్సును మీరు వశపఱచుకోలేరు......"

గిరిరావు కోపమును దట్టుకోలేకపోయినాఁడు. ఆ వేశమును నిగ్రహించుకొనలేక యాతఁడు భవానిపై కుఱికెను. భవాని కదలక మనోధైర్యముతో హృదయమునఁ జేతులు కట్టుకొని యట్లనే నిల్చియున్నది. ఆమెకున్న యాత్మవిశ్వాసమువలన నాపెచూపు లగ్గిమంటలవలె గిరిరావు దూఁకుడు నరికట్టినవి. ఆతఁడొక్కసారి భవాని నాపాదమస్తకమును బరిశీలించి-తలవంచుకొని, వెనుదిరిగి, గదివీడి వెడలిపోయెను. భవాని మరల నొకమా ఱంతఃపురమును గలయఁజూచినది. ఆమె తలలో మెఱపు మెఱిసినట్లయ్యెను. ఆమె కేమో తలక్రిందైపోయినట్లైనది. తన ప్రథమప్రయత్న మిట్లు విఫలమైన దేమి? ...ఆమె కిఁక నక్కడ నిలుచుండుట కష్టమయ్యెను. ఆ శయనాగారమునుండి యీవలకు వచ్చి తలుపులను వెనుకవైపున తటాలున మూసివేసెను. ప్రళయకాల మైశాచికాట్టహాసము-

వలె మేడదిగి పోవుచున్న గిరిరావున కా శబ్దము వినిపించినది. భవానియును మేడ దిగి వచ్చెను. పరిచారికలు వెల వెలఁ బోవుచుఁ భయభ్రాంతలై నిలుచుండిరి.

గిరిరా వాగ్రహాముతో మేడదిగి వచ్చుటయు, నా వెనుకనే భవాని యేతెంచుటయును బరిచారిక లెల్ల వీక్షించిరి. ఒక్కసారిగా దివాణమంతయు నిశ్శబ్దమైపోయెను. మరలఁ బ్రకృతి జనములో గుస గుసలు బయలు దేరినవి. గిరిరావు సాయంసమయములందు విహరించు నాల్గవయంతస్తుపైకి వెడలి పోయినాఁడు. భవానిమాత్ర మధైర్యపడలేదు. చంటిపాపను జూపుఁడని యామె పరిచారికల నడిగెను. దాది భవానిని దోడ్కొనిపోయి యొక చిన్నగదిలో మంచముపై బోర్లపడి యేడ్చుచున్న పసిపాపను జూపెను. భవాని యా పిల్లను జంకకు నెత్తికొనెను. చంటిపిల్లల నెత్తుకొను నామె కదియే ప్రథమమైనను గుక్కపట్టి యేడ్చుచున్న యా పిల్ల యట్టె యూరుకొనినది. పరిచారిక లాశ్చర్యపడినారు. ఆపాపకుఁ బదునొకండవనెల వచ్చినది. కాని యింతవఱకును గిరిరావాపిల్లను జూచలేదు. ఆపిల్ల విషయ మేమైన వచ్చినచో నాతఁడు చీదరించుకొనును. ఆ పాప దీనస్థితికి భవాని హృదయము కరఁగి పోయెను. పాపను హృదయమునకు హత్తుకొన్నది. ముద్దాడినది. రామగిరివంటి సంస్థానాధీశుని యేకైక కుమార్తెయయ్యు నా పాప యనుభవించున్న దుఃస్థితికి భవానిగుండె తెఱుగుకొని పోయెను. ఆపాప సంరక్షణభారము నంతటిని దాను వహించి

నది. ఆమెకు 'భారతి' యని ముద్దుగాఁ బేరు పెట్టుకొన్నది.

చంద్ర భర్త కనుకూలముగా సంచరించెడిది. తన కేమి కావలయునో కూడ నాతఁ డెన్నఁడును జెప్పవలసిన యవసరమే లేకపోయినది. ముందుగా నామెయే సర్వమును గ్రహించెడిది. అందుచేఁ జంద్రయన్నచోఁ గేశవుని కింతింత యనరాని ప్రేమ యేర్పడినది. ఆపె సలహాయం దాతఁ డెక్కువ గురియుంచును. ఆమె మిక్కిలి సుకుమారి యని వాని తలంపు. అందుచే నాపె మనస్సు నాతఁ డెప్పుడును జివుక్కుమన నిచ్చెడివాఁడు కాఁడు. సంసారమును దిద్దుకొనుటలో వా రిరువురును జాల నేర్పరులు. ఈశ్వరమ్మగారును, రామయ్యగారును దమ తమ గృహభారములను జంద్రాకేశవులపైఁ బూర్తిగా విడిచిపెట్టివేసి, యున్నది లేదన్న చికాకు లేక నిర్విచారముగాఁ గాలము గడపసాఁగిరి. రజనీకుమారియు నాగర్భశ్రీమంతురా లగుటచేఁ జిన్నప్పటి నుండియు నేపనిని జేసియెఱుఁగదు. అందువలనఁ దోడుకోడలికి వెనుకను సహాయముగా నుండి యింటిని జక్కఁబెట్టుకొనుట నేర్చుకొనెడిది. కాని చంద్ర మాత్ర మక్క నేపనియును జేయనిచ్చెడిదికాదు. సర్వము నామె యొక్కతెయే నిర్వహించుకొనెడిది.

భర్తతోఁబాటు చంద్రయును గోసంరక్షణమందు శ్రద్ధ వహించెను. ఆవులు కేశవునొద్దకంటెఁ జంద్రయొద్దనే యెక్కువ చనవుగా నుండును. పడమటావుదూడ యెల్లప్పుడును గంతులు వేయుచు నామె వెంటఁ దిరిగెడిది. కేశవుని కమత

ములో మొత్తం మఱువదివఱకు నుండును. ఒకేపర్యాయ మాత్రం డిరువది నాగళ్లను గట్టించెడివాఁడు. రామయ్యగారు కొన్నదికాక కేశవుఁడు మరల నూటయేఁబది యెకరముల భూమిని కొన్నాఁడు. ఈ భూములకు నీటిజల యెక్కువపోవుటచే మెట్టపైరులే పండించెడివారు. ఇదివఱకుఁగొన్న కొన్ని భూము లను బాగుచేయించుటచేఁ బల్లపు వ్యవసాయము హెచ్చైనది. కేశవుని కమతములోనిపాడిలో మాధవీమందిరమున నుపయోగ పడగా . మిగిలినదాని నంతటిని పాలేరులే యనుభవింతురు. పాలేరులకుఁ జంద్ర యన్నచో నెంతో భక్తి. రైతులు కేశవుని కెల్లప్పుడును గృతజ్ఞులు. పరోపకారమును, గోసేవ యును నా దంపతుల జీవితపరమావధి. ఏదియో యొక సాహాయ్యమును బ్రతి రైతును కేశవునివలనఁ బొందినవాఁడే. ఊరంతయును 'గ్రామపెద్ద' యైన రామయ్యగారియొక్క మాట మీఁద నిలుచును. ఆ గ్రామవాసులకుఁ గేంద్రరాష్ట్రీయ పరి పాలనా వ్యవస్థల యవసరమే కాన్పింపదు. తలపెట్టిన యేపని యైనను సమష్టిమీఁద నాగ్రామములో సులువుగా జరిగిపోవు చుండును. అది యొక చిన్న స్వతంత్ర స్వర్గరాజ్య మనుటలో నందియము లేదు.

## 6

"రజనీ! మన యీ కౌఁగిలి స్థిరమైయుండు ననుటకుఁ జిహ్నముగ నేమి చేయుదము?"

"ఈస్థితిలోనే శిలలమై పోవుదమా?"

ఈ సమాధానము రాయలకుఁ జిత్తమగు నవ్వు తెప్పించెను. రజని మంచి యాలోచన చెప్పినది. శిలలుగా మాఱిననో వారు సుఖదుఃఖాతీతు లగుదురు. ఎల్లప్పుడును వారి కానందమే యుండును. అది స్వర్గసౌఖ్యమును మించినది. ప్రణయైక జీవుల నడ్డగించు కంటకము లేమైన వానికిఁ దగిలిననో నవియే మొఱుకుపోవును. అంతకంటె నిరపాయస్థితి మఱేమి యుండును?

ఆ యిరువురి పాదములు నీటిలో నున్నవి. వారు కూర్చున్న దొక గండశిల. శిల సగమునఱకు నీటిలో మునిఁగి యున్నది. ఎన్ని యబ్దములనుండి యా శిల యటనున్నదో కాని నీటి తాఁకుడున కది యఱిగిపోయి మిక్కిలి నునుపు దేరినది. అయినను దానిపై నిరువురును గూర్చుండుటకుఁ దగిన వైశాల్య మున్నది. ఆ శిల మిక్కిలి నల్లగనుండి నునుపుదేఱిన దగుటచేఁ జంద్రకిరణములు దానిపైఁబడి యందే మిళితమయి దాని కొక వింత సొబగును దెచ్చిపెట్టుచున్నవి. పండువెన్నెలలకు నీ రుప్పొంగి సంతోషాతిశయమునఁ గాఁబోలు పిల్లలు గంతులు వేయువగిది నది తరంగించుచుండెను. గెంతుచుఁబోయి యేకుడ్యమునో తాకి క్రిందఁబడు చిన్న పిల్లలవలె నీటియలలు శిలనుదాఁకి వెనుకకు విఱుచుకొని పడుచున్నవి. నీటిలో నున్న వారి పాదములచుట్టును జిన్న చిన్న చేపలు చేరినవి. చంద్రకిరణములు పైఁబడుటవలన నవి మెఱుఁగు పెట్టిన వెండి ముక్కలవలెఁ దళతళ మెఱయుచున్నవి.

శారీరక, మానసికాభిన్నత్వమున బ్రహ్మానందము ననుభవించుచుఁ దన్మయులై కౌఁగిలిలోనున్న యా ప్రణయైక జీవుల పాదములు కదలాడుటలేదు. అందువలనఁ జేపలు భయము వీడి వారి పాదములకుఁ జుట్టును వలయాకారముగ నేర్పడినవి. పెండ్లినాఁడు పాదములను గడుగుట కుపయోగించెడి వన్నెలు దిద్దిన వెండిపళ్ళెముకంటెఁ మిన్నగ నున్న దా వలయంపు సొగసు. వేయేల! రత్నాకరుని యైశ్వర్య మంతయు నందుఁ జూపట్టుచున్నది. పురాతనకాలపు ముత్తైదువగుటచేఁ గాఁబోలు నభిసారిక యగు గోదావరీనదీ సతల్లి నవ్యమగు ప్రేమ వ్యాపారములం దనుభవజ్ఞురాలైన యా జంపతుల నా వెండిపళ్ళియరంబునఁ బూజించుచున్నట్లు చిన్న చిన్న యలలు వారి మోఁకాలులనుదాకి క్రిందికి దిగఁజారు చున్నవి. ఇదియంతయు నొక్క నిముసము. ఇంతలో నొక గాలి సుడులు సుడులుగా వచ్చి యొడ్డుననున్న వృక్షముల నూగిసలాడించినది. నీరంతయును గదలిపోయెను. ఆధారము లేని చంద్రబింబ మూగిసలాడిపోయి చుట్టునున్న నీరంత యును దళుక్కుమన్నది. చేపలవలయము పెరిగిపోయి యాట కత్తె కంఠమునుండి జాఱిపడిన ముత్యాలహారము వోలె నయ్యెను. ఆగాలి కొంచెముచల్లగాఁగూడ నుండెను. ఆ ప్రియుల కౌఁగిలి మఱింత బిగిసినది. మనస్సులలోఁ జెప్పరాని యానందమేమో వారి నావహించెను. చలనములేక వారటు లనే యుండిపోయిరి——సుఖమును గాని, దుఃఖమును గాని తమ

యనుభవమునకు మించిన దైన్యముచో మనుజులచేతనులై జడముల భంగి నుండి, శిలాకృతినిఁ బొందుటలో నాశ్చర్యములేదు.

చెదరిపోయిన చేపలు మరలఁ బ్రోవుపడినవి. వానికి మఱి కొన్ని తోడైనవి. సుస్థిరుఁడైన విజేతవలె వారి పాదములు కదలక యెప్పటియట్లనే యున్నవి. చెదరిపోయిన సైన్యము నొకచోఁ జేర్చి తన్ను గెల్చినవానిపై నకస్మాత్తుగాఁ బడు వాని పగిది నొక పెద్దచేప వారిపాదములపై దండయాత్ర సాగించినది. ఆ ప్రియులీ సన్నాహమంతయు నెఱుంగరు. తమ మనస్సులవలెఁ బ్రపంచముకూడ కళంకరహిత మని చదువుకొను నాఁటినుండియు వారి యూహ. కావుననే రాత్రి యను భయములేక సంచరించుటలు కూడను. పెద్దచేప యొక చిన్నచేపను ముందుగాఁ బంపినది. అది పాదములపై కెగిరియు నీటియలలచేఁ ద్రోసివేయఁబడెను. సులువుగా శత్రువు లొంగు వాఁడు కాదని గ్రహించి పెద్దచేపయే మెల్లఁగాఁబోయి రజనీ కుమారి పాదమును గఱచిపట్టెను. రజని యులికిపడినది. సైన్యము చెల్లాచెదరైపోయెను. పరుగిడిపోవు సైన్యము వెనుకను రేఁగు దుమ్మువలె నీరు కదలాడి పోయినది.

"ఏమిటది రజనీ!" అని రాయ లడిగెను. రజని పాద మును నీటిలోనుండి వెలికిఁదీసి శిలపై మోపినది. చేపచేసిన గాయమునుండి రక్తము చిమ్ముచుండెను—నీటిలో సందడి తగ్గినది. కదలాడు నలలలోఁ జంద్రుఁడు యథాప్రకారముగా నాడుకొనుచుండెను. సందడితగ్గిన రాజ్యములో వ్యాపించు

చున్న ప్రశాంతివోలె వాయువు మందగమనమున వీవ సాఁగెను—రాయలు పరుగిడిపోయి యేదియో యొక యాకును గోసి తెచ్చి గాయముపైఁ బసరు పిండినాఁడు. రక్తము కట్టువడినది. ఇంకఁ గాలు నొప్పిచేయుకూడదు. పసరు గొప్పక్క పనితన మట్టిది. రాయ లామెను నడిపించుకొనిపోయి ప్రక్కనే కట్టివేయఁబడియున్న నావలోఁ గూర్చుండఁబెట్టి "ఆజ్ఞ" యన్నట్లుగా బద్ధహస్తుఁడై నిలుచుండెను. రజని నవ్వుచు దక్షిణముగాఁ జూచినది. ఒడ్డునఁ గసికకు గట్టిన త్రాటినివిప్పి రాయలు నావనెక్కి తెడ్డుగడను జేతఁబట్టినాఁడు. రజని కుంటుచుఁబోయి చుక్కానియొద్దకుఁ జేరినది. ప్రవాహమునకు దిగువగాఁ బోవలసియున్నను, గుమూరదేవమునొద్ద గోదావరి మలుపుతిరిగి యుండుటచే ప్రవాహవేగము చాల మందముగా నున్నది. రాయలుగడవేసి నావను నడపుచుండెను. రజని చుక్కాని పట్టినది. చంద్రుఁడు మింటిపై వారి ననుసరించుచున్నాఁడు. అది శుక్లపక్షనవమి, చైత్రమాసము. వసంతర్తు ప్రారంభదశ.

"రజనీ! కోయిలలు నీకు జడిసి కూయుటకూడ మానుకొన్నవిసుమా!" అని రాయలు నావకు రెండవ చివరను నిలిచి రజనిని బల్కరించెను.

"ఏలాగో?" అని రజని ప్రశ్నించెను.

"కోయిలలు కూహూస్వనము లొనరించును. నీవు ప్రత్యుత్తరమిచ్చెదవు. అది మనోహరాతిమనోహరము. అవి

సిగ్గిలి కూయుట నీఁక మానివేసినవి. నీకంతమునఁ బంచమము కంటెను మిన్నయగు వేఱొండు సృష్టి యుండనోపు. ఏమం దువు?''—రజని మాటాడలేదు. రాయలు వెదురుగడను నీటియడుగు భాగమున భూమిలోఁ దిమిపట్టి నావను నడపు కొనుచు నావయుంచు వెంబడిని జుక్కానివలకు నడచివచ్చెను. వెదురుగడ యూబిలోదిగి యుండుటచే లాగినంతనే సులు వుగా నూడిరాలేదు. రాయలు బలముకొలఁది గడను లాగి నాఁడు. గభాలునఁ బాటుగా నీరును జెదరివచ్చి రజనిపైఁబడెను. ఆనీరము మిక్కిలి చల్లగా నుండుటచే రజనిమొడలు జలద రించెను. ఆ తొట్రుపాటును జూచి రాయలు పరిహాసముగా నవ్వెను. రజని చుక్కాని విడిచిపెట్టివేసినది. నావపోయి యొడ్డును డీకొనుటచే నిరువురును దూలిపడినారు.

నావ నొడ్డునఁ గట్టివేసి యిరువురును మామిడి తోఁపు లోనికిఁ బోయిరి. అదివారికిఁ బ్రియమైన స్థలము. మామిళ్ళు చాల యెుత్తుగాఁ బూసినవి. జహంగీరు, గోవ, నీలము, పెద్ద రసము, పంచదార కలశలు, నాజూకుపసందు మొదలగు నుత్తమజాతి మామిడిచెట్లన్నియు నందున్నవి. రాయలకుఁ బెద్దరసాలన్నచో నోరూరును. అంతకంటెను మేలిమి బంగారు వన్నెదేరి, చెట్టునఁబండిన యొకొక్క నాజూకుపసందు పండు నకే యాతఁడు ప్రాముఖ్యమిచ్చుచుండును. రజనికి మామిడి బండ్లన్నచో నంత యిష్టములేదు. కాని యెుత్తుగాఁ బూసి నట్టియుఁ గొమ్మలు విరిగిపోవునేమో యన్నంతగాఁ బండ్లచేనిండి

నట్టియు రసాలములను జూచినచో నాపె యొడలు పులక
రించును. మామిడితోఁపును దాటి కొంచెము ప్రక్కగా వెళ్ళి
నచో నచ్చట మంచిగంధపుఁ దోఁపున్నది. సాధారణముగా
మంచిగంధపుచెట్లా ప్రదేశములలోఁ బెరుగవు. కాని, వానిని
బెంచుటకు రామయ్యగారు చాల శ్రమపడి కృతకృత్యు
లైనారు. చదరముగా నున్న యా వృక్షముల నడుమ నొకటి
చాలనేపుగాఁ బెరిగి పెద్దదైనది. మామిడితోఁపును వదలి
రాయలును, రజనియు నీ పెద్ద గంధపుఁజెట్టు వఱకును వచ్చిరి.
ఎందుల కంతదూరము నడిచివచ్చిరో వారూహింపనే లేదు.

ఆయాసముతో రజని యా చెట్టుక్రిందఁ గూర్చుండఁ
బోయెను. చిమ్మచీఁకటిగానున్న మామిడితోఁపులోనుండి
వచ్చుటచే వారి కింకను మసకలు పోలేదు. రజని కూర్చుండు
నంతలో 'పాము' అని రాయ లఱచినాఁడు. భయముతో
లేచి వచ్చి రజని రాయలను గౌఁగిలించుకొనెను. ఆ గంధపు
మ్రానినిజుట్టుకొని యొక తెల్ల త్రాఁచు పఱుండియున్నది.
అలుకుడు విని యది తలెత్తినది. వారు కదలలేదు. త్రాఁచు
పడగ విప్పినది. మిల మిల మను నా పడగకాంతికి రజని
కన్నులు నులుముకొన్నది. అప్పుడా ప్రదేశమంతయు
మెఱుపు మెఱిసినట్లు త్రాఁచు శరీరకాంతులతోఁ దళుక్కు
మన్నది. రాయలు చేతులను జోడించి త్రాఁచునకు నమస్క
రించినాఁడు. అంత నది దక్షిణ దిక్కుగాఁ బ్రాఁకిపోయినది.

రాయలు రజనిని గూర్చుండఁ బెట్టెను. ఆమె కింకను భయము తీఱలేదు.

వెన్నెల కొమ్మల సందునుండి గంధపు మ్రానిపై స్వచ్ఛముగాఁ బడుచున్నది. రాయలు తన మొలనున్న బాకును వెలికిఁ దీసి యా గంధపు మ్రానిపై గొలుసుకట్టు వ్రాతలో ముద్దువచ్చు నక్షరములతో లోఁతుగా రజని పేరు చెక్కి బాకును రజని కిచ్చినాఁడు. రజని వాని యభిప్రాయమును గ్రహించి లేచి రాయలు చెక్కిన యక్షరములపై నవి చెడిపోకుండ రాయల పేరుగూడఁ జెక్కినది. రాయలు బాకును మొలలో గ్రుచ్చుకొనినాఁడు. అక్షరములు స్పష్టముగాఁ గనవచ్చుచున్నవి.

"రజని! మన కౌఁగిలివలెనేయున్నదినుమా యీలిపి!"

"అవును, మీరు కోరినట్లు విడివడని కౌఁగిలి చిహ్నమిది." సంతోషమున రాయ లామె చెక్కిలిపై వ్రేలితో మీటినాఁడు. ఒక్కసారిగా నామె మొడలు పులకరించినది. రాయల కా విషయము తెలియును. తాము చెక్కిన పేర్లవలెనే తమ కౌఁగిలికూడ స్థిరముగా నుండవలెనని వారిరువురును మనస్సులలోఁ గోరుకొని వెనుదిరిగినారు. మరల నా త్రోవను వచ్చి యక్షరము లున్న స్థలమును జూచుకొనినది. చప్పుడు విని యిరువురును వెనుకకుఁ జూచిరి.

"మన కౌఁగిలి స్థిరముగా నుండుట కీ త్రోవ పూఁట కాఁపు" అన్నది రజని యప్రయత్నముగా.

"చంద్రుడు మధ్యవర్తి" అని రాయలు ఆకసమువంక చూపించెను. అప్పుడే కోయిల యొకటి మామిడితోపులో నుండి "తథా" స్తనునట్లుగ కూసినది. "అది మనమిత్రము" అని రజని కావలసినవానిని బూర్తిచేసెను. తిరిగి నావ నెక్కి వారిరువురును పూర్వస్థలమునకు వచ్చి సౌధమునకు దారితీసినారు. ఒకరితో నొకరు మాట్లాడుకొనుట లేదు. రజని ముందుగా మాట్లాడునేమో యని రాయలు, రాయలు ముందుగా మాట్లాడునేమో యని రజనియు వేచియుండిరి. కాని రాయలు ఊరకొనలేకపోయెను.

"మామిడితోపులోనుండి కూసిన కోయిలకు నీవు ప్రత్యుత్తర మీయలేదేమి?" అని రాయలడిగెను.

"మీరేప జ్ఞాపకము చేసితిరా?"...

రాయలు జవాబొసంగలేదు. ఇంక రజనివంతు మిగిలి యున్నది. కొంతసేపూరకుండి,—

"ఎంతో కాలమునుండి చూడవలెనని యుత్సహించుచున్న తెల్లత్రాచు నేడు కంటబడగానే మీరు వర్ణింపలేదేమి?" అని రజని ప్రశ్నించెను.

"నీవు చెప్పలేదని"...... ఈ సమాధానమునకు రజని నవ్వుకొన్నది. తరువాత వారు నిశ్శబ్దముగా నడిచిరి. మేడ మీదికిపోవు మెట్లయొద్ద రాయలాగినాడు. రజని 'నడువు' డన్నట్లు చూచినది.

రాయలు— 'నీవు ముందు......' రజని—'నేను వెనుక

వస్తును......' రాయలు—"కాదు. వెనుకనుండి నేను జాగ్రత్తగా నిన్ను మెట్లెక్కించెదను. నీవు పులకలతో నిండి యున్నావు. తూలి పడెదవేమో? అదికాక భర్త యెల్లప్పుడును దాను ముందుండి భార్యను మెట్లపై దింపవలెను. తాను వెనుకనుండి మెట్లు నెక్కింపవలెను......" ఈ రెండవ యుక్తి రజని మనస్సంగీకరింపలేదు. చివర కిరువురును చెట్టపట్టాలు వేసికొని మెట్లు నెక్కి శయ్యాగృహమున నడుగువెట్టిరి. రాయలు మందహాస మొనర్చినాడు.

"ఈ విషయ మింతవఱకే చెప్పలేకపోయినావా?"

"ఏ విషయము?"

"చెట్టపట్టాలు వేసికొని మెట్లు నెక్కవలయు నన్న నీయభిలాష..."

రజని సిగ్గుపడినది. ఆ సిగ్గుపడుటలో నామె సర్వావయవములును గదలిపోయి యొక మనోహరమూర్తిని బ్రదర్శించినవి. "ఆమె రజనియేనా??...క్షణక్షణమునకును జక్కెర, తేనె, యమృతమువలె మనోహరాతిమనోహరమై పోవుచున్నదే!" అని యనుకొని రాయ లామెను విడిచి పాన్పుపైఁ గూర్చుండెను. రజని యటనుండి కదలి వీణియను జేతఁబట్టి తంత్రులను బిగించినది.

అంతలోఁ బరిచారిక వచ్చి గుమ్మమునొద్ద నిలిచెను.

వీణియపైఁ బాడునప్పుడు సన్నని లేఁతగులాబిరంగు చీరలను ధరించుట రజని కలవాటు. విజయేశ్వరాధీశులు

కుమార్తెకై యీ చీరలను ప్రత్యేకముగా సాలెవాండ్రను నియమించి నేయింపించి శ్రీరామనవమినాఁటికి వాని నాదాదిచేఁ గుమారదేవ మంపెదరు. ఒక్కొక్కటి తొమ్మిది గజముల పొడవుండును. రజనికా చీర లన్నచోఁ జాల నిష్టము. చీర కట్టుటలో నామె కడు సుకుమారి. ఆ పైఁట చెఱఁగును బొడె వుంచి, దానితోఁ గనిపించియుఁ గనిపింపకుండ నవయవముల నన్నిటిని గప్పుకొనుటలో నామె కెంతో సొగసు వచ్చును. అట్లున్న రజనిని జూచినచో రాయలకుఁ గన్నుల పండువ యగును. రాయలు సైఁగఁ జేయఁగానే యామె పరిచారికతో వెడలిపోయెను.

ఆవిశాలమైన పడకగదిలో రాయలొక్కఁడే కూర్చుండి యుండెను. వాని కేమియును దోఁచుటలేదు. మిలమిల మను శరీరకాంతులతో నా తెల్లత్రాఁచు వాని కన్నులకుఁ గట్టినట్లున్నది. తెల్లత్రాఁచును జూచుట తనకదే ప్రథమము. గంధపుఁ దోఁపులలో నొక గొప్పత్రాఁచుఁ దిరుగుచున్నదని పాలేరులు చెప్పుచుండెడివారు. కాని దాని నింతవఱకును సరిగాఁ జూచినవా రెవ్వరును లేరు. ఆ త్రాఁచుమాట మఱచిపోయి రజనియు, రాయలు రాత్రిపూఁట నచ్చట కేఁగినారు. ఆకస్మికముగా నది కంటఁబడినది. ఆ త్రాఁచా గంధపు మ్రాఁకును జుట్టుకొని యట్లేల యుండెనో రాయ లూహింపఁజాలఁ డయ్యెను. కారణ మేమి? నీటిజల పడినస్థలమునుండి యొక తెల్లత్రాఁచు, ఎచ్చటికో వెడలిపోయెనని యాతఁడు వినియుండెను. అదికాదుకదా యిది... ఏమో? చాలఁ బెద్దదిగాఁ గూడ నున్నది!...ఏమైనను గంధపు

ప్రాఁకులను జుట్టుకొని త్రాఁచులు పరుండునుగదా యని యాతఁడు మనస్సును సరిపెట్టుకొనెను. కాని యా త్రాఁచునకుఁ దనకు నేదియో చెప్పలేని సంబంధమున్నట్లాతఁ డెంచినాఁడు. లేనిచో వెడలిపోయిన త్రాఁచు మరలవచ్చి తాము పేర్లుచెక్కిన చోటిని గప్పి పరుండుట యేమి? అసలు తెల్లత్రాఁచు లెవ్వరి కంటఁ బడవు. పడెనా నిముసములో మాయమైపోవును. అట్లుకాదే యిది!...

రాయలు మంచమునుండి దిగి గదిలోనున్న దీపము లన్నింటి నార్పివేసినాఁడు. తూర్పు గవాక్షమునుండి చంద్ర కిరణములు గదిలోఁ బడుచున్నవి. దానినిగూడ నాతఁడు మూసివేసెను. గదియంతటను జిమ్మచీఁకటి యావరించినది. రజనీకుమారి గులాబిరంగు చీరనుధరించి వచ్చి గదిమధ్యను నిలిచెను. రాయలుతటాలునఁ దూర్పుగవాక్షముమీఁదనున్న యొకదీపమును వెలిఁగించినాఁడు. ఆగది యంతయును బాల రాతి గచ్చు చేయఁబడినది. సరిగా గదిమధ్యను రజనిపాదముల క్రింద సహస్రదళకమలము చెక్కఁబడియున్నది. ఆసమయమున నుదయ సంధ్యావేళ కమలజాతయైన లక్ష్మీదేవివోలె రజనీ కుమారి వెలుఁగొందెను. రాయ లాదృశ్యమును గాంచి తన్మ యుఁడైనాఁడు. రజనీకుమారి రత్నకంబళముపై నాసీనయై వల్లకీ తంత్రులను మీఁటినది. తక్కినమూఁడు వైపులనున్న దీపము లనుగూడ వెలిగించి రాయలు కూర్చుండెను. రజనీకుమారి వంటి కోడలువచ్చుననియే కాబోలు రామయ్యగారు పైయంత

స్తును వీణాగానమున కనుకూలముగా నిర్మించి యున్నారు.

తక్కిన జంత్రవాద్యముల విషయము లెట్లున్నను వీణాగాన ముచ్ఛ్రస్థితికి రావలెనన్నఁ దగినప్రదేశము విశాలమైన సౌధపైభాగమే! రజనీకుమారి యంగుళులు వీణెయందు నాట్య మాడసాగినవి. ఆమె కంతకంతకు నుత్సాహ మతిశయించుచున్నది. ఆమె కొడలు తెలియుటలేదు. తక్కిన ప్రపంచ మసలు తెలియుటలేదు. ఆమెకుఁ దెలిసినది రెండే! ఒకటి చేతిలోని వీణ; రెండు, ఎదురుగానున్న మనోనాథుండు. రాయలు పరవశుండై గానమాలకించుచుండెను. బయటిప్రపంచ మంతయుఁగూడ నిశ్శబ్దత వహించినది. ఆమె గాత్రము తిరిగి నన్ని మెలికలు వీణకూడ నందుకొనలేకపోవుచున్నది.

రజనీకుమారి యిదివఱ కెన్నఁడు నంత బాగుగా వీణను వాయించి యుండలేదు. అంత బాగుగాఁ బాడియుండలేదు. నేఁ డేలొకో యామెలో నణఁగియున్న కళాదక్ష్యమంతయు నొక్కసారిగ నుబికి వచ్చినది. రసజ్ఞుఁడగు రాయలహృదయ మాపాటకు ద్రవించిపోయెను. క్రమముగా నావీణాగాంధర్వము సాధారణ మానవానందపథమును దాఁటిపోయి ప్రవహించినది. దానితో నాదంపతు లిరువురును దివ్యత్వమును దాల్చిరి.

రజనీకుమారి పాట పూర్తియైనది. ఆమె వ్రేళులు నాఁగి పోయినవి. కాని వీణయింకను మ్రోగుచునేయున్నది. దానితోఁ బాటు సౌధమింకను శబ్దించుచునే యున్నది. సౌధపరిసరము లన్నియును రాగాలాపనము నింకను ప్రతిధ్వనించుచునే

యున్నవి. రజని వీణియను క్రిందఁబెట్టి లేచినది. రాయలు వచ్చి యామెచేతిని బట్టుకొని తూర్పుగవాక్షమునొద్దకు నడిచెను. గవాక్షముమీఁదనున్న దీపము నార్పివేసి రాయలు గవాక్షమును దెఱచెను. తటాలునఁ జంద్రకిరణములు రజని కన్నులలోనఁబడి రాయల మొగముపైఁ బ్రతిబింబించినవి. వాని మొగమున కొకవింత కాంతి వచ్చెను. అంతలోఁ జంద్రుని జిన్నిమేఘ మొకటి కప్పివేసెను. గవాక్షమున నా కాసేపును మసక వెల్తురు నాట్యము చేసినది. రాయలును రజనియు గవాక్షమునుండి యుద్యానవనములోనికిఁ జూచిరి.

ఉద్యానవన మంతయును బ్రశాంతముగా నున్నది. కాంచివోలె నుద్యానవన మొక్కటియే వెన్నెలనంతటిని గాయించుకొనుచున్నట్లున్నది. మందముగా గోదావరినీటి యలలధ్వని యొకించుక వినఁబడుచుండెను. గాలి విసురులు తెరలు తెరలుగా వచ్చి రాలిపోయిన యెండుటాకులను గలగల మనిపించి జీబురుగానున్న పొదలలో దూరుచున్నవి. గవాక్షమునుండి యనతిదూరములోఁ గన్పడుచున్న మందారములు నాగస్వరమునకుఁ దలయూచు నాగినులవోలె భృంగముల ఝంకారములకుఁ గదలాడుచున్నవి. కృత్తికసరస్సులోని నల్లగలువలు పూర్తిగా వికసించి చంద్రునకు నివాళింపులిడుచున్నవి. ఒకగాలిపాటునకు దక్షిణపు గవాక్షమునుండి వచ్చి పువ్వువెలగ సౌరభము వారి నుక్కిరిబిక్కిరి చేసినది. ఆ గాలి పాటునకు రజని పయ్యెద దిగఁజారెను. పయ్యెద సర్దుకొను

రజని చేతికంకణములు గలగల లాడినవి. మామిడితోఁపులో నుండి క్రొత్తగా జతికట్టిన కోయిల జహాంగీరు చివుళ్ళవిందు నారగించి యానందపారవశ్యమునఁ బంచమరాగమును విసిరెను. మేడక్రిందుగా నింకను బచ్చికఁ గొఱుకుచున్న పెంపుడు లేడి యాకూఁతకు నదిరిపడినది. అప్రయత్నముగా రజనీకుమారి యాకూఁత చివరనందుకొన్నది. కోయిలమఱి పాడలేదు. రాయలన్నాఁడు—

"రజనీ! నీవు సంగీతకళాధిదేవతవు. శృంగార రసాకృతివి..." అని.

రజనియన్నది—

'నాథా! మీరలు మహాకవులు. నేనెంతదానను?...'

నాల్గు పెదవులును గలిసికొన్నవి. చంద్రుఁడు గవాక్షమును దాఁటిపోయినాఁడు.

## 7

రజనీకుమారి కాఁపురమునకు వచ్చిన నాల్గుసంవత్సరములకుఁ గొడుకు పుట్టెను. రామయ్యగారమందానందమందిరి. ఈశ్వరమ్మగారు మనుమని యెత్తుకొని మురిసిపోయిరి. చంద్రయుత్సాహమునకు మేరయే లేదు. మేనల్లుని జూచి వెళ్ళుమని రామయ్యగారు భవానికిఁ గబురంపినారు. కాని భారతీసంరక్షణమున నిమగ్నయైన భవానిపుట్టింటికిఁబోవుట కంగీకరింపలేదు. రామయ్యగారి కుటుంబమునకు భవాని పరి

స్థితు లింతవఱకును దెలియదు. ఆమె యక్కడ సుఖముగా నున్నదనియే వారు తలంచుచుండిరి. భవానియును దన పరాజయమును బుట్టింటివారికిఁ దెలియనిచ్చినదికాదు. అట్టి పరిస్థితులలో నిప్పు డచ్చటికిఁ బోవుటకు భవానికి మనస్కరింపలేదు. ఈ విషయము తెలియని రామయ్యగారు పిలుపు తక్కువైనదేమో యని యనుమానపడిరి. అందుచే రామయ్యగారొకసారి భవానిని దీసికొనివచ్చుటకుఁ గేశవుని బంపిరి. చెల్లెలిని దీసికొని వెళ్లుట కాతఁడు రామగిరికి వచ్చెను.

చెల్లెలిని బంపుఁడని యడుగుటకుఁ గేశవునకు బావగారి దర్శనమే యైనదికాదు. అంతియకాక భవానియును దాను రానని స్పష్టముగఁ జెప్పినది. కేశవుఁడు కారణ మడిగెను. కారణ మేమియును లేదన్నది భవాని. భారతి కేశవునియొద్దకుఁ జనవుగా వచ్చినది. అప్పటి కామెకు నాల్గు సంవత్సరముల వయస్సు. వచ్చీరాని జిలిబిలి పలుకుల కాలము దాఁటిపోయినది. భారతి యిప్పుడు చాల స్పష్టముగా మాట్లాడఁగలదు. భవాని యామెకుఁ జదువు నేర్పుచున్నదికూడను. కాని, భారతి కొంటెతనముగా 'అమ్మా! ఇది యెవ్వరే?' అని కేశవుని జూపి భవానిని బ్రశ్నించినది. కేశవునకు నవ్వు వచ్చెను. "మామయ్య" అని భవాని చెప్పినది. "మా మ య్య" అని కూడఁబలుకుకొని భారతి పకపక నవ్వెను. ఆమాటను బుస్తకములోఁ జదువుట, భవాని చెప్పఁగా వినుటయేకాని యింతవఱకును బంధువులనుగాను, తండ్రినైనను జూచియుండని

భారతికట్టి బంధుత్వమునకు లమూనిసి కనబడుట క్రొత్తగా నున్నది.

"చిన్నా! చంద్ర యేమిచేయుచున్నది?" అని భవాని కేశవు నడిగెను.

"చంద్రకుం దీనుబడి తే దమ్మా! కన్నయ్యను లాలించుటలోఁ దనే యూ కరుం గ్రొంగుపోవుచున్నది." అప్పకుమారు నకుం జంద్ర పెట్టుకొన్న ముద్దుపేరు కన్నయ్య.

"భవానీ! మన యూరి గోపురాజోత్సవములును, బార సాలయును గడిసివచ్చినవి. నీవు తప్పక వచ్చెదవని యంద ఱాశతో నున్నారు. నీవు రానిచో నన్ను బెంగపెట్టుకొనును."

"చిన్నా! నన్ను మన్నింపఁ గోరుచున్నానని అమ్మతోఁ జెప్పుము. నేను రాఁజాలను. ఇప్పటిపరిస్థితులు బాగుండ లేదు.——" భవానికంఠము రుద్ధమయ్యెను.

కేశవుఁ డింక నలవంతపెట్టలేదు. భవానిహృదయములో నేదో బాధ గుమిసియున్నదని యాతఁడు గ్రహించినాఁడు. ఆమె చిఱునవ్వు నవ్వినను విషాద రేఖలు వెనుక మసకలాడు చునేయున్నవి." ఈమె మా భవానియేయగునా? చిన్నప్పటి చలాకీయంతయు నీమెలో నంతరించిపోయినదే!" అని కేశవుఁడు లోలోన బాధపడినాఁడు. కొండంత దుఃఖము వచ్చినను గూడ దిగమ్రింగివేయుఁగల గంభీరహృదయ భవాని. కాని రామగిరికి వచ్చునాఁటివఱకును భవాని దుఃఖ మన నేమో యెఱుఁగదు. అందుచే నిప్పటి పరిస్థితు లామెలో మార్పు కలిగించినవి. ఆ మార్పును గుర్తించిన కేశవుఁడు పరిస్థితులను దెలిసికొన నెంత

ప్రయత్నించినను భవాని వెలితిపడినది కాదు. నౌకరుల నడిగినచో వారేమైనఁ జెప్పియుందురు కాని యింటిగుట్టును బనివాండ్ర నడుమంట తేలికపని యని యాతఁడు సంచరించి యుండలేదు. ఆ మఱునాఁడే కుమారదేవమున గోపురాజోత్సవములు ప్రారంభమగును గాన కేశవుఁ డా రాత్రియే ప్రయాణమయ్యెను. భారతి మామయ్యకు వీడ్కోలొసంగినది.

పదునొకండవరోజున జరుగవలసిన బారసాల భవాని రాకపోవుటచే నాఁగిపోయెను అందుచే నైదవనెలలో ముహూర్తము నిర్ణయింపఁబడినది. నాఁటికైనను భవానిని దీసికొని రావలెనని కేశవుఁడు స్వయముగా వచ్చినను నిరాశయే యైనది. అన్నకుమారుని బారసాలను దాను చూడఁబోఁజాలనందులకు భవాని చాల విచారించెను. తాను రాకపోవుటచే నన్నకుఁ గోపము వచ్చునేమో? ... రాయల హృదయమును భవాని బాగుగా నెఱుంగును. ఎట్టిపరిస్థితులలోను, దనపై నన్నకుఁ గోపము రాదని యామె నమ్మెను. అందుచే నామెకుఁ గొంత యుపశమనము కల్గెను.

భవాని తనపెండ్లినాఁడన్నకు నమస్కరించినది. "సరస్వతి యపరావతారమవై వర్ధిల్లు" మని రాయలు చెల్లెలిని దీవించెను. అన్న వాత్సల్యమునకు నిష్కాపట్య భావమునకు భవాని వెఱఁగొందెను. అప్పుడామె తలయూపి యూరకున్నదే కాని సంతోషమున నేమియును మాటలాడలేకపోయెను. తరువాతఁ దాను రామగిరికి వచ్చినప్పుడు రాయ లింటికడ లేఁడు. సార

స్నాత సభలయందు దుపన్యసింపనేగెను. ఐదాఱురోజులవఱకును
దిరిగిరానని చెప్పి వెళ్ళినాఁడు. అందుచే నప్పుడుకూడ నన్నతో
మాట్లాడు నవకాశము తనకు లభింపలేదు. తానిప్పుడు కుమార
దేవము వెళ్ళినచో నన్నయును, నమ్మయును మిక్కిలిగా
సంతసింతురు. నిజముగ వెళ్ళినచో నిక్కడి పరిస్థితులు విష
మించు నేమో?...

ఇప్పటికే భర్త తన్నుగాని, భారతినిగాని చూచుట
లేదు. తాను వెళ్ళవత్తునని చెప్పుటకైనను దర్శన మిచ్చునను
నాశ లేదు. చెప్పకుండ వెళ్ళుట ధర్మముకాదు. ఒకవేళ నతిక్ర
మించి వెళ్ళినచోఁ దప్పక నాగ్రహించును. ఆ యాగ్రహమున
కసలు తట్టుకొనుటయే కష్టమగునేమో!...తా నీసారియైనను
దప్పక వత్తునని చంద్రయు, రజనియు నెంతో యుత్సాహ
ముతో నుందురు. అందఱకు దా నాశాభంగము కల్గించిన
దైనది. ఈ విషయము లన్నియు దలంచుకొన్నకొలఁది
నామెకు బాధ యెక్కువయ్యెను.

ఆమె దీర్ఘముగ నాలోచించినది. తన పరిస్థితులను
బట్టి తానిప్పుడు రామగిరిని విడిచిపోవుట భావ్యముకాదు.
తన సంతోషముకంటెను ముందుగాఁ దాను భారతి బాగోగు
లను జూడవలయును. భారతి తల్లిలేని పిల్ల; మఱియుఁ దండ్రిచేఁ
దిరస్కృత. అట్టి బాలికను దనవెంటఁ బెట్టుకొని త్రిప్పు
చున్నచో నేమేని విషమ పరిస్థితు లేర్పడవచ్చును. ఎవ
రేమాట యాడుకొన్నను భారతి లేఁతమనస్సు కలఁతనొంది

పోవును. ఆమెకుఁ బూర్తిగా నూహవచ్చువఱకును బరిస్థితు
లెవ్వియు నామెకుఁ దెలియనీరాదు. తనకుఁ జెప్పినట్లు పరి
చారిక లెవ్వరేని యింటిపరిస్థితులను భారతికిఁ జెప్పివేయుదు
రేమో యను భయముతో నామె యెల్లప్పుడును భారతిని
విడిచియుండెడిది కాదు. ఇట్టి జాగృతితోనున్న తా నిప్పుడు
ప్రయాణ మగుట మంచిదికాదు. చివరి కామె పుట్టింటికిఁ
బోరాదనియే కృతనిశ్చయురా లయ్యెను.

"అమ్మా! మామయ్యతో వెడితేయేం?" అని భారతి
ప్రశ్నించెను. "నీకుఁ దెలియదమ్మా! మన మింకొకసారి వెళ్లు
దములే" అని భవాని సమాధాన మిచ్చెను. "మీనాయన
గారి యనుజ్ఞ కావలయు" నని భవాని నాలుక చివరికి వచ్చి
నది గాని నాయనగారి యనుజ్ఞ నేను దీసికొనివచ్చెద నని
భారతి బయలుదేరునేమో యన్న భయముకల్గి యామె
మాటను మార్చివేసెను. భవాని సమాధానము భారతి
కర్థము కాలేదు. ఇప్పుడు మామయ్యతో నెందులకుఁ
బోరాదో యామె యూహింపలేకపోయినది.

"ఏమి? మామయ్య మంచివాఁడు కాదా, అమ్మా!"
అని భారతి యమాయికముగా నడిగెను. భవానికి నవ్వు
వచ్చినది. ఎందులకో భారతియు నవ్వినది.

భారతియొక్క యీ జిలిబిలిపలుకులే హృదయో
ద్వేగముతో నున్న భవాని హృదయమును దేలికపఱచు

చుండును. భవాని కింకొక యుబుసుపోక రాట్నము. ఏవేని తలం పులతో హృదయోద్వేగ మెక్కువైనప్పు డామె నిశ్చలముగఁ గూర్చుండి రాట్నము వడకుచుండును. కుమారదేవమునుండి తెచ్చుకొనిన యేకులే యింతవఱకును సరిపోయినవి. వాని కొఱకై భర్తకుఁ గబురంపుట కామె కిష్టము లేకపోయినది. కాని భారతిని బెంచిన ముసలిదాది మాత్ర మతి ప్రయత్నము మీఁద నెట్లో కొన్ని యేకులను సంపాదింపఁగల్గినది. అవి యంత మంచివి కాకపోవుటచే భవానికి రాట్నము వడకుట క్రమముగాఁ దగ్గిపోయెను. ఆ తీరుబడి యిప్పుడు భవానికిఁ జదువు చెప్పుట కుపయోగపడినది. తక్కినకాలము నామె గ్రంథపఠనమునకై వినియోగించును.

భవాని రాలేదని యీశ్వరమ్మగారు చాల ఖేదపడెను. "ఒకఅయ్య చేతులలోఁ బెట్టినతరువాత మనయిష్ట మేమున్న" దని రామయ్యగారు మనస్సును సరిపెట్టుకొనినారు. ఉషఃకాల మున రాయలు మేడమీఁదినుండి, భవానిలేకుండ కేశవుఁ డొక్కఁడే వచ్చుచుంటను జూచినాఁడు. భవాని రాకుండుట రాయల కాశ్చర్యమును గొల్పెను. ఈ రెండవసారికూడ రాకపోవుటకుఁ గారణము నాతఁ డూహింపలేకపోయెను. సాయంకాలమున కేమైన వచ్చునేమో యని యనుకొనెను గాని, మేఁడమీఁదికి వచ్చిన పరిచారకునివలనఁ దన చెల్లె లసలు వచ్చుటయేలేదని తెలిసికొనినాఁడు. అతఁడు గదిలో నట్లనే కూర్చుండిపోయెను. అభ్యంగన మొనర్చుటచే జుట్టు

గాలికి నారవిప్పుకొని కొంతసేపటికి రజనీకుమారి మేడమీఁదికి వచ్చినది. రాయలనుజూచి యామె చకిత యయ్యెను.

"రజనీ! భవాని యేలరాలేదు?" రజని సర్వము నెఱిఁగించెను. భవాని రాకపోవుటకుఁ గారణ మాపె పరిస్థితు లని తెలిసికొని రాయలు విషాద మొందినాఁడు.

"పాపము! మనస్సులో భవాని యేదో బాధపడుచున్నట్టున్నదని కేశవమూర్తి చెప్పినాఁడు..." అని రజని సాలోచనముగా ననెను.

"అవును. అల్లారుముద్దుగాఁ బెరిగిన భవాని...బాధితురాలు కానిచో నిట కిప్పుడు రాకుండనుండదు..." రాయల కంఠము గద్గదికఁ జెందెను. ఆతఁ డిఁక మాటాడలేకపోయెను.

నాఁటికి మూఁడవరోజున బారసాల మహావైభవముగా జరుగనున్నది. నాఁటిరాత్రికే విజయేశ్వరాధీశులును, జంద్ర పుట్టింటివారును వత్తురు. ముఖ్యముగా విశ్వనాథుఁడు బాలుని దీవించుటకై వచ్చును. ప్రయత్నములు బ్రహ్మాండముగాఁ జరిగినవి. భవాని రాలేదన్నది యొక్కటే లోటు. రాయ లేమో చెప్పఁబోయి మానినట్లు వాని పెదవులు కదలినవి. ప్రసంగమును మార్చివేయుట మంచిదని రజని యూహించెను.

"ఇప్పుడుకానిచో నింకొకసారి భవాని తప్పకవచ్చును. మీరిట్లు కూర్చున్నచో నెట్లు?...లెండు..." అని రజని రాయల చేతులను బట్టుకొనెను. రాయలు రజని కన్నుల లోనికిఁ జూచినాఁడు. ఆపె కనులు వింతకాంతితో మెఱయు

చున్నవి. ఐదవ నెల వచ్చుటచే ప్రసవముయొక్క బలహీనత కన్పించుటలేదు. ఆమె కిప్పుడు మాతృస్థానము వచ్చినది. ముఖములో శాంతియే కాని చిన్ననాఁటి చిలిపితనము మచ్చునకైన గోచరించుటలేదు. రాయ లాపె దృక్ప్రసారములచే నాకర్షింపఁబడి, పనులు చూచుకొనుటకై యావలికి వెళ్ళెను. రాయలు గదివీడఁగానే చంద్ర లోపలకు వచ్చెను. భవాని పటమువంకనే చూచుచున్న రజని చంద్రను జూడనేలేదు.

“ వదినా? ఇంత విదుషీమణివి నీవు. నీకుఁగూడ బాధలు తప్పలేదా ?...అవును. నీ తెలివి బూడిదలోఁ బోసిన పన్నీరు వలెనయ్యెను. ఎదుటి ప్రపంచము మూర్ఖమైనప్పుడు నీవేమి చేయఁ గలవు ? ” అని రజని యనుకొనెను. భవాని రాలేదని చంద్ర లోలోననే బాధ పడుచున్నది. పెళ్లిచూపులనాఁటి నుండియు వారిరువురకును స్నేహమయ్యెను. భర్తృ ననుసరింపవలసియున్న భవానిని దాను బలవంతముగా నాల్గు రోజులాఁపినది. భవానినుండి చంద్ర యెన్నియో క్రొత్త సంగతుల నా నాల్గురోజులలోఁ దెలిసికొన్నది. చంద్ర యందులకుఁ గృతజ్ఞురాలు. మరల భవానితో నెన్నియో సంప్రదింపవలెనని యామె వేచియున్నది. ఎన్నటికో...

“ అక్కా! నీవుకూడ బేలవయ్యెదవేమి ? ” అని చంద్ర రజని వెనుకకేఁగి గాలికి నారవిప్పుకొనిన యామె జుట్టులోనికి వ్రేళులు జొన్పి చిక్కుతీయసాఁగెను. తనకు లేని ధైర్యమును జంద్ర రజనికి బోధించెను. రజని యూఁకొట్టినది. ఇంతలో

బిల్లవాఁ డేడ్చుచుండెనని యీశ్వరయ్యగారు కేకవేయుటచే నిరువురు నటువెళ్ళిరి.

బారసాల కడుంగడు వైభవముతో జరిగినది. విజయేశ్వరాధీశులు మనుమనికిఁ బచ్చల హారమును జేయించి యిచ్చిరి. రామయ్యగారు తనకుఁ బ్రియమైన తన కంఠ హారమును బిల్లవాని మెడలో వేసినారు. చంద్రశేఖరశాస్త్రిగారు బంగారు మొలనూలు చిత్రఫణితిలో మణులుపొదిగించి, పిల్లవానికిఁ గానుకగా నిచ్చినారు. రాయలు కుమారునకు విజయుఁడను నామము వ్రాసెను. (చేమకూరవారి విజయవిలాస మందలి ప్రీతియే కుమారుని కా పేరు పెట్టుటకు రాయలను బ్రోత్సహించినది.) తరువాత భూసురాశీర్వాదముతోఁ జెవులు మార్మ్రోగినవి. కాని విజయుని జాతకమును బరిశీలించినంతనే విశ్వనాథుని మనస్సేలాగో చివుక్కురు మన్నది. దీని నెవ్వరును గమనింపలేదు. అయినను బాలారిష్టములు తొలఁగి బాలుఁడు దీర్ఘాయుష్మంతుఁడగు సూచనలుండుటచే నందులకువలయు హోమాదికముల నాదినముననే విశ్వనాథుఁడు రాయలచేఁ జేయించెను. తక్కుంగల జ్యోతిష్కులును బాలుఁడు చాలఁ గీర్తివంతుఁడగు ననిరి. అందరికి భూరి సంభావన లొసంగఁబడెను. బీదల కన్నవస్త్రదానములు జరిగినవి. సర్వము సలక్షణముగా నడిచెను. దీనికంతకును బెత్తనము కేశవునిది. కేశవుఁడు మంచి కార్యనిర్వాహకుఁడు. లోటనునది కన్పింపకుండ నెంత ఘనకార్యమునైనను ఒక్కఁడే జయప్రదముగా నిర్వహింపఁగలఁడు. బార

సాల జరిగిన యింకొక రెండు రోజులకుఁ గుమారదేవము నందలి గోపూజోత్సవములు ముగియుచున్నవి. అంతవఱకునుండుఁడని రామయ్యగారు బంధువులను గోరుటచే వారందఱా రెండురోజు లచ్చటనే యుండిపోయిరి.

కుమారదేవమునఁ బ్రతి సంవత్సరమును గోపూజోత్సవములు గొప్ప తిరనాళ్ళవలె జరుగుచుండును. ఆయుత్సవములను దిలకించుటకై యూరూరనుండియుఁ బ్రజలు ప్రవాహములై వచ్చి వత్తురు. శిశిరఋతువునందు రైతుజనమునకుఁ బంటల సందడి తగ్గి తీరికయైనంతనే యీ యుత్సవములు ప్రారంభమయి మొదటిరోజులు చాల సందడిగా నుండును. ప్రారంభదినమందుదయమే ప్రతిష్ఠితమును ఘన శ్రేష్ఠమైన యావుల నాలయమండపముకడకుఁ గొనివచ్చును. అటఁ గేశవుఁడు చంద్రద్వితీయుఁడై తన పడమఁటావును యథాశాస్త్రముగాఁ దొలుతఁ బూజించును. రైతులందఱు వాని ననుసరింతురు. తరువాత గోవులతో నూరేఁగెదరు. మొదటిరోజు మధ్యాహ్నము పండితులచే గోవర్ధనోద్ధరణము కథగాఁ జెప్పఁబడును. రాత్రివేళ నదే నాటకమాడఁబడును. ఆకాలమున సంజీవపురము మొఖాసాలోని భాగవతులు ప్రదర్శనములందు గొప్ప పేరు వహించియున్నారు. గోవర్ధనోద్ధరణము మొదలైన కృష్ణలీలలను బ్రదర్శించుటలో వారికిఁ బెట్టినది పేరు.

వారిలో రంగన్న యను బాలుఁడుకలఁడు. ఆతఁడు కృష్ణవేషము వేయును. ఏపూర్వపుణ్యముననో వానికా చిన్న

వయస్సునందే వేణుగాన మమృతముగాఁ బట్టుపడినది. వేణువు నూదుచుఁ గృష్ణవేషధారియై యాతఁడు రంగమునఁ బ్రవేశించి నంతనే నలుమూలలనుండియు గోవులు వచ్చి వాని ప్రోల నిలఁబడెడివి. ప్రకృతిసైతము నిశ్శబ్దత వహించి యీ గానము నాలకించుచున్నట్లు తోఁచును. కేశవుని పడమటూరు నానుకొని రంగన్న వేణువునుండి మధురగానామృతమును వర్షింపఁ జేసి పారిషదులను దన్మయత్వము చెందించెడివాఁడు. నాటకాంతమువఱకును జనులు కనుఱెప్ప వేయక చూచుచుందురు. ఇప్పటి కారు సంవత్సరములనుండి రంగన్న యీ యుత్సవములందుఁ బాల్గొనుచుండెను. ఒక యేఁటి కంటె నింకొక యేఁటికి రంగన్న వేణువులో మాధుర్యము చిక్కఁబడుచు వచ్చెను. ఈ భాగవతు లందఱికిని బ్రతి సంవత్సరమును మామూళ్ళున్నవి.

మఱునాఁడు గృహపరిశ్రమలు ప్రదర్శింపఁబడును. ప్రతిసంవత్సరమును గృహపరిశ్రమలందుఁ గ్రొంగ్రొత్తపద్ధతులను గనిపెట్టుచు వానియందు దక్షినిపుణులైనవా రాపరిశ్రమలనుగూర్చి ప్రజలకు బోధింతురు. ఈ యుత్సవములు ప్రారంభమైన నాఁటి నుండియును కుమారదేవము గృహపరిశ్రమలకుఁ గేంద్రస్థానమై యొప్పుచున్నది. ఆ పరిశ్రమలలో నూలుతీయుట ప్రధానమైనది. విదేశములనుండి రకరకముల దుస్తులు వచ్చుచున్నను కుమారదేవవాసులు నాఁటివఱకును దమ జాతీయతను విడనాడలేదు. ఇంచుమించుగాఁ గుమారదేవమునఁ బ్రతి

నిత్యమును రాట్నములు తిరుగని నేతకుటుంబమే యుండదు. మూఁడవరోజునఁ బేదల కన్న వస్త్రదానములు జరుగును. ఆ వ్యయమంతయు రామయ్యగారొక్కరే భరింతురు. నాఁటి సాయంకాలము గోమాహాత్మ్యమును గూర్చియు, నావుపాల శ్రేష్ఠతనుగూర్చియుఁ బండితులు, శాస్త్రజ్ఞులు ప్రజాసామాన్యమునకు వివరించి చెప్పెదరు. నాల్గవరోజుదయమున లలితకళలందుఁ బోటీలు జరుగును. ఆ కళలలో ముఖ్యమైనవి శిల్పము, చిత్రలేఖనము. వీనిని బరీక్షింపఁ జాలమంది పెద్దలు రావింపఁబడుదురు. పోటీలలో నెగ్గినవారికి బహుమతు లిత్తురు. ఆయేఁడు చిత్రలేఖనములోఁ బ్రథమ బహుమానము భవాని శాల్యస్నేహితురాలగు సోకామునకు వచ్చినది. ఆనాఁటి సాయంకాలమున గానసభలు జరుగును. ఆ గానసభలను దిలకించుటకుఁ గ్రిందటియేఁట మాత్రమే విశ్వనాథుఁడు వచ్చినాఁడు. అప్పుడాసభలలో రజనీకుమారియును బాల్గొన్నది. ఐదవరోజు రాత్రితో నుత్సవములు పూర్తియగును.

ఆ నైదవరోజు సాయంకాలమున నిజముగా కుమారదేవము గోవర్ధనోద్ధరణోత్సవమునాఁటి బృందావనమును మించియుండును. స్త్రీపురుషు లాబాలగోపాలము నుత్సవమునఁ బాల్గొందురు. రంగన్న మరల గోపాలకృష్ణుని వేషము ధరించును. కుమారదేవపు దేవదాసీకన్యలు గోపిక లయ్యెదరు. సంజీవపురపు భాగవతులు గోపాలకవేషములు వేసెదరు. నిష్కళంకమై, కృష్ణస్వరూప ధ్యానముతో వారిహృదయ

ములు తొణికిసలాడుచుండును. సాయంతన మగుసరికి నుత్స వము కూడును. కృష్ణలీలలను గొంతవఱకు నటింతురు.

దేవదాసీజనములోఁ బుష్పలత యను నామె రాధికా వేషమును ధరించును. పుష్పలత తన జీవితమును గృష్ణదేవుని కంకితము చేసికొన్నది. ఆమె సార్థకాఖ్యయగు దేవదాసి; ఆజన్మబ్రహ్మచారిణి. నెమిలిపింఛ మల్లలనాడుచుండ, వేణువు ధగద్ధగ కాంతులఁ నీనుచుండ, రంగన్న గోపాలకృష్ణుఁడై యామెను దహాతిహ లాడఁజేయును. సంతత కృష్ణ ధ్యాననిరత యగుటచే నిజముగఁ గృష్ణుఁడే యన్న పారవశ్యమునఁ బుష్ప లత రాధికాకృతిని జెందును.

"కృష్ణా!......కృష్ణా! కృష్ణా!......ఎక్కడనోయి!" అనుచు నామె కృష్ణునికై వెదకుసప్పుడందఱును దమ ముందు వెనుకలు చూచుకొని కృష్ణుఁడు తమయొద్ద లేఁ డనుకొందురు. కృష్ణుఁడు కానరాక, ఆమె వెదకివెదకి యలసి సోలిపోయి నప్పుడు పారిషదులప్రాణము లెగసిపోవును. నిశ్చేష్టులై వారు జడాకృతిని జెందెదరు. ఇంతలో దూరాన వేణునాదము వినిపించును. ఆ నాదము దగ్గఱగుచున్నకొలఁది రాధిక బ్రత్యణు వును నవజీవనమును బొందును. దరిఁజేరి కృష్ణుఁడు "రాధా...!" యని నోరారఁ బిలుచును.

"దొంగా! ఎటుఁదాఁగితివోయి!...నిన్ను వెదకి వెదకి యెట్లలసిపోతినోచూడు..." అనుచు నామె వానిని బట్టుకొని తనివితీఱ నలిపివైచును. చూపఱ మేనఁ బుల్కలుదయించును.

"కృష్ణా! నీదారిని నీవు పోయెదవు. లోకాపవాదము లతోఁబాటు నివియోగమునుగూడ నేనెటులోయి భరించుట" యని రాధిక యడుగును.

"రాధా! సర్వలోకములు నేనే! నే నపవాదు వేసినచో నీవు వ్యథఁ జెందెదవా? నీవు నేనొకటి కామా?" అని కృష్ణుఁడు సమాధాన మొసంగును. రాధమనస్సు కుదుటపడును.

"అవునుకృష్ణా! లోకముతో నాకేమిపని? నీవొక్కఁడవు మాత్రము నాయొద్దనున్నచో నాకుఁజాలును."

"తప్పక నీతోడనే యుందును రాధా! నీవు కాక నాకింకెవ్వరున్నారు?—" ఆ వెక్కిరింపును రాధ నిజమే యనుకొని కృష్ణుని రెండుబుగ్గల నొకేసారి ముద్దాడఁ బ్రయత్నించును.

"తరువాత ముద్దుపెట్టుకొందువుగానిలే. ముందు నే నడిగినదానికి సమాధానము చెప్పుము." అని రాధ చేతులలో నుండి కృష్ణుఁడు తన మొగమును తప్పించుకొనును.

"ఏమిటది కృష్ణా!..."

"రాధా! తెలియక అడుగుచున్నాను. నిజమునకు నీవు అంకుటాలివి కావా?"—రాధ కన్నులలో నీరు నిలుచును. అవి యానందబాష్పములో? లేక తనదైవముకూడఁ దన్నను మానించుచుండె నను విచారబాష్పములో!...

"అదేమిరాధా! ఏడ్చుచుంటివా?...నా హృదయము కొట్టుకొనుచున్నది చూడు...ఏడువకు రాధా! నేనట్లడిగితినని కోపమా?...లేకపోయినచో నెందుల కేడ్చుట?......"—

కృష్ణుఁడు రాధకన్నులను దుడుచును. తనస్వామియడిగినప్రశ్నకుఁ దా నేమి ప్రత్యుత్తర మీవలెనో యని రాధ యాలోచించు చుండును ప్రభుని మాతురత యామె కాలోచన సాఁగనీదు.

"కృష్ణా! నిజముగా నేను అంకుటాలినేయని నీకుఁ దోఁచి నదా?..." కంఠమురుద్ధమై రాధికి యిఁక మాటాడ లేకపోవును. తనస్వామియే తన్నంతమాట యన్నందుల కామె హృదయము వేఁగిపోవుచుగాఁబోలు.

"ఏడువకురాధా! నిన్ను నే ననుమానింపలేదు. లోక మన్నంత మాత్రాన నీ వైపోదువా యని పరిహాసమునకు నే నట్లడిగితిని. నామాట నమ్ముము."

"నిజముగానా కృష్ణా!"—"అవును రాధా!"

ఆనందమున రాధ నృత్యముచేయును, కృష్ణుఁడు వేణువున గీతమును మేళవింపఁజేయును.

రాధ— "నేను ప్రేయసినే? నీవు నిత్య వశ్య
రాధికాప్రేమరాజ్య సమ్రాట్టువైన
యదుకిశోరుఁడవే? రసాస్వదవినూత్న
ము రళియే విశ్వజీవవిభూతి కృష్ణ!"

రంగముమాఱును. కృష్ణుఁడు పిల్లవానిపగిదిఁగాన్పించును.

"కృష్ణా! బొజ్జ యేడ్చుచున్నట్లున్నది. పెరుగు మీఁగడ లను దినఁబెట్టెదను రమ్ము" అని రాధిక పిలుచును. కృష్ణుఁడు రానను. మారాముచేయును.

"నాపై నీ కేలోయి కోపము?" అని రాధిక యడుగును.

"నిజముగానే నాకు కోపమువచ్చినది రాధా!"

"ఎందులకు నాస్వామీ! ఈ దీనురాలిపై నంత దయ యేల?"

"ఇంత సేపటినుండి చూచుచున్నాను. నన్నొక్కసారి యైన నిన్ను ముద్దుపెట్టుకొన నిచ్చితివా?"

రాధతోఁబాటు పారిషదులుకూడ వాని కోర్కకు ఫక్కున నవ్వేదరు. రాధ యనుమతించును. కృష్ణుఁడు ముద్దు పెట్టుకొనఁబోయి చెక్కిలిపై దంతక్షతములు కావించును.

"కృష్ణా! ఇంత శరీరములోను, ఈ కపోలమే యెంత పుణ్యము చేసికొన్నదోయి. నీ పంటి క్రిందఁబడి యిది యెంత పవిత్రమైనదో చూడు" అని రాధిక వ్యంగ్యముగాఁ బల్కును. కృష్ణుఁడాపె చెక్కిలిని దడవిచూచి "రాధా! నీకు నొప్పి కలిగించితినా? క్షమింపుము." అని చేతులు జోడించును.

"కృష్ణా! విశ్వనాథుఁడవగు నిన్ను నేనఁటోయి క్షమించునది? నాచిన్ని కృష్ణయ్యా! ఇటురమ్ము." అని కృష్ణుని బట్టుకొని రాధ ముద్దాడును. కృష్ణుఁడాపె హృదయమునకు హత్తుకొని పోవును.

"నీమూతి వెన్నవాసన వేయుచున్నదేమి రాధా!"

"నీమూతియే వెన్నవాసన వేయుచున్నది కృష్ణా!

ఎటునేని దొంగతనముగాఁ దిని మూతి కడుగుకొనుట మఱచితి వేమో ?"

"నిజమే రాధా ! ఈవేళ దొంగతనముచేయుట మఱచి పోతిని. అందుచేతనే కాఁబోలు నా కేలాగో యున్నది. "

"దొంగతన మొకపూఁట లేనంత మాత్రమున నంత బాధ యెందులకు కృష్ణా ! కావలసినచో నేను గడుపారఁ బెట్టనా ?..."

"ఒకరు పెట్టినది నా కేమిత్తృప్తి రాధా ! అందుచేతనే వెన్నవానన వేయుచున్న నీబుగ్గను దొంగతనముగాఁ గొఱికి వేసితిని. "

"ధన్యురాలను స్వామీ! నాయందుఁ బ్రేమకలవాఁడవు కావుననే నీకిష్టమైన దానిని నాలోఁజూచుచున్నావు. ధన్యోస్మి కృష్ణప్రభూ ! "

"రాధా! నేన్ననచో నీకింత ప్రేమయేల?" అని కృష్ణుఁడు కొంటెగా నడుగును.

'నేనన్నచో నింతప్రేమ నీకేల ?' అని యామె మరలఁ బ్రశ్నించును.

"నీవన్నచో నాకుఁ బ్రేమయేలేదే !" అని కృష్ణుఁడు చమత్కరించును.

"నిజముగానే లేదా ? అయినచో నిటనుండి వెడలి పొమ్ము." అని రాధ వానిని దూరముగఁ ద్రోసివేసి కోపమును నటించును.

"అమ్మా !...నిన్ను విడిచిపోవుటయేనా ?" అనుచుఁ గృష్ణుఁ డాత్రముతో నామెయొద్దకు వచ్చును.

"నీవు పోయెద వన్నను నేను మాత్రము నిన్ను విడిచి పెట్టెదనా కృష్ణా ! నీవు నేను విడిపోవు టెట్లుసంభవించును ? మనము విడిపోయినచోఁ బ్రేమరాజ్యాన రక్తపు టేఱులు ప్రవహింపవా ?"

కృష్ణుఁడు రాధకౌఁగిలిలోనికి వచ్చును. రాధ కృష్ణస్వామిపై ముద్దుల వర్షమును గురియించును. సభ్యు లా పవిత్రమూర్తులఁ జూచుచు మురిసిపోదురు.

రాధ—

'కోటి మరనులఁ గడవ్రేలిగోటఁ గెలుచు
సుందరాకృతితోడ నానంద మిచ్చు
దివ్యచందన గోపాలదేవుఁ జూచి
వసుధలోపలఁ వలవనివారు కలరె ?'

గృహమును, భర్తను, బంధువులను—తన సర్వస్వమును బరిత్యజించి కృష్ణదేవుని పాదదాసియైన యా రాధికామతల్లి ప్రేమ పవిత్రతను మన మూహింపఁజాలము. వారిని జూచుచుఁ దన్మయులై రససముద్రమున నోలలాడు నా కుమారదేవ వానులే దాని నెఱుంగఁగలరు.

రాధారమణి ప్రేమవాహిని. కృష్ణుఁడు పున్నమచందురుఁడు. కృష్ణుని జూచి రాధ యుప్పొంగును. రాధ కృష్ణుని

జేరఁ దమకించును. కృష్ణుఁ డందఁడు. వాహిని కట్టలు తెగు నేమో యని యనిపించును.

కృష్ణుఁడు కరుణించును. రాధ కృష్ణుని కౌఁగిలిలోనికిఁ దీసికొనును. సర్వాంతర్యామియగు కృష్ణదేవుఁడు రాధ యంతరంగమునఁ బ్రతిబింబించును. వాహిని యల్లకల్లోలము తగ్గును. స్వచ్ఛందమైన పూర్ణప్రతిబింబ మెల్లరకును గనంబడును.

ఆహా! రాధయే పవిత్రజీవిని. ఆమె యంతరంగమునఁ గృష్ణ ప్రతిబింబమును జూచు కుమారదేవనివాసు లంతకంతకును భావనులు. కృష్ణస్వరూపమును హృదయమునఁ జిత్రించు కొన్న పుష్పలత నిజముగా నా రాధికయే యగును! రంగన్న వేణురంగఁడే!

ఈ ప్రదర్శనముతో గోపూజోత్సవములు ముగియును. రాధికాదేవి ప్రేమవాహిని తల్లిపాయ. దానినుండి కుమార దేవవాసు లెల్లరును సర్వప్రేమవాహినులను ద్రవ్వుకొందురు. నాఁటిరాత్రి వారిపాలిటి దివ్యజ్యోతి.

విజయేశ్వరాధీశు లీ ప్రదర్శనము నతిశ్రద్ధతోఁ బరిశీలించి ముగ్ధులై పుష్పలతకు బంగారు కృష్ణ విగ్రహమును, రంగన్నకు నమూల్యమైన వేణువును జేయించి యిచ్చిరి.

గోపూజోత్సవములు ముగిసిన నాఁటిరాత్రి తెల్లవాఱు జామున బంధువు లందఱును ప్రయాణమై వెళ్ళిరి. ఐదాఱు రోజులనుండియుఁ జాల సందడిగా నున్న మాధవీ మందిర

మొక్క సారిగా బారుమని పోయినది. కాని యింటిలో విజయుని సందడి యెక్కువైనది. రజనీకుమారి కాతఁడు లొంగెడి వాఁడు కాదు. కాని చంద్ర యెత్తుకొనినంతనే కేరింతలు కొట్టుచు నతఁ డాడుకొనును. విజయునకుఁ దిక్కువచ్చినచోఁ జంద్రయే లాలింపవలెను. విజయు నూరుకొనఁబెట్టుశక్తి తనకు లేనందులకు రజని సిగ్గిలెడిది. ఆమెకుఁ బిల్లలన్నచోఁజాల నిష్టము. విద్యాభ్యాసములో నున్నంతకాలమును రజని హారిణ శాబకములను, నెమిలి శిశువులను, చిలుకపిల్లలను బెంచుచుండెడిది. కాఁపురమునకు వచ్చిన తరువాతఁ గూడ నామె హారిణ శాబకములను బెంచుచునే యుండెను. అవి యామెకడ నెంతయో చనవుగా నుండుచు, నామె కన్పింపకపోయినచో దపించి పోయెడివి.

అట్టి తాను తన కన్నకొడుకును లాలింపఁజాలనందులకు రజనీకుమారి చాల ఖేదపడెను. తనకుఁగల లోప మేమో తెలిసినదికాదు. చంద్రయు, రజనియు నొక్కచోటనే కూర్చుందురు. తిక్కతిరిగిన తిరువాత విజయుఁడు రజనియొడిలోఁగూడ కొంతనే పాడుకొనును. రజనీకుమారి యందులకే మహానంద మందెడిది. క్రమముగా విజయుఁడు కేశవునకుఁగూడ నెక్కువ యలవా టయ్యెను. రాయ లప్పుడప్పుడు కుమారునిఁ బల్కరించుచుండును గాని యలవాటు చేసికొనుటకు మాత్రము జంకెను. ఇంక నీశ్వరమ్మగారును రామయ్యగారును ముద్దులు మూటఁగట్టు మనుమనిఁ జూచుకొని మురిసిపోయెడివారు.

# 8

ఏఁడాది తిరుగకుండఁగనే విజయునకుఁ జాల జబ్బుచేసినది. బ్రతుకుట కష్టమనుకొనిరి. దైవకృపవలన నాగండము గడచినదికాని రోగచిహ్నములు కంఠమును బట్టుకొన్నవి. అతఁడు మూఁగవాఁడయ్యెను. ఎన్నాళ్లు మీరినను మాటలు రాలేదు. జబ్బుచేసినప్పటినుండియు వానికి మాతృస్తన్యము నొసంగుట మంచిదికాదనిరి. చనుఁబాలొసంగుటకు వీలు లేదని వినినప్పుడు రజని మిక్కిలి దుఃఖించినది. తన యభాగ్యమును నిందించుకొన్నది. తాను విజయుని లాలింపలేకపోవుచున్నందులకే విచారించుచుండగాఁ బైనిదియొక్కటి వచ్చిపడినది. ఇది వఱకుఁ బాలుత్రావెడి కాన్పైనను విజయుఁడు తనయొడిలో నుండెడివాఁడు. ఇప్పుడికఁ దనయొద్ద కసలు రాఁడేమో!... ఎట్లైనను విజయుఁడు సురక్షితముగా నుండుటయే పదివేలని యామె తృప్తినొందెను.

విజయుని జబ్బులో రాయలు వానిమంచమును గని పెట్టుకొని యుండెడివాఁడు. అతఁడు గ్రంథపఠనమును మాని వేసెను. పుస్తకము తెఱచినచో నందుఁ గృశించిపోయిన విజయుఁడే ప్రత్యక్షమయ్యెడివాఁడు. అందఱకపురూపమైన బాలుఁడిట్లయినాఁడేమి!...రాయలకేమియును బాలుపోలేదు. పుత్రునిక్షేమమునకై రాయలు పరితపించిపోయెను. రజనీకుమారి ఇంతకంటెను మథనపడినది. రాత్రు లందఱును

బరుండినను విజయుని కేమికాఁసివచ్చునో యని యామె మేల్కొనియే యుండును. తోఁడికోడలి యవస్థకుఁ జంద్ర మనస్సు కరగిపోయెడిది. రజనిని ప్రతిమాలి యొక ప్రశాంత స్థలములో నామెను నిద్రఁబుచ్చి చంద్ర తాను విజయుని కుపచారములు చేయుచుండును. కాని రజనీకుమారికి మాగన్ను బట్టునో లేదో యింతలో విజయుని మూల్గు వినఁబడును. ఆమె యులికిపడిలేచి విజయుని మంచమునొద్దకుఁ గనులు నులుముకొనుచు నొక్కపరుగున వచ్చెడిది.

తెల్లవాఱులును రాయలు మతిలేనివానివలెఁదనగదిలోఁ బచారు చేయుచుండును. కేశవుఁడు వట్టి బేల. అన్నకు ధైర్యము చెప్పఁజాలఁడు. అసలన్నగారితో నెట్లు మాట్లాడవలయునో వానికిఁ దెలియనే తెలియదు. రామయ్యగారు రాయలను బిల్చి వానిదృష్టి మరలింపఁ బ్రయత్నించెడివారు. ఈశ్వరమ్మగారు, రామయ్యగారు నీ బాధను లోలోననే యణఁచుకొనియుండెడిది.

క్రమముగా విజయుఁ డారోగ్యమునుబొందెను. విశ్వనాథుఁడు రక్షరేఖను బంపించినాఁడు. జబ్బు మళ్ళు మొగము పట్టినంతనే విజయుఁడు నడువనారంభించెను. వాఁడు ప్రాఁకి యెఱుంగఁడు. ఆస్థితి జబ్బులోనే గడచిపోయినది......తల్లిపాలు పనికిరావని వైద్యులు చెప్పినప్పుడు విజయునకుఁ గొన్నాళ్ళు పడమటావుపాలు పోసిరి. ఆవుపాలలో బలిష్ఠమైన యాహార పదార్థము లుండును గాన విజయుఁడు వానిని జీర్ణించుకొనలేక

పోయెను. అందువలన వానికి మేఁకపాల నొసంగుటకు మొదలుపెట్టిరి. గోమాతవలెనే మేఁకకూడ మిక్కిలి సాధు జంతువు. మాతృస్తన్యము చాలని, లేక పనికిరాని పక్షమునఁ బసిపిల్లలకు మేఁకపాలు శ్రేష్ఠమైన యాహార మనుటలో సందియము లేదు. మేఁకపాలు త్రావి విజయుఁడు మిక్కిలి బలిష్ఠుఁడైనాఁడు. మరల నాతఁడు జీవితాంతమువఱకును జబ్బునఁ జీదియెఱుఁగఁడు.

విజయుఁ డారోగ్యమును బొందుసరికి నాందోళిత మనస్కయగు రజని మంచమెక్కెను. దాని జబ్బులో నామె రెండు నెలలు సరిగా నిద్రాహారముల నెఱుంగదు. బలహీనత చేత నామె మంచములోనుండి లేవలేని స్థితికిఁగూడ వచ్చినది. విజయేశ్వరమునుండి రామమోహనులు వచ్చి చూచి వెళ్లి సంస్థానవైద్యునిఁ బంపించినారు. ఆయన చాల మెలఁకువతో మందు నడిపెను. చంద్రుడు రజని కుపచారములు చేయుటతో సరిపోయెడిని. కేశవునకు వ్యవసాయపుఁ బనులు వచ్చెను. అందువలన విజయుఁడు రాయలకుఁ జనవయ్యెను. సంతోషముగఁ దండ్రియొడిలో నాడుకొనును. రాయలు కుమారు నెత్తుకొనివచ్చి రజనిమంచమునొద్దఁ గూర్చుండెడివాఁడు. రాయలు బోధింపగా విజయుఁడు తల్లిని ముద్దుపెట్టుకొనును. రజని కుమారుని హృదయమునకు హత్తుకొని యమందానంద మందును. రాయలు పితృహృదయ మా దృశ్యమును గాంచి ప్రేమతోఁ దరంగించుచుండును. ఆ కొంసేపు నాతఁడు తన

దిగులును మఱచిపోయెడివాఁడు. రజనికి జ్వర మలసటమీఁద వచ్చినందున నామెను జాల సేపు మాటాడింపరాదు. అందు వలనఁ గుమారుని దీసికొని రాయలు తన గదిలోనికి వెడలి పోవును. లేనిచో విజయుని నాయనమ్మగారి కప్పగించి వేయును. రజనీకుమారి క్రమముగానారోగ్యమును బొందెనుగాని యామె పూర్తిగాఁ గోలుకొనునప్పటి కాఱు నెలలు పట్టినది.

కుమారుని జబ్బుసమయములోను, ఆవెనుక భార్యకుఁ దీవ్రమగు ననారోగ్యము కల్గినప్పుడును రాయల హృదయము చలించిపోయినది. తన జీవితపథమును దాఁటి చిందరవందర లైన యడవిమార్గములలోఁ బడిన ట్లాతఁడెంచినాఁడు. కావ్య పతనము వానికి వెగటుగఁ దోఁచినది. అందేమాత్రము రస మునుగాని, మాధుర్యమునుగాని యాతఁడు సంభావింపలేక పోయినాఁడు. పుత్రునికి నెమ్మదించినంతనే యాతఁడు "అమ్మా" యని యూపిరితీసికొనినాఁడు. ఇంతలో మరల భార్య రోగ గ్రస్తమైనది. ఈ సంకటము లన్నియు నెందులకు వచ్చునో?

రజనీరాయల జీవితములో నింకొక ఘట్టము ప్రారంభ మైనది. ఇంతవఱకు నాచార్యుని బోధనలను దమశపథములను మఱచిపోయినవారివలె నాయిరువురును నాళ్లేండ్లు గడపివేసి నారు. తమజీవిత కార్యక్రమ మెట్టిదో వారు నిర్ణయించుకొన లేదు. కళల పునరుద్ధరణకై జీవితములను ధారపోయుదుమని శపథమును జేసిరేకాని యామార్గమేదో వారూహింపలేదు. చివఱకు జీవితములో నే నేమియును జేయలేనేమో యన్న

భయము రాయలకుఁ గల్గినది. రజనియు రాయల తీవ్రావేదనమును గ్రహించినది. ఆమెకు నేమియుఁ బాలుపోయినది కాదు. ఆ మాధవీమందిరములోఁ జంద్రవలెఁ దానొక భాగస్వామిని కాలేకపోయినది. భర్తతోఁగలిసి యాచార్య నాదేశము ననుసరించి కళోద్ధరణకును బాటుపడలేదు. ఈ యూహాలతో రజని శోకవిసర్జిత యయ్యును వేదనావిముక్త కాలేదు. అట్లే పుత్త్రుఁడును, భార్యయు రోగవిముక్తులైనను రాయలు వేదనా విసర్జితుఁడు కాలేక పోయినాఁడు.

కేశవుని కన్నయే భగవంతుఁడు. చంద్రకుఁ దోడికోడలే దేవి. ఈయిరువురు నాయిరువురకును బరిచర్య చేయుటలోఁ దమ జీవితములు సార్థక మగుచున్నవని తలంచెడివారు. వారిరువురి కేమి కావలసి వచ్చినను జంద్రా కేశవులు నిముసములో సమకూర్చుచుందురు. వీరిరువురి పరిచర్యలను గాంచి రజనీ కుమారియును కృష్ణరాయలును దమ జీవితము లిట్లు నిరర్థకముగఁ గడచిపోవలసినదేయగునా యని మఱింత విషాదమును బొందిరి. చంద్రా కేశవులకు వారిబాధ యర్థము కాలేదు. రజనీకుమారియు, రాయలును బల్లెటూరి మనుష్యులై, పల్లెటూరి జీవితములనే గడపుచున్నను, బల్లెటూరి జీవితరహస్యము వారికి హృదయ గోచరము కాలేదు. రాయలు సాయంకాలములందుఁబొలములకుఁబోవును. తనతమ్ముఁడు సస్యక్షేత్ర దేవతా ప్రియుఁడు. కేశవుని యనవరత కృషి పరిణామమై, పుష్కల సస్యస్వరూపములైన యా సుక్షేత్రములు

రాయల మనస్సున కాహ్లాదమును గొల్పెడివి; కాని యెన్ని సారులు పొలములకుఁ బోయినను గర్షకజీవితము మాత్రము వానికి సంతృప్తి నొసంగుటలేదు. ఈమనో వేదనలలో నాతఁడు భవానీ పరిస్థితులను గూర్చి యాలోచింపనే లేక పోయినాఁడు.

విజయునకు నాల్గవయేఁడు వచ్చినది. కాని వానికి మాటలు రాలేదు. సంగీత సాహిత్యాచార్యుల పుత్రుఁడయ్యు విజయుఁడు గాండీవములేని యర్జునుని పగిది శోభిల్లక మేనిపాలు త్రావి శరీర దార్ఢ్యమును మాత్రమే సంపాదించుకొని పెరుగుచున్నాఁడు. "ఈబాలుఁడు తనజీవిత నిరర్థకతా విహ్నమా?" యని రాయలు మఱియును దిగులుపొందెను. కాని మాటలు రాని యమాయికుఁడని వాని నందఱును ప్రేమతోఁ జూడసాగిరి. అందువలన విజయుఁడు క్రమముగా బండఁ దేఱినాఁడు. మూఁగతనమున్నను జెవుడావంతయునులేదు. వాని కూహ యున్నది. మనము చెప్పినవన్నియును గ్రహింపఁ గలఁడు. కాని తనకుఁ దోచినట్లు మాత్రమే చేయుచుండును. కుదురుగా నొక్కచోఁ గూర్చుండుటకు వానికున సొప్పదు. కాలుకాలిన పిల్లివలె నెల్లప్పుడును దిరుగుచునే యుండును. అట్లు తిరిగి తిరిగి యాలోచనా నిమగ్నుఁడై యొక్కచో ధ్యాన సుస్థిరుఁడైన యోగివలెఁ బద్మాసనమువేసి కూర్చుండును. అంపులకుఁ దోచు "ఓం కారము" ననుకరించు ధ్వనిని గుక్క విడువకుండఁ జాలసేపు వెల్వరించెడివాఁడు. దాని యర్థమేమో యెఱుంగరాదు.

విజయుని ప్రకృతి చాలఁ జిత్రమైనది. ఆతఁ డన్నిపదార్థములను, ఫలములను దినఁడు. కాయగూరలను బచ్చివానినే నమలివేయును. రెండు, మూఁడు సారవంతవస్తువులు మాత్రము వానికిఁ జాలనిష్టము. అన్నము మూఁడు పూటలందును దినును. నాల్గవయేఁడు వచ్చినప్పటి నుండియు నాతఁడు ప్రత్యూదయమునను దండ్రితోఁబాటు గోదావరినదిలో స్నానముచేసి వచ్చెడివాఁడు. స్నానమాచరింపకుండ నేవస్తువును ముట్టఁడు. తండ్రిసరసను గూర్చుండి నిష్ఠానియమములు కలవానివలె భుజించును. తండ్రి యూరిలోలేనప్పుడు పొరపాటున యథావిధిలో నేమి లోటు వచ్చినను, ఆతఁ డల్లరిచేసివేయును. అప్పుడు తాతగారు వచ్చి వానిని లాలించి యన్నము తినిపించుచుందురు.

నాలుగేండ్లు దాఁటినప్పటినుండియు విజయుఁ డప్పుడప్పుడు కేశవునితోఁ బొలములకు వెళ్ళసాగెను. జబ్బు నయమైనప్పటినుండియు విజయునికిఁ బ్రాఁతక్రొత్తల యెడమఱిక తగ్గినను, చిన్ననాఁటి చనవుతోడనే యాతఁడు పినతల్లి, పినతండ్రియొద్ద సంచరించుచుండును. చంద్రకూడ "కన్నయ్యా!" యనుచు విజయుని గడు గారాబము చేయుచుండును. విజయుఁడు పొడగరి. పినతల్లి వడికిన నూలుతో నేయఁబడిన చలువబట్టలనుగట్టి యాతఁడు నడచుచున్నచో నాఠీవి మహారాజపుత్త్రుల సంస్కారములోఁగూడ నుండదేమో యనిపించును. అతఁడు చకచక నడచును. విజయుడు నడచుచోఁ గేశవుఁడు కూడ వాని ననుసరింపలేక పోయెడివాఁడు.

క్రొత్తగాఁబుట్టిన పడమటావుదూడ విజయుని గాంచి నంతనే చిందులు త్రొక్కెడిది. విజయుఁడు ముసిముసి నవ్వులు నవ్వును. ఒకనాఁడా దూడ కాలిగిట్టక్రిందపడి వానిపాదము నలిగినది. అయినను దానిస్నేహము నాతఁడు మానలేదు రజనీ కుమారి కాఁపురమునకు వచ్చినప్పుడు తనవెంట గొనివచ్చిన హరిణ మీనినది. ఆ హరిణ శాబకమునకును, బడమటావు దూడకును విజయుఁడు చెలిమి చేసినాఁడు. ఆ రెండును వాని ప్రాణమిత్రము లైనవి. విజయుని మూఁగభాషకు, నా జంతువుల సాంకేతికభాషకును సరిపోయెను గాఁబోలు!

భవాని రామగిరిలో భర్తయింటఁ బాదముంచి యెనిమి దేండ్లయినది. ఆనాఁడు కోపమున నంతఃపురమునుండి వెడలి పోయిన గిరిరా వింతవఱకును దిరిగి భవానివంకఁ జూడనేలేదు. అతఁడు భోగవిలాసలోలుఁడై కోరిచేసికొన్న భార్యను, బిల్లను గూడ మఱచిపోయెను. రాచకార్యములను మనస్సున కసలే పట్టించుకొనఁడు. ఎన్నఁటికైనను మనస్సు త్రిప్పుకొనునేమో యని భవాని వేచియుండెను. ఆ యాశయును గన్పింపలేదు. భోగవిలాసములతో గిరిరావు శరీరము గుల్లయగుచున్న దని యామె కర్ణాకర్ణిగ విన్నది. ఇఁక ధైర్యమువహించి తానే పోయి కలుగఁజేసికొనఁ దలంచెను.

ఈ యెనిమిదేండ్లలోను భవాని పుట్టింటికైనను బోలేదు. ఆమెలోకము సవతిబిడ్డ భారతియే. భారతికిఁ గన్నతల్లి లేని లోటు కన్పింపలేదు. స్తన్యము నొసంగుట తప్ప భవాని

భారతికి సర్వోపచారములు కావించెను. భారతియన్నచో భవానికిఁ బ్రాణమైనది. ఆపిల్ల మనస్సెక్కడ తపనపడి పోవునో యని భవాని సర్వదా యామెను గాచుకొనియుండెడిది. భవానిలో నిష్కళంక మాతృహృదయము నిండియున్నది. అది నిండియున్న యమృతఘటము. ఆ యమృతమును బోసియే యామె భారతిని బెంచినది. ఆమె తన సర్వస్వమును భారతిసేవలో వినియోగించెను. భారతియే తాను, తానే భారతిగా నాయిరువురు నైపోయిరి. ఆ యైక్యమును గాంచి స్వర్గధామమునుండి పవిత్రహృదయముతో భారతితల్లి భవానిపై సువర్ణాశీస్సులు జల్లును. తాను భవానిలో నైక్యమయి భారతిని ముద్దాడును — స్తన్యము నొసంగఁబోవును; ఇంతలో భవానికిఁ దెలివివచ్చును.

భారతికిఁ దానే యక్షరాభ్యాస మొనర్చి, భవాని తా నన్నెడ నేర్చిన దంతయును క్రమముగాఁ జెప్పసాఁగెను. బుద్ధిసూక్ష్మతగల భారతియు భవానిచెప్పెడి సర్వమును గొలఁదికాలముననే గ్రహింపఁగల్గెను. భవాని తాను సంపాదించిన లోకజ్ఞానమును గూడ భారతికి వలసినంత చెప్పెను. భారతి మెల్లమెల్లగా నింటిపరిస్థితుల నవగాహనము చేసికొనఁ బ్రయత్నించెను. కాని యా యమాయిక హృదయమునకు మొదట నేమియును దెలిసినదికాదు.

ప్రత్యూషయమును నిత్యకృత్యములను నిర్వర్తింపఁజేసి భవాని భారతిచే నాపె తల్లిపటమునకు నమస్కారమును

చేయించును. ఇదేలని చాలఁగాలమువఱకు భారతి యూహింప లేకపోయెను. భవానియే తనకన్నతల్లియని యామె యింత వఱకును దలంచుచుండెను. భారతి తల్లి పటమునకు నమస్కరించునపుడు—'అక్కా! నీవు నిర్మలముగనుండు' మని నిమీలిత నేత్రయై భవాని మనస్సులో ననుకొనుచుండును. భారతితల్లి యొక్క కోరికలలో నొక్కటిమాత్రము ఫలించినది—ఆపె బిడ్డ పెరిగి పెద్దదయినది. కాని భర్తమాత్రము యథాప్రకారముగానే యుండెను. వాని స్వైరవిహార మింకను మితిమీఱినదే కాని యేమాత్రమును దగ్గలేదు. అట్లగుటకుఁ దానే బాధ్యురాలేమో?...ఒకనాఁడు భారతి తల్లిపటమునకు నమస్కరించుచున్నప్పుడు భవానికీవిషయములు మెఱపు వలెఁ దలంపునకువచ్చి యామె కనులనీరు నిండినది. భవానిని జూచి భారతి చకిత యయ్యెను. తల్లికంటినీటిని జూచినంతనే యామెకును దుఃఖమువచ్చినది. భవాని దుఃఖమును దిగమ్రింగి భారతికంటినీరు తుడిచెను.

"అమ్మా! నీవేడ్చుటకుఁ గారణమేమి?" మని భారతి యడిగెను. ఆమె చెప్పలేకపోయినది. భారతి హృదయము తల్లడిల్లెను. తా నెప్పుడు పటమునకు నమస్కరించినను, ఆమె చాలఁ బ్రశాంతముగా నుండెడిది. చాలఁగాలమునుండి తపించి తపించి చివర కెంతయో మనశ్శాంతి పొందినదానివలెఁ గన్పట్టుచుండును. అట్టియామె నేఁడేడ్చుటకుఁ గారణమేమి? ఆ సాయంకాలమే భారతి తన్నుఁబెంచిన వృద్ధపరిచారికను

దలచితలచి యడిగి భవాని తన కన్నతల్లి కాదని యెఱింగి నది. ఆనిముసమునుండియు భారతికి భవానిపై భక్తిశ్రద్ధలు ప్రేమయు మెండయ్యెను. మఱునాడు తల్లి పటమునకు నమస్కరించు సమయమున "ముందుగ నీకే నమస్కరింతు" నని భారతి భవానితో నన్నది. భవాని కారణ మడిగెను. భారతి తాను దెలిసికొన్న విషయమును జెప్పెను.

"నీవు నా కన్నతల్లివి కాకపోయినను, నిన్ను నేను గన్న తల్లికంటె నెక్కువగా దలంచు చున్నాను." అని భారతి యెంతో యనుభవజ్ఞురాలివలెఁ బలికెను. భవాని కన్నులనుండి యానం దాశ్రువులు రాలినవి.

"అమ్మా! ఆమె నీకన్నతల్లి. కన్నతల్లికంటెఁ బూజ నీయులు వేఱులేరు. కన్నతల్లి హృదయమును నీవింకను గ్రహింపఁ జాలవు......" భవాని యింక మాటాడ లేకపోయెను. భారతి మాటాడక తల్లిపటమువంకఁ గనుఱెప్ప వేయక చూచినది. పటములోని బొమ్మ కదలినట్లయ్యెను.

"నేను నీకన్నతల్లి నైనను, నాకంటె నీ కామెయే నిజ మైనతల్లి" యని యామె శాంతవచనముల ననినట్లా బాలికకుఁ దోఁచెను.

"అమ్మా! నా యీతల్లిని రక్షించి, ఆపెతపస్సును ఫల వంతముచేయుము" అని చిన్నబిడ్డయయ్యు భారతి మనస్సులోఁ గోరుకొనెను. పటములోఁ దల్లి నిర్మలముగఁ గన్పడెను.

ఇంతవఱకును గిరిరావు భారతినిగాని, తండ్రిని భారతి

గాని చూచియుండ లేదు. తండ్రిని జూపు మని భారతి రెండు మూఁడుసారు లడిగినను భవాని "ఇప్పుడు కా" దనుచు గడపి వేసినది. కాని యానాఁడు తండ్రిని జూడవలెనని భారతి గట్టిగా సంకల్పించుకొనెను. భవానియు నంగీకరించెను. అటు పోటుకుఁ దట్టుకొను జ్ఞానము భారతికి వచ్చినదని భవాని గ్రహించినది. భారతిమాట లాపె హృదయమున కొకవిధ మగు నూత్నశక్తిని సమకూర్చినవి.

గిరిరావుబాబు తన శయనాగారమం దొక విలాసిని పానీయముల నందిచ్చుచుండఁ ద్రావుచు మత్తులో నున్నాఁడు. భారతియు, భవానియు దాది దారిచూపింప గిరిరావుపడకగదిలోఁ బ్రవేశించిరి. తాను రామగిరి వచ్చిన మొదటిరోజునఁ దన భర్త తనకుఁ జూపించిన యంతఃపుర మిదియే యని భవాని గుర్తించినది. తనకును భర్తకును వైముఖ్యమును బ్రసాదించినదియు నిదియే. ఆనాఁడు తాను జూచిన యలంకార మంతయును జెక్కు చెదరక నింకను నట్లేయున్నది. పాశ్చాత్యదేశ నగ్నచిత్రాలంకృతమైన యాగదియంతయును మధుర వాసనలతో నిండియుండి మైకమును గల్గించుచుండెను. ఆగదిలో నడుగుబెట్టినంతనే భవాని యొడలు జలదరించెను. భారతి యా తొట్రుపాటును గుర్తింపకపోలేదు.

ఇంతకాలమునుండియు లేనిది నేఁ డిట్లు రాణిగారు జమీందారునియొద్దకుఁ బోవుచుండుటను జూచి యంతఃపుర మంతయు నాశ్చర్యనిమగ్న మైనది. ఏమి విపరీతములు సంభ

వించునో యని యుత్తములు భయమందిరి. గిరిరావుబాబు ననుయాయులు కొందఱు మరల రాణి కిప్పుడు మంచి పరాభవము జరుగునని యుత్సహించిరి. ఒక యాంతరంగిక సేవకుఁ డేఁగి రాణిగిరి రాకను ముందుగానే గిరిరావుబాబునకుఁ దెలియపఱచెను. ఆ క్షణములోనే గిరిరావుబాబునకుఁ బట్టరాని కోపము వచ్చినది. "ఆమె కిక్కడ పనేమిరా" యని యాతఁ డొక్క యఱపఱచెను. ఆ కేక కా సేవకుఁడు, నా విలాసినియుఁ దుళ్ళిపడినారు. భారతియు, భవానియు గదిలోఁ బ్రవేశించి వానికిఁ గనపడునట్లు ప్రక్కగా నొదిగి నిల్చిరి.

"ఎవరు నీవు?" అని గిరిరా వాయాసముతో నస్పష్టముగాఁ బ్రశ్నించెను. "నేను భవానిని స్వామీ!" అని భవాని ప్రత్యుత్తర మిచ్చినది. మత్తుచే నసలే కనరాకున్న తన రెండు కనులను గిరిరావుబాబు తన రెండు చేతులతోడను గట్టిగా మూసికొని—"ఇక్కడ నీ కేమిపని? వెడలి పో" మ్మని మరల నఱచెను.

"మహారాజా! ఈ పిల్ల మీపుత్రిక భారతి. మిమ్ముఁ జూడవలెనని కొండంత యాశతో వచ్చినది. ఈ బాలికకు మీతల్లిగారి పోలిక లన్నియును వచ్చినవఁట. ఒక్క నాఁ డీమెను ప్రేమతోఁ బల్కరింపుఁడు.........మీ యారోగ్యము చెడిపోయినది. మిమ్ముఁ జూచిన మీకై పరితపింపని మనుష్యులుండరు. ఈ విలాసినులను బంపించివేయుఁడు. నన్ను మీరు సేవచేయనిండు" అని చేతులు జోడించి భవాని విన్న

వించెను. భారతి యర్థముగాని యావేదనతో నా యిరువురిని జూచెను.

"అమ్మా! ఏరా మా నాన్నగారు? ఇట్లున్నారేమి?" అని భారతి భవానిని ప్రశ్నించెను. భారతి తన కూఁతురన్న జ్ఞాపకము వానికి లేదు. ఆ యిరువురి మాటల కాతఁడు మండి పోయి భారతి నెత్తి క్రిందఁబడవేయుటకై వేగముగా వచ్చెను. దుర్వ్యసనములతో శక్తిహీనుఁడై పోయిన గిరిరావుబాబు గా దూఁకుడునకుఁ దాళుకొనలేక వెనుకకు విఱుచుకొని పడిపోయి నాఁడు. భవాని ముందున కుఱికి క్రిందఁబడకుండ భర్తను బట్టు కొన్నది. విలాసినియు, దాదియుఁ జేయూఁత నిచ్చి గిరిరావు బాబును బండుకొనఁబెట్టిరి. దాసి పరుగునఁబోయి చన్నీటిని దెచ్చెను ఆనీటిని భవాని భర్త మొగముపైఁ జిలుకరించి పైఁటచెఱఁగుతో వీవసాఁగినది.

సేవకు లొక్కయంగలోఁ బోయి యాస్థానవైద్యులను దీసికొని వచ్చినారు. ఈలోపున మెల్ల మెల్లగా విలాసిని తన దారిని దాను బోయినది. అది చూచి "ప్రభూ! జీవితములో మాప్పన కిది తొలిఘట్టము. ఇఁకనైనను నా దేవునకు నారోగ్యము నిమ్ము" అని భవాని కన్నీటితోఁ గృష్ణప్రభు వును స్మరించుకొన్నది. ఆస్థానవైద్యులు పేరుపొందిన భిష గ్వరులు. కాని గిరిరావుబాబు కాలములో నాయన కాస్థాన ప్రవేశము లేకపోయెను. అయినను దమ పూర్వు లందఱును రామగిరి జమీందారుల యుప్పుతిని బ్రదికినవా రగుటచేతను,

దమ చిన్న రాణియొక్క సౌశీల్యము వినియుండుటచేతను వారు వెంటనే బయలుదేరి వచ్చిరి. భవాని వినయముతో వారికి నమస్కరించినది. "సుమంగలీభవ" యని వారు దీవించి జమీందారుని పరీక్షించినారు.

రోగలక్షణము లన్నియు నాకళింపునకుఁ దెచ్చుకొని వైద్యులు మందును బ్రారంభించినారు. "అమ్మా! బాబుగారి కిప్పుడు కొంచెము తీవ్రముగానున్నను గొలఁదిరోజులలో తేరు కొందురు. వారి యారోగ్య మంతయును మీ పరిచర్యపై నాధారపడియున్నది" అని వైద్యులు చెప్పినారు. భవాని యా యాదేశమును శిరసావహించినది. "అమ్మా! నేనుగూడ నాయనగారికి సేవచేయుదు" నని భారతి తల్లితో ననెను. వైద్యులు చిఱునవ్వు నవ్వినారు. "అట్లే చేయుదువు గానిలే తల్లీ!" అని భవాని యామె నుత్సాహపఱచెను.

గిరిరావుబాబు జబ్బుసమయములో పెత్తనమును భవాని దానే వహించినది. మరల రామగిరి సంస్థానములో నూత్నశకము ప్రారంభమయ్యెను.

## 9

ఒకనాఁటిరాత్రి కుమారదేవమున మాధవీమందిరపార్శ్వ భాగమునందుఁ బుచ్చపూల వెన్నెలలోఁ జంద్ర కేశవునికై వేచి యుండెను. రాత్రి మొదటిజాము దాఁటెను. కాని పాలేరుల సందడులలో మున్గియున్న కేశవుని కింటిధ్యానమే

లేదు. చిన్నబాబుగా రనుచుఁ బాలేరు లాతనిని వదలరు. కేశవుఁడు వారివారి కుటుంబపరిస్థితులను వినుచు నుచితము లగు సలహాల నొసంగుచుండును. హేమంతము వెడలిపోయి శిశిరర్తువు వచ్చినది. నదీతీరస్థమగుటచేఁ గుమారదేవముఁలో హేమంతమందు చలి హెచ్చుగానుండును. కాని రైతుజనము దానిని లెక్కచేయదు.

పండి విరిసిపోయిన పంటలను గోసి కుప్పలు వేయుటలో వారు తమ్ముఁదామే మఱతురు. వారికై చల్ది ముంతలను రైతు కన్నెలు గొంపోదురు. వారి నడకవయ్యారములు వరి పొలములను గోయు కూలీలపాటలకుఁ దాళము వేయుచుండును. కోతలపనులలో నుండిపోయి యొకొక్కప్పుడు రైతులు రెండు మూఁడు రోజులపాటు గృహములకే రారు. పంటలను గోసి కుప్పలు వేయుటలోను, వేసినకుప్పలను నూర్చుటలోను, నూర్చినధాన్యము నింటికిఁ జేర్చుటలోను రైతులు నలిగిపోవు చున్నను, వారానందముతోఁ జిందులాడుచునే యుందురు. మొత్తమునకు హేమంతమంతయును రైతులకుఁ దీరుబడి లేనికాలమని చెప్పవచ్చును.

సామాన్యమైన రైతులపనియే యిట్లుండ నింకఁ గేశవుని విషయము చెప్పవలసినదేమున్నది? ఆతఁడు చంద్రంతో మాట్లాడి యిప్పటికి సరిగా రెండునెలలైనది. ఈ రెండు నెలల నుండియు నాతఁడాహారమునుగూడ సరిగాఁ దీసికొనుటలేదు. ఏదియో యొకవేళకువచ్చి యన్నముతిని వెన్వెంటనే పొలము

నకు వెళ్ళిపోయెడివాఁడు. రాత్రి చాలఁ బ్రొద్దుపోయిన పిమ్మట నలసటతో నింటికిఁ జేరును. చంద్ర యొకనాఁడు వానిని బల్కరింపవలె ననుకొన్నది. ఆపెస్వరము విని పొలమువెళ్ళిపోవుచున్న కేశవుఁడాఁగినాఁడు. ఇంతలో ముంగిటనుండి "చిన్నబాబుగారు" రని కేకవినవచ్చినది. ఆనాఁడొక క్రొత్త వరికుప్పను బడఁగొట్టెడి ప్రయత్నములోనున్నారు. కేశవుని ధ్యాసయంతయు నటనేయున్నది. తన్నెవరోపిల్చుట నాలకించి, "వచ్చెదనుండు" మని చంద్రకుఁజెప్పి కేశవుఁ డదేపోక పోయినాఁడు. పాపము, చంద్ర వానికొఱకుఁ జాలసేపు వేచియున్నది. ఫలితము నిష్ఫలము. ఆమెకు నుదుకఁబోతుతనముకూడ వచ్చినది. కాని యిట్టిసంఘటనలకు జీవితములో నలవడియున్నది కావున నెటులో సర్దుకొనిపోయినది.

అమావాస్యతో రైతులకుఁ బొలముపనులన్నియును నయినవి. వారముపదిరోజులు తక్కిన చిల్లరిపనులను జూచుకొందురు. అప్పటినుండియుఁ దక్కినశిశిరర్తువంతయును రైతుజనమున కించుమించు సెలవుకాలమనవచ్చును. ఈ కాలములోనైనను భర్త తనతోఁ జనవుగా నుండ ననుకొన్నది చంద్ర. నాఁడుదశమి. చంద్రకాంతి పూర్ణతనందుచున్నది.

ఎట్టకేలకుఁ గేశవుఁడు పాలేరులను సాఁగనంపి వచ్చినాఁడు. అప్పటికిఁ జంద్ర యలసిపోయినది. విసువువచ్చినది. ఆవులింతలు రాసాఁగెను. కూర్చున్నతిన్నెపై నట్టులే యొడ్డికిలఁబడెను. కేశవుఁడు శబ్దముకాకుండవచ్చి చంద్రచెక్కిలిపై

వ్రేలితో మీటినాఁడు. చంద్ర యులికిపడిలేచినది. కేశవుఁడాపె సరసను గూర్చుండెను. చంద్ర పొడవైన జుట్టును జూచినచోఁ గేశవుని కెంతయో యానందముగ నుండును. అతఁ డాపె పూల జడను జేతికిఁజుట్టుకొని కొనతో నాపె వక్షఃస్థలముపై గొట్టి నాఁడు. చంద్రకుఁ బులకలుదయించినవి. కేశవుఁ డింత చన వుగాఁ బ్రవర్తించుట కదియే ప్రథమము. వాని యీ ప్రవర్తన చంద్రకే యాశ్చర్యజనక మయ్యెను. ఆపె కానందము నుత్సాహము నుప్పొంగివచ్చినవి. భర్తను గాఢముగాఁ గౌఁగిలించుకోవలె ననుకొన్నది. కాని యంతలో సిగ్గువేసెను. కేశవుఁ డాపె సిగ్గులో వ్యక్తమైన మధురభావ మేమాయని యాలోచింప సాఁగెను.

చంద్ర తనయుద్రేకమునాఁపుకొని "ముందు భోజనమునకు లెం" డని భర్తను గోరెను. "నీవింకను దినలేదా?" యని కేశవుఁడు ప్రశ్నించెను. లేదన్నట్లు చంద్ర తలయూఁపెను. కేశవుని భోజనమునకు వేళపాళలులేవు. అందుచేఁ జంద్ర యత్తగారును, దోడికోడలును భుజించునప్పుడే తానును దిని వేయును. అట్లుతిననిచో "వానితోఁబాటు నీవును నిగిర్చి పెట్టుకొని కూర్చుండుమెందుల"కని యీశ్వరమ్మగారు కోపపడెడి వారు. కాని యానాఁడు చంద్ర వారితో భుజింపలేదు. ఈశ్వరమ్మగారుకూడ నేమియును ననలేదు.

"చంద్రా! మనముభుజించి వచ్చునప్పటికీ వెన్నెల పోదుకదా?"

"వెన్నెలపోవునని భయమందుట నెక్కడ నేర్చినారు?"

"వెన్నెలయే నేర్పినది"

"ఇన్ని సంవత్సరములనుండియు వెన్నెలలు కాయుట లేదు కాఁబోలు?"

"కాయకపోవుటయేమి? వెన్నెలలుకాయుచునే యున్నవి. కాని యప్పుడు వానికిని నాకును బరిచయమే లేదు. తరువాతఁ గొంతకాలమునకుఁ బరిచయ మైనది. అది పరిచయము మాత్రమే. ఆ తరువాత స్నేహ మేర్పడినది. ఇప్పు డిఁక నేను వెన్నెలతో నైక్యమే కానున్నాను..."

తన్నుగూర్చియే భర్త చమత్కరించుచుండెనని చంద్ర గ్రహించినది. మధుర లజ్జాభావముతో నామె క్రొత్తపెండ్లి కూఁతువలె, నారిసారించిన వింటిబద్దవలె వంగిపోయెను.

"చంద్రా! నేనింతసేపు సాలస్యము చేయుటకుఁ గారణ మును నీకుఁజెప్పనే లేదు. పైతులందఱకును బూర్ణిమవఱకుఁ బనులున్నవి. అందుచే మన యూరి గోపూజోత్సవగాలను పౌర్ణమి వెళ్లినంతనే మొదలుపెట్టుటకు నిశ్చయించినారు. ఆ యైదురోజులును మనపాలేరు లందఱకును సెలవుకావలయు నఁట. ఏమందువు?"

గోపూజోత్సవము లన్నచోఁ జంద్రకు మితిలేని యానందము. సంతోషాతిశయమునఁ ద్వరగా భోజనమునకు లెండని యామె భర్తను బ్రోత్సహించెను. కేశవుఁడు లేచెను.

వానితోఁబాటు చంద్రయును లేచెను. ఆమె వాని కౌఁగిలిలో నున్నది. "విడువుఁ"డని యామె యన్నది. కేశవుఁ డట్లు చేయలేదు.

"ఎవరైనఁ జూతురు. కర్షకుల కీ ధూర్తత్వమేమి?" అని చంద్ర మేలమాడెను. "నీవే వెన్నెలవై నీ విలాసములను జూచుకొనుచున్నావు" అనుచుఁ గేశవుఁ డామెను మఱింత బిగియారఁ గౌఁగిలించెను. పరవశ్యతముతో నామె "అబ్బా!... యని యూర్పుదీసికొన్నది. తోడనే కేశవుఁడు కౌఁగిలిని వదలి వేసెను. కేశవుఁ డెమటిజీవి బాధను సహింపలేఁడు. తాను కొంచెము మోఁటువాఁ డనియుఁ, జంద్ర మిక్కిలి సుకుమారి యనియు వానితలంపు. అందుచేఁ జంద్రను బూర్తిగాఁ గౌఁగిలిలో నింపుటకైన నాతఁడు సాహసింపఁడు. నేఁడు సాహసింపఁగాఁ జంద్ర "అబ్బా!..." యని యన్నది. అట్లనుట బాధ వలననే యని యాతఁ డనుకొనెను—"చంద్రా! భుజంచివత్తుము రమ్మ"నుచు నాతఁడు నడువసాఁగెను. చంద్ర వాని ననుసరించెను.

సాధారణముగా నీశ్వరమ్మగారే తమయమ్మృత హస్తముతోఁ గొడుకులిరువురకు నన్నము పెట్టుచుందురు. ఇంటిలో నందఱును నిద్రించుచుండిరి. కేశవునికి నన్నము పెట్టుమని చంద్రతోఁ జెప్పి నాఁ డీశ్వరమ్మగారును నిద్రింపఁబోయిరి. అందుచేఁ జంద్రా కేశవులిరువురు నొక్కసారే భుజించిరి. కేశవుఁడు ముందుగా వచ్చి తల్పముపై మేనువాల్చెను. శరత్కాల పూర్ణిమనాఁటి చంద్రికవోలె వెలుఁగొందుచున్న చంద్ర వాని కన్నులకుఁ గట్టినట్లున్నది; జరీపూవులు గల్గిన తెల్లని యుప్పాడ

చీరయు, త్రైకయు ధరించి తాంబూలపదార్థములు చేతనుంచు కొని, మూర్తీభవించిన వెన్నెలవోలె చంద్ర యేతెంచెను. కేశవుడా దివ్యసుందర విగ్రహమును జూచి చేతులు జోడించి యచంచలుడై నిల్చినాడు. "ఏమట్లు విభ్రమమునఁ జూచు చున్నారు?" అని చంద్ర ప్రశ్నించెను.

"చంద్రా! నీవు వెన్నెలవు. నీలో నమృతమున్నది. అది సేవించి నేనను సుకుమారుడను గాఁగోరుచున్నాను." కేశవుడు ముందునకు సాగినాడు. చంద్ర వానిచేతులలో వ్రాలి పోయినది.

చంద్ర సౌందర్యమునే భావించుచుఁ గలఁతనిద్దురలో నున్న కేశవునకు మూఁడవజాము మధ్యమునఁ బశుశాలనుండి పడమటావు యఱపు వినవచ్చెను. కేశవుఁ డులికిపడి లేచినాడు. ఆ యఱపు చాల దీనముగానున్నది. కేశవుని హృదయములోఁ జెయిపెట్టి కలఁచినట్లయ్యెను. తల్పమునుండి లేచి యాతఁ డతి వేగముగా గోశాలవైపుఁ బరువెత్తెను. చంద్ర పరవశత్వముతో నింకను నిద్రించుచునే యున్నది. కేశవుడు గోశాలను జేరు నప్పటికొక తీతువుపిట్ట వేఁపకొమ్మపైఁ గూర్చుండి 'తీ' 'తీ' యని కూనిరాగమును దీయుచుండెను. పడమటావు దానివంకఁ దీక్ష్ణముగాఁ జూచుచున్నది. ఆ ప్రదేశమంతయును దుఃఖ మావరించినట్లుండెను. చంద్రుఁ డదృశ్యుఁడగుటచేఁ జీఁకట్లుపూర్తిగా నలముకొన్నవి.

కేశవుడు గోశాలయందలి దీపమును వెలిఁగించినాడు.

ఆ వెలుఁగునుజూచి తీతువు 'తీ, తీ' యనుచునే యెగిరి పోయెను. పడమటావు కేశవునిఁగాంచి నెమ్మదిలినది. దానిపెద్ద దూడయొకటి వచ్చి కేశవుని చేతులను నాకినది. చిన్నదూడ కట్టుగట్టునుండి యఱవసాఁగెను. కేశవుఁడు దానిఁ తాటిని విప్పి వేసి వచ్చి పడమటావువీఁపున దట్టినాఁడు. ఆయనగాయికపు మూఁగజంతువులు మూఁడును దగ్గఱకుజనూనితో నేమేమో వలపోసికొన్నవి. కేశవునకు నానిబాధ యర్థమైనది. ఆ మూఁటితో దానుగూడ నేకమైపోయినాఁడు.

రాత్రి పడమటావు నంభాలు విని కలఁతనొందిన హృదయముతో నీశ్వరమ్మగారు వెలుఁగురాకుండఁగనే కేశవుని గనుగొనుటకై వచ్చినారు. చంద్ర యప్పటికింకను నిద్రలేవలేదు. ఈశ్వరమ్మగారు కేశవుని బిలుచుటను విని యామె కళవళ పడుచు లేచెను. కుమారుఁడట లేకపోవుటచే నీశ్వరమ్మగారు చిన్నగా గోశాలకడకుఁ జనిరి; అప్పటికిఁ గొందఱు పాలేరులు వచ్చియున్నను కేశవుఁడే స్వయముగాఁ గుడితిని గలిపి పడమటావునకుఁ బోయుచుండెను. తల్లిగారు వచ్చుటను బరికించి వినమ్రుఁడై కేశవుఁడు మెల్లగా హృదయభారముతో నీశ్వరమ్మ గారి యొద్దకు వచ్చి నిలిచెను. "చిన్నబాబూ!" అని యీశ్వరమ్మగారు పిలిచిరి. కేశవుఁడు మోము త్రిప్పినాఁడు. కేశవుని దీనత్వమును గాంచి యీశ్వరమ్మగారు భయపడిరి.

"చినా ! ఏదియో కలఁతచెందినట్లున్నావే?"

"అదికాదమ్మా! కుమారదేవమున గోవుఁ కేదియో

యాపద రానున్నది. ఇఁకనాకు గోసేవచేయు భాగ్యము కలుగ
గేమో ?"— "అట్లనుచుంటివేమి చిన్నా !" అని యీశ్వ
రమ్మగారు చాలనాతురతతో నడిగిరి. కేశవుఁడు తీతువు విషయ
మును జెప్పినాఁడు—"అమ్మా! రాఁబోవు నాపద నిది
సూచించినది. తెల్లవారి తండ్రికై మన చుట్టుపట్టులనున్న గ్రామ
ములనుండి పశుతతిని కొనుగోలుచేసి తీసికొనిపోవుచున్నారఁట.
మన గ్రామముకూడ వ్యామోహపడునేమో !..." కేశవుఁ
డిఁకఁ జెప్పలేకపోయెను. పశుతతి, అందున గోవన్నచో నతి
పవిత్రముగఁ దలఁపఁబడు భరతఖండములో నిట్టి విపరీతములు
మహామ్మదీయుల కాలములోఁ బ్రారంభమైనవి. నేఁడవి పూర్ణత
నందునేమో ?... కుమార దేవమునకేదియో చెడుకాలము
రానున్నది. ఈశ్వరమ్మగారి మనోవీథిలో దూరదూరానఁ
జీఁకట్లు పొడచూపినవి. ఆమె గోమాతను భక్తితో నమస్క
రించి యింటికి మఱలెను.

కేశవుఁడు కాలకృత్యములను నిర్వర్తించిన పిదప నూరి
లోనికిఁ బోయినాఁడు. "చావడియందు రైతు లెందఱో
మూఁగియుండిరి. ఒక యాసనముపై దొరలవేషమున నొక
యాంధ్రుఁడు కూర్చుండియుండెను. "ఈ దొరకుఁ గుమార దేవ
మున నేమి పనియున్నది ?" అని తర్కించుకొనుచుఁ గేశవుఁ
డటకు వెళ్ళెను. కేశవమూర్తిని జూచి కొందఱు భయమును,
మఱికొందఱు సంతోషమును బొందిరి. రైతులలోని చలన
మును గ్రహించి యా నల్లదొరయును "ఈతఁ డేయధికారియును

గాదే? వీనినిజూచి రైతు లిట్లు భయపడుదురేమి!" అని విస్మయమొందెను. కేశవుని జూచి సంతోషముతో నొక ముసలిరైతు ఇట్లనినాఁడు- "అడుగో! మన కేశవస్వామి వచ్చినాఁడు. ఆయనయే యిందలి యుక్తాయుక్తములను నిర్ణయించునుగాక". అని కేశవు నాహ్వానించెను. "అసలువిషయమే"మని కేశవుఁ డడిగెను. ఆ వృద్ధుఁ డిట్లు చెప్పెను— "చిన్నబాబూ! వీరొక యుద్యోగియఁట! ఎక్కువ మూల్యము నిచ్చి తెల్లవారి భోజనమునకై ఆవులను, ఎద్దులను, మంచి రకమును కొనుగోలుచేయుటకై వచ్చినారు..."

ఈ మాటలు వినునప్పటికిఁ గేశవుఁడు నిలువెల్ల వణఁకిపోయెను. తీతువుచేసిన సూచన యింతలోనే మూర్తివంతమైనదే?... కేశవుని కనులు జేవురించినవి. ఆతఁడు ధైర్యమును దెచ్చుకొనినాఁడు.

"ఈ దొరగారు భారతీయులా? దాస్యభావము బాగుగాఁ బట్టుబడినది. అసలీయనను గ్రామములోనికి రానిచ్చినవా రెవ్వరు?"—చివరి వాక్య మనునప్పటికిఁ గేశవునికంఠస్వరము హెచ్చిపోయినది. ముసలిరైతునకుఁ గొండంత ధైర్యము వచ్చెను. ఆతఁడు తక్కిన వారినిజూచి హేళనగా నవ్వుచుఁ "జిన్నబాబూ! అప్పుడే కొందఱు కొన్ని పశువుల నమ్ముటకీదొరగారితో బేరములు సాఁగించుచున్నారు" అనెను. అది విని కేశవుఁ డదరిపడెను. "ఆలాగా! పశువుల నమ్మెదరేమి?... నేను జీవించియుండఁగా నొక్క జంతు

వేని మనుష్యుల యాహారమునకై ఈ యూరినుండి కదలదు. నా కింతవఱకే ప్రాణిపైఁ గోపముకాని, విరోధముకాని లేదు. పశువుల నమ్ముఁదలఁచుకొన్నవా రెవ్వరేని ముందుగా నా కంఠము త్తిరించి మఱి యా పనిని జేయుఁడు..."
శోకము రూపుదాల్చినట్లుఁ గనుల నీరు నించుచు నాతఁ డట నుండి కదలిపోయెను.

కేశవుని యప్పటి రూపమును జూచి యా నల్లదొర యును గంపించిపోయినాఁడు. రైతు లొకరి మొగము లొకరు చూచుకొనిరి. గ్రామపెద్దయైన రామయ్యగారి కుటుంబ మన్నచోఁ గుమార దేవనివాసు లందఱకుఁ జాల గౌరవ మున్నది. అందును గేశవుఁ డన్నచో నింకఁ జెప్పనక్కఱయే లేదు. ఆతఁడు రైతులపాలిటి భాగ్యదేవత యని వారి తలంపు. కేశవస్వామి పుట్టినతోడనే కుమార దేవమున కైశ్వర్యమెత్తు కొన్నదని వారంఁదఱి విశ్వాసమును—పశుతతి కేవిధమైన యాపదవచ్చినను కేశవుని హృదయము తునుకలై పోవునని వారు గ్రహించినారు. అందఱును సంప్రదించుకొని పశువుల నమ్ముఁజాల మని నల్లదొరగారితో స్పష్టముగఁ జెప్పివేసిరి. ఆతఁడు వట్టిచేతులతో వచ్చినదారి పట్టెను.

రైతుల నిర్ణయమును గేశవుని కెఱిఁగింపవలెనని ముసలి రైతు మాధవీమందిరమునకు వచ్చెను. కేశవుఁడు పొలములో నున్నాఁడు. ఆ వృద్ధుఁడు సంతోషముతో నంతదూరము నడిచి వెళ్ళినాఁడు. కేశవుఁ డట పచ్చికబీడులలో మేయుచున్న యావుల

మందయొద్ద దుఃఖభారముతో నిలుచుండి యుండెను. "కేశవ స్వామీ!" యని యా వృద్ధుఁడు దూరమునుండియే పిలిచెను. కేశవుఁడు పరుగెత్తుకొని వచ్చినాఁడు. రైతుల నిర్ణయమును, నల్లదొరగారి పోకయు నాతఁడు కేశవునకుఁ దెల్పెను. కేశవుని యానందమున కవధి లేకపోయినది. "తాతా! ధన్యుఁడను" అని కేశవుఁ డా వృద్ధునకు నమస్కరించెను. అతఁడు కేశవుని శిరము మూర్కొనినాఁడు. తరువాత "గోపస్వామీ! శ్రీకృష్ణా! మమ్ము, గోవులను రక్షించుభారము నీయదియే" యని వారిరువురును బ్రార్థించుకొనిరి.

కాని తమకు వచ్చు లాభములను జెడఁగొట్టివేసెనని కొందఱు తెలుఁగుమీఱిన రైతులకును, మఱికొందఱు నవ యువకులకును గేశవునిపై గుఱ్ఱుగానే యున్నది. పూర్ణిమ వెళ్లుట తోడనే గోపూజోత్సవములు ప్రారంభమైనవి. ప్రథమ దివసమున రైతులందఱును వచ్చి రామయ్యగారి కుటుంబము నాహ్వానిం చుట యాచారము. కాని యానాఁడు కొందఱు ముఖ్యులే రాలేదు. కేశవుఁడు పరిస్థితుల తాఱుమాఱును గ్రహించినాఁడు. చంద్రా కేశవులు యథాప్రకారముగాఁ బడమటావును దొలుత పూజించిరి. చంద్రకు భర్తయావేదన యర్థమైనది. వారిరువు రకు నా యుత్సవము లుత్సాహము నీయలేదు. ఆ యుత్సవ ములలో నేదియో శంక మప్పుడే ప్రవేశించినట్లు వారికిఁ దోఁచెను. పరిస్థితు లర్థమైన చంద్రావ్యాకులము వేసఁగిలోఁ దిప్పలు వేసిన గోదావరివలె నున్నది.

గోపూజను నిర్వహించి చంద్రా కేశవు లిరువురు నింటికి వచ్చినారు. ఊరేగింపులో వారు పాల్గొనలేదు. అట్లు వారు వెళ్ళిపోవుట కెవ్వ రభ్యంతరమును జెప్పలేదు. రైతుల మభ్భావమునకుఁ గేశవుఁడు మొదట నాశ్చర్యపడినాఁడు. కాని యాశ్చర్యపడవలసిన పనిలేదని మరల ననుకొనెను. నాఁడింటికి వచ్చి కేశవుఁడిట్లాలోచించెను—"నా గోవు సంవత్సరమున మమ్ముఁ బిలుచుట కెవ్వరును రాకపోవుటయే కాదు; ఉత్సవము లనే చేయుట మానుకొందురేమో? బహుశః ప్రతివత్సరమును దప్పక జరుగు గోపూజోత్సవములకీ యేఁటితో సరి కాఁబోలు!"

ఏవియో నాశనసూచనలతో వానిహృదయము మిక్కిలి వ్యథఁ జెందుచున్నది. తక్కిన నాల్గురోజు లుత్సవ మెట్లు జరిగినదో, అసలు జరిగినదో లేదో వాని కక్కఱయే లేకపోయెను. ఆయేఁడు గోపూజోత్సవములకుఁ గొన్ని దివసములకు ముందే పుష్పలత కృష్ణదేవుని పాదసన్నిధికి వెడలిపోయినది. రాధిక లేకపోవుటచేఁ బువ్వులరంగని వేణువులోని రస మంతరించిపోయెను. రాధిక వేషమును ధరించిన వేఱొక దేవదాసీ కన్య రంగన్నతో నభినయింప లేకపోయినది. ఆమెతో మాటాడుటకే రంగన్న మనస్సొప్పలేదు. మొత్తమున కుత్సవము లేమియు రక్తికట్టలేదు.

## 10

అత్యంత కోపోద్వేగము వలన మూర్ఛనొంది వాత గ్రస్తుఁడైన గిరిరావుబాబు మంచమునుండి దిగుటకుఁగూడ

నోపికలేనివాఁడయ్యెను. భవానియనినఁ గోప మాతనికి లేక పోలేదు. భారతి నాదరింపవలెనన్న కాంక్షయును బుట్టలేదు. వానికిఁ ద్రాగుడునం దిష్టముపోయినది. వైద్యుని, దివానుని దప్ప నాతఁ డెవ్వరిని దనయొద్దకు రానిచ్చెడివాఁడు కాఁడు. వట్టి పరిచర్యచేయుటకుమాత్రము భవాని రావచ్చును; పోవచ్చును. ఆతఁ డాపె పరిచర్య లందుకొనునేకాని యామెతో మాట్లా డఁడు. ఆమెవంకఁ జూడఁడు.

భర్తచే మందు సేవింపఁజేసి భవాని వెడలిపోవును; పథ్యము తినిపించి వెడలిపోవును; ఏమైనఁ గావలసిన సమ కూర్చి వెడలిపోవును. భవాని వెనుదిరిగిపోవుచున్నప్పు డామె చూడకుండ వాని చూపు లామెను బరిశీలించుచుండును. ఎప్పుడేని యామె శరీరము వానికిఁ దగిలినచో వాని యొడ లిలో నేదియో యననుభూతమైన విద్యుత్తు ప్రవహించెడిది. ఆ కదలిక కామసంబంధి కాదు. ఏదియో వానికిని దెలి యదు. ఆతని శయనగృహము నేఁడేమో యొక క్రొత్త జీవిత మును, ఒక్క క్రొత్తయందమును బుణికిపుచ్చుకొన్నది. నేఁ డందున్న వస్తువులు వేఱు. ఆగోడల కలంకరింపఁబడిన పట ములు వేఱు. పూర్వమందున్న పాశ్చాత్యదేశీయుల నగ్నచిత్రము లన్నిఁటిని భవాని నాశనముచేసి తగులఁబెట్టినది. వానిచోట బూర్వపు రామగిరి జమీందారులు సేకరించియున్న చిత్రము లను — దివాణములోఁ బ్రాఁతవస్తువులు పడియున్న గదులలో దొరికినవానిని—నలంకరింపఁజేసినది. రాధాకృష్ణులు, ఉమామహే

శ్వరులు, రతీమన్మథులు మొదలైనవవి. గిరిరావుబాబు మంచ మున కెదురుగా నతని తల్లిగారిపటమును భవాని పెట్టించినది. అక్కడక్కడ రాజఠీవిని వెలయించుచున్న పూర్వపు రామగిరి జమీందారుల చిత్రపటములుకూడ నలంకరింపఁబడినవి.

ఎనిమిదినెలలకు గిరిరావుబాబునకు బాగుగా బలము చేకూరె. పచారులు చేయసాఁగినాఁడు. భిషగ్వరుని యలౌకికౌషధ శక్తియు, భవానీదేవి నిరంతరతపస్సును గిరిరావులో నారోగ్యమును, వాని హృదయములో మార్పును సమకూర్చినవి. గిరిరావు తన శయనాగారమునందలి మార్పును గుర్తించినాఁడు. తాను జేయించిన యలంకారమునంతటిని బాడుచేసి వేసిన భవానిపై వానికిఁ బట్టరాని కోపము వచ్చినది. అట్లు చేయుట కామె కేమి యధికారమున్నది? ఒకనాఁ డిట్టి యాలోచనలో నతఁ డుండగా గిరిరావునకుఁ దన తల్లిగారిపట మెదురుగాఁ గన్పించినది. నిదానించి చూచినాఁడు. ఆనాఁడనే భారతియు వానిసన్నిధికి నచ్చెను. "స్వామీ! మీకుఁ బితృప్రేమ యొకింతయైన స్పందనము కలుగఁజేయుట లేదా? ఈ బాలికకు మీతల్లిగారి పోలికలన్నియును వచ్చినవఁట!" అని భవాని యానాఁడు విన్నవించిన మాటలు వానిగుండెపైఁ గొట్టిన ట్లయ్యెను. అప్రయత్నముగా నాతఁడు చేతులు జోడించి తల్లిపటమునకు నమస్కరించెను. "అమ్మా! నేనన్నచో నీకుఁ బంచప్రాణములును. నా నడతకు దుఃఖించుచునే మరణించినావు. ఆ బాధచే మరల నాకుఁ బుత్రికవై జన్మించితివి కాఁబోలు. తెలిసికొన

లేకపోతిని. క్షమింపుము..." అని యాతఁ డనుకొనెను. ప్రప్రథమముగా వాని కనుకొలుకులలో నీరు నిలిచి యట్టె మాయమైపోయెను.

గిరిరా వానాఁటి సాయంకాలము మెల్లఁగ నడుగులు వేయుచు వరండాలోనికి వచ్చినాఁడు. తండ్రిగారు విశ్రమించి నారో లేదో చూచుటకై భారతి యక్కడికి వచ్చినది. గిరిరా వామెను జూచెను. వెనుదిరిగి వెళ్లిపోనున్న భారతి నిలఁబడెను. ఈ మనోహరమూర్తినా తా నెత్తి క్రిందఁ బడవేయఁ దలఁచినది?...భారతిని దగ్గఱకు రమ్మని గిరిరా వొకింతసేపటికి సైఁగ చేసెను. ఆశ్చర్యముతో, నమ్రతతో భారతి తండ్రియొద్దకు వచ్చినది. గిరిరా వామెచేయి పట్టుకొని సోఫాలోఁ గూర్చుండఁబెట్టి తానును గూర్చుండెను.

భారతి యా స్నిగ్ధహస్తము పూర్తిగా విషభావ సంపర్కము వదలని గిరిరావునకు గఱకుగాఁ దగిలినది. ఏమా యిది యని గిరిరా వాశ్చర్యపడెను. కాని యాతఁడు లోతుగా నూహింపలేకపోయెను.

"అమ్మా! నీ పేరేమి?" అని గిరిరా వడిగెను. తన్నాతఁ డట్లు పిలుచుటకు భారతి చకిత యయ్యెను. గిరిరా వామెను దన తల్లినిఁ బిలిచినట్లు పిలిచినాఁడు.

"భారతి" యని యామె చెప్పెను.

"నే నెవ్వఁడనో నీకుఁ దెలియునా!" అని గిరిరావు ప్రశ్నించెను. భారతి కర్థము కాలేదు. భారతి తండ్రికి నమస్కరించినది.

"మీరు మా నాన్నగారు. మా అమ్మ చెప్పినది" — "మీ అమ్మ యెవ్వరు ?"—"మా అమ్మనే యెఱుఁగరా! ప్రతి నిత్యమును మీ సేవచేయుటకు వచ్చుటలేదా?"—గిరిరా వనేకములగు నూహాలలోఁ బడెను. భవానికిఁ బిల్ల లెక్కడ? ఈమె మా యమ్మ యనుచున్నదే!......గిరిరావు నొడలు జలదరించెను. వాని కనేకములగు నీచాభిప్రాయములు తట్టినవి. తండ్రి వికలత్వమునుజూచి తాను జెప్పిన దర్థము కాలేదు కాఁబోలు నని భారతి మరల నిట్లు చెప్పినది.

"ఆమె నిజమునకు నా కన్నతల్లి కాదఁట. తరువాత తెలిసినది. నే నిప్పు డామెను నాకన్నతల్లికంటె నెక్కుడుగాఁ దలఁచుకొనుచున్నాను." దీనత్వమును, గౌరవభావము నొక్కేసరి యామెలో గిరిరావు చూచెను.

తనకుఁ దట్టిన పాపపు టూహాలకు గిరిరావు సిగ్గిలెను. భవాని పేరెత్తినచోఁ దనకెట్టి చెడుతలంపు లేలవచ్చునో గిరిరా వూహింపలేకపోయెను. "నేను నిజముగా నామెయెడ ద్రోహము చేయుచున్నాఁడ" నన్న తలంపు వానికి మరల వచ్చెను. గిరిరావు తల పంకించుటచేఁ దాను చెప్పిన దర్థమైన దని భారతి యనుకొనెను.

"నే నన్నచో నమ్మ కెంతో ముద్దు. నేను నాయనమ్మగారివలె నుందునఁట. అంద రందురు. మీ రన్నచో నమ్మ కెంత ప్రేమయో తెలియునా! ఎల్లప్పుడును మిమ్మే స్మరించుకొనుచుండును. మీ కారోగ్యము కలుగవలె నని

యెల్లప్పుడును తపించిపోవుచుండును. పూర్వముకంటె మీా రిప్పుడు చాల నారోగ్యముగా నున్నారు. త్వరలో మీాకుఁ బూర్తిగా నారోగ్యము కలుగునని వైద్యు లమ్మతోఁ జెప్పినారు." అని ఏమేమో భారతి యొకదాని కొకటి సంబంధము లేని యనేక విషయము లొక్క గుక్కలోఁ జెప్పివేసినది. గిరి రావాలోచించుచుండెను. భవానికి నే నన్నచో నంత ప్రేమయా?......తాను ముభావముతో నున్నను భవాని యమందానందముతోఁ దనకు సేవచేయుచుండుటయే యీ తలంపును బలపఱచెను. గిరిరావున కేదోలోకములో నున్న ట్లున్నది. "అమ్మా! భారతీ! నీవేమి చదువుకొన్నావు?" అని యే తలంపును స్థిరముగా నూహింపలేని గిరిరావు ప్రశ్నించెను. కాని ఆమె చదువుకొనుటకుఁ దానేమియు నవకాశము కల్పింపలేదన్న విషయము గుర్తునకువచ్చి గిరిరావు సిగ్గుపడెను.

"నాన్నగారూ! మా పెద్దమామయ్య యున్నాఁడఁట! మీాకుఁ దెలియునుగదా? ఆయనతో నేనింక రెండుమూఁడేండ్లలోఁ బోటీచేయగలనఁట!" యని భారతి సగర్వముగఁ జెప్పెను. భారతిమాటలు గిరిరావున కాశ్చర్యము కల్గించెను. రాయలు మహావిద్వాంసుఁడు. ఆతనితో నీమె పోటీచేయుట యేమి?... గిరిరావునకుఁ దెలిసినదిగాదు.

"అమ్మా! యింత చదు వెక్కడ నేర్చితివి?" అని గిరిరావు ప్రశ్నించెను. "ఇంతమాత్రము తెలియదా?" యన్నట్లుగా భారతి నవ్వెను.

“అమ్మయే చెప్పినది.”—కొంచెమాఁగి, “అమ్మయెంత చక్కఁగాఁ జెప్పె ననుకొన్నారు? వాల్మీకిమహర్షి కూడఁ గుశలవుల కంత చక్కఁగాఁ జెప్పినాఁడో లేదో...అమ్మకూడ మామయ్యయొద్దనే చదువుకొన్నదఁట. మామయ్యను మీరెఱుఁగుదురా!”...భారతిప్రశ్న గిరిరావు వినలేదు. భవాని చక్కఁగాఁ జదువుకొన్నదనియే కదా తాను పెండ్లి చేసికొనెను? విధివశముచేఁ దనకు వియోగము సంభవించినది కాని, లేనిచో నామెవలనఁ దానుగూడ నెన్నియో నేర్చుకొనియుండెడివాఁడే! గిరిరావు భవానిరూపము నొక్కమాఱు స్మరించినాఁడు. ఆమెలో వానికిఁ జదువుల సరస్వతి సాక్షాత్కరించినది. వాని హృదయగతమనోభావముల మార్పు ఇంకొకమెట్టు నందుకొనెను.

“మీ యమ్మయొద్దకు వెళ్ళిపో భారతీ!” అని చెప్పి యాతఁడు తన పడకగదిలోనికిఁ బోయినాఁడు. వాని యీ యాకస్మిక చర్యకు వింతనొందుచు భారతి భవానియొద్దకుఁబోయి తమ సంభాషణ సర్వమును జెప్పెను. గిరిరావు మంచముపైఁ బండుకొనెను. పట్టుపరుపులమీఁదఁ దానున్నను వాని కేమో గుచ్చుకొనుచున్నట్లే యున్నది. భారతితల్లి వానికి ప్రమాఁగన్నులోఁ గాన్పించినది. ఆమెముఖములోఁ బ్రశాంతియును గంభీరత్వమును దనయెడ వినయమును దోఁచినవి. గిరిరావు చకితుఁడయ్యెను.—“దేవీ! నిన్ను బాధించితిని. జమీందారిణివైనను నిన్ను నేను సుఖింపనీలేదు. వెఱ్ఱినై నీ వందముగా లేవనుకొంటిని గాని నీ హృదయమును గ్రహింపనైతిని. నీమీఁది యేవ

గింపుతోడనే మనపాపనుగూడ నేనింతవఱకు కాదరింపలేదు. నా తప్పిదమును క్షమింపుము.'' అని గిరిరావనుకొనెను. వానికిఁ దెలివి వచ్చినది. వాని కన్నులనుండి రెండే రెండశ్రుబిందువులు క్రిందికి దిగఁజాఱినవి. ఆ రెండును వానిలోని కళంకము నంతటిని గడిగివేసినవి. గిరిరావు నిష్కళంకచిత్తుఁడయ్యెను, గాని హృదయ మింకను జలించిపోవుచున్నది. వాని పితృహృదయము కదలాడిపోయినది. "భారతి నా చిట్టితల్లి" "భారతి నా చిట్టితల్లి" అని యాతఁడు రెండు మూఁడుసారులు పైకి ననుకొనినాఁడు. ఆమె నెత్తి ముద్దాడువఱకును వాని హృదయ మాఁగినదికాదు. లేచి కూర్చుండుటకుఁ బ్రయత్నించెను. కాని హృదయభారముతో లేవలేకపోయి సగము లేచి వెనుకకుఁ బడిపోయినాఁడు.

భారతితోఁ గొంత ప్రశాంతచిత్తముతోఁ దన భర్త మాట్లాడుటను దలంచుకొని భవాని తన తపస్సు ఫలించినదని యానందపడినది. ఆ యానందముతో భారతిని ముద్దుపెట్టుకొని మురిసిపోయినది. ఈ సంతోషములో నామె భర్తకు మందొసంగువేళ యైనదనికూడ మఱచిపోయెను. ఇంతలో గిరిరావు పంపించిన యొక పరిచారిక వచ్చి "అమ్మా! దొరగారు రమ్మనుచున్నా" రని సంభ్రమముతోఁ బల్కెను. వెంటనే భవానిలేచి భర్తకడకు వెడలిపోయెను. "ఎవరు పిల్చినారు? మానాన్నగారా!" అని భారతి యాత్రముతో నడిగెను. పరిచారిక యవునని తలయూఁపెను. భారతి కన్నులలో నానందము వెల్లివిరిసినది.

భవాని వచ్చునప్పటికి గిరిరావు హృదయము మింకను దపనపడుచు వేయుచున్నది. ఆమె మందు నొక గాజుపాత్రలోఁ బోసికొని మంచమునొద్దకు వచ్చెను. గిరిరావు నిమీలితనేత్రములతోఁ గదలకుండఁ బండుకొనియున్నాఁడు. భవాని సవ్వడి చేసినను, ఆతఁడు కదలలేదు. నిదానించి చూచినది. ఏమి చేయుటకును దోఁచక బాధపడుచున్న గిరిరా వట్లనే పండుకొనియుండెను. భర్త నిద్రపోవుచుండె నను నూహతో భవాని మందును దాఁచినది. ఆనాఁడు కొంచె ముక్కపోఁతగా నుండుటచే భర్త సుఖముగా నిద్రపోవలెనన్న యూహతో నామె వీవనతో వానికిఁ గొంతసేపు విసిరెను. ఆతఁడు నిద్ర పోయినట్లున్నాఁడు. ఆమె లేచి భర్తపాదములయొద్దకుఁబోయి నమస్కరించినది. భర్తకుఁ ద్వరలోఁ బూర్తియారోగ్య మిమ్మని కృష్ణదేవుని బ్రార్థించుకొన్నది. భవాని మంచము నొద్ద మోఁకరిల్లి మెల్లగ భర్తపాదములపై వ్రాలినది. గిరిరావు పాదము లామె వక్షమునకుఁ దగిలినవి. ఆమెకుఁ బులకలును, భర్త లేచునేమో యన్న భయము నొక్కమాఱే కలిగినవి.

"భవానీ!......"అని రుద్ధకంఠముతో గిరిరావు పిల్చినాఁడు. భవాని యులికిపడి తలెత్తినది. "భవానీ!" అని యాతఁడు చేతులు సాచినాఁడు. ఆమె లేచి వానిని జూచినది. ఆతఁడు నిద్రపోవుటయే లేదు. ఎడతెగని కన్నీటిధారతో దుఃఖించుచున్నాఁ డని యామె గ్రహించినది. ఆమె భయపడి పోయెను. భర్తచాఁచిన చేతులను మెల్లగఁబట్టుకొని యామె

వాని తలనైపునకు వచ్చినది. దుఃఖము నాఁపుకొని గిరిరావిట్లు చెప్పినాఁడు :

"భవానీ! నీవు మహాత్మురాలవుకాని సామాన్యవు కాదు. నేను విషయాసక్తుఁడను. నిజానకు నిన్ను విషయతృప్తికే వివాహమాడితిని. నీ మహత్తరమగు సేవలో నా తుచ్ఛ భావములు క్షాళితమైపోయినవి. నిన్నటినుండియు నేను పడిన బాధ కంతులేకపోయినది... సగము చెప్పి గిరిరావాఁగెను. భవాని హృదయము దడదడ కొట్టుకొన్నది. "ప్రభూ! మీ యారోగ్యము బాగుండలేదు. మనోదైన్యము శరీరమును గోలు కోనీదు. నా యందు దయయుంచి, మీరు చింతను విడిచి నిర్మలముగానుండుఁడు." అని యామె కోరెను. గిరిరావు మరలఁ జెప్పనారంభించినాఁడు. "......భవానీ! నీ హృద యము నా కవగాహనమైనది. నీభర్తనయినందులకు నేను ధన్యుఁడను. నీవు సేవించుచుండ నా కారోగ్యము లేకపోవుట యెట్లు? నీ యమృతహస్తములతో నా యెద నొక్కసారి నిమురుము. పశ్చాత్తాపాగ్నిదగ్ధుఁడనగుచున్న నేను శీతల చిత్తుఁడ నగుదును......"

గిరిరా వింకను నేదియో చెప్పఁదలంచెను. భవాని వానిని దాఁకినది. వానిలో నూత్నచైతన్యము వచ్చెను. ఆమె వానిహృదయముపైఁ జేయివేసినది. ఆతఁడు స్వర్గ సౌఖ్యము ననుభవించినాఁడు. ఆమె వానిని బూర్తిగాఁ గౌఁగిలి లోనికిఁ దీసికొనెను. ఆతఁడు మైమఱచెను. పాణిగ్రహణ

సమయమునందును, ఆమె రామగిరికివచ్చిన ప్రథమదివసము నను, అప్పుడప్పుడామె మందు త్రాగించు నవసరములందును దానామెను దాఁకియుండెను. కాని యాసమయములలో భవాని స్పర్శ వాని కింత హాయి నిచ్చిన దా? లేదు. నిన్నటినుండియు నాతఁడు గావించిన తపస్సు ఫలిత మిది. ఆతఁడు నిర్మలుఁ డగుటచేతనే భవానిస్పర్శ వానికంత సుఖము నిచ్చినది. భవానియు గిరిరావుస్పర్శలో నింతవఱ కననుభూతమైన యొక మహానందము ననుభవించినది.

కొంతవడికి గిరిరావు "చిట్టితల్లి యెక్కడ?" అని భవాని నడిగెను. "తీసికొని వత్తును స్వామీ!" అని భవాని భర్తను మెల్లఁగాఁ బరుండఁబెట్టి గదియావలికి వచ్చెను. భారతిని బెంచిన దాది యెదురువచ్చినది. "భారతిని దండ్రిగారు పిలుచుచున్నారు. తీసికొనిర" మ్మని భవాని యామెతోఁ జెప్పెను. ఆ ముసలిది యొక్కదూఁకునఁ బోయి భారతి నెత్తుకొని ముద్దాడినది. "ఈ సంభ్రమ మేమి" యని భారతి యడిగెను. నాన్నగారు నిన్ను దీసికొనిరమ్మన్నారు..." అని యామె సంభ్రమమునఁ బలుకనేరక పలికెను. "మా నాన్నగారే? నిజమే?" అనుచు నామె బయలుదేరెను. ఒక పూజ్యురాలి బిడ్డయై, ఒక తపస్వినిచేఁ బెంపఁబడిన భారతి యా యిరువురి గుణములను బుణికిపుచ్చుకొన్నది. ఆమె తండ్రి యొద్దకు వచ్చెను. ఆ యిరువురి మూర్తులను గిరిరావామెలోఁ జూచెను. "చిట్టితల్లీ!" యనుచు నాతఁడు భారతిశిరమును

దనివిదీఱ ముద్దాడినాఁడు. వాని పితృహృదయము కట్టలు తెగినట్లైనది. కనులనుండి యానందాశ్రువులు ప్రవహించినవి. భారతికిఁ బునర్జన్మ మెత్తినట్లున్నది.

"భారతీ! నిజముగా నీవు భారతివే యగుదువమ్మా!" అని తండ్రి యింకను ముద్దాడెను. భవాని పరవశయైనది. ముసలిదాది యానందస్వాంతయై నిలఁబడెను. ఆమె కంతకంటె నేమికావలెను ?

"భవానీ! నా పుత్రికను మరల నాకొసఁగినావు. ఇట్టి మహోపకారిణివి. నిన్ను నేను బాధపెట్టుటతప్ప సుఖింపనీలేదు. సంస్కారవంతురాల వగు నిన్ను నాదరింపక యొక మూల పడవేసితిని. నన్ను క్షమించినచో నా హృదయమున శాంతి సందఁగలదు." భవాని భర్తనిఁక మాటాడనీలేదు. "స్వామీ! నేను మీ చరణదాసిని ......" అని మాత్ర మామె యన్నది. అంతలి నిగూఢార్థమును గిరిరావు గ్రహించెను. అతఁడు సంతృప్తినందినాఁడు.

విజయుని కిప్పుడేడవయేఁడు వచ్చినది. ఏండ్లు మీఱిన కొలఁది వానియల్లరి మితిమీఱెను. చెప్పినమాట వినుట నాతఁ డెఱుఁగఁడు. వానిపోకయే వానిది. ఆతఁ డెక్కువ కాలము చంద్రా కేశవులతో గడిపెడివాఁడు. చంద్ర యింటిపని లేమేని చేసికొనుచున్నచో నామె వెనువెంటఁ దిరుగుచు నవియు, నివియుఁ గాలుమాలుగాఁ జక్కఁబెట్టుచుండును. ఉదయముననే రజనీకుమారి వాసిచేఁ గాలకృత్యములను నిర్వర్తింపఁ

జేయును. వెన్వెంటనే యతఁడు తల్లియొద్దకుఁ బరుగిడును. చంద్ర వానిని లాలించి యన్నమును దినిపించును. తరువాత విజయుఁడు కేశవునితోఁ బొలములకుఁ బోవును. విజయు డింకను అన్నమును దినకమునుపే కేశవుఁడు పొలమునకు వెళ్ళిపోయినచో విజయుఁడొక్కఁడే కేశవుఁడున్నయెడకే సాహాయ్యమును లేకయే వెళ్ళును. ప్రొద్దు తిరుగుచున్న దనఁగా నిరువురు నింటికి వచ్చి భుజింతురు.

వారు వచ్చునప్పటికి రజనీకుమారి సౌధమున కంటియున్న క్రిందిచావడిలోఁ గూర్చుండి వీణెయపైఁ బాడుచుండును. ఈశ్వరమ్మగారు పాటల నొకింతసేపు విని యొక కునుకును దీయుచుందురు. విజయుఁడు వచ్చినంతనే రజనీకుమారి వానితోఁ గలిసి మేడమీఁదనున్న రాయలగదిలోనికిఁ బోవును. రాయ లాసమయమున నేదేని వ్రాసికొనుచుండును. లేదా చదువుకొనుచుండును. ఆతఁడు కుమారుని జేరఁబిల్చి యుఁదయమునుండియు నేమిచేయుచున్నా” వని యడుగును. విజయుఁడు తండ్రితో నెన్నియో మూఁగపలుకులను జెప్పెడివాఁడు. పలుకఁబూఁబోఁడి జిహ్వాగ్రమునఁ దాండవముచేయు మహాకవి కృష్ణరాయలు కుమారుని యాచిన్న మూఁగపలుకులకే బ్రహ్మానంద మందెడివాఁడు. మొదటిరోజులలోఁ గుమారుఁ డిట్లయ్యెనే యని యాతఁడు విచారించెడివాఁడు కాని క్రమక్రమముగా వానికి విజయుఁడన్నచో మిక్కుటమగు ప్రేమ యేర్పడినది. విజయుఁ డొక కారణజన్ముఁడనియు, వానిసేవ

వలనఁ దమజీవితములకుఁ బ్రశాంతి చేకూరుననియు నాదంప తులు తలంచిరి.

సాయంకాలమున విజయుఁడు తండ్రితో నుద్యానవన విహారమున కేఁగును. రాయలు కుమారునితోఁ బ్రశాంత స్థలములందుఁ గూర్చుండి మూఁగభాషలో వానికిఁ బ్రకృతి సౌందర్యములను విశద మొనర్చుచుండెడివాఁడు. విజయుఁడు చిలిపిచూపులతో నంటియునంటనట్లు వానిని బరికించుచుండును. గోదావరిలో నిరువురును జీఁకటిపడుచుండగా స్నాన మాచరించి యింటి కేఁగుదురు. నీటిలో నడుగిడినంతనే విజయుని కొడలు పుల్కరించును. పిచ్చియానందమున నీటిలోఁ గూర్చుండి తెప తెపఁ గొట్టుకొనును. రాయలు నీటిపైఁ దేలి పద్మాసనము వేసి యోగాభ్యాసమును జేయుచుండును. అంతకాలము నల్లరి మాని విజయుఁడు శ్రద్ధాభక్తులతో నొడ్డునఁ గూర్చుండి తాను ఓంకారమును జపించెడివాఁడు. సాయంకాల మట్లు స్నాన మాచరించు టాలస్యమైనచో విజయునకుఁ బిచ్చి యెత్తినటు లుండును.

రాత్రి భోజనానంతరము విజయుఁడు తాతగారియొద్దను, నాయనమ్మయొద్దను గూర్చుండి చాలసేపు మాట్లాడును. వారిరు వురును మనుమఁడన్నఁ జాల మక్కువగా నుందురు. భోజ నానంతర మిల్లు చక్కఁబెట్టుకొని తోడికోడలు నిదురింపనేఁగిన తరువాత రజనీకుమారి మేడమీఁదికి వచ్చెడిది. వెన్నెల రాత్రులందు రజనీకుమారియును కృష్ణరాయలును గుమారు

నితోఁ గలిసి సౌధమునకు వెనుకనున్న కృత్రిమసరస్సుకడకుఁ బోవుదురు.

విజయుఁడు మకరందసంపాదులగు భృంగములతోఁ బాటు చెట్టుచెట్టునకుఁ దిరిగి పుష్పసౌరభముచే మైకము నొందుచుండును. రాయల మనస్సు సరస్సులోని చంద్రబింబము వలె ప్రకృతిశృంగారమును గాంచి యల్లలనాడిపోవును. రజని సన్నని గొంతుకతో నిశ్వాసమునకు దోహద మొనర్చెడిది. ప్రకృతిసౌందర్య పిపాసువులగు నాముగ్వురొకొక్కనాఁ డట్లు చాలసేపు కూర్చుండిపోయెడివారు. విజయుఁడు పువ్వుపువ్వునకుఁ దిరిగి మృదంగమత్తునివలెఁ దల్లిదండ్రుల దరికి వచ్చును. అప్పుడు మువ్వురును గలిసి మేడమీఁదికిఁ బోదురు.

ఇట్లు రజనీకుమారికిని, రాయలకు నెక్కువ కాలము కుమారునితోఁ బ్రొద్దుపోయెడిది. క్రమముగా వారు వేదనావిముక్తులైనారు. ఎప్పుడో యొకప్పు డాకస్మికముగాఁ దాము విశ్వశ్రేయమునకై రంగస్థలమును బ్రవేశింప వలసివచ్చుననియు నందులకై శక్తిని, ధైర్యమును బెంపొందింపఁజేసికొనుటయే తమ కర్తవ్య మనియు వారొక నిశ్చయమునకు వచ్చిరి.

## 11

గోదావరి మహానదికి గౌతమి యని వేఱొక పేరున్నది. ఇప్పటి గోష్పాదక్షేత్ర ప్రదేశములోఁ బూర్వము గౌతమ

మహర్షి తపస్సుచేసికొనుచుండెడివాఁడు. ఒక మహాకాటకములోఁ దిండి దొఱకక తత్ప్రాంతవాసులగు మునులందఱు గౌతమాశ్రమమునకు వచ్చిపడిరి. గౌతముఁడును వారి నందఱు నాదరించి తన తపోబలమువలన నీవారధాన్యము నేనాఁటి కానాఁడే పండించి వారి కందఱకును సమృద్ధిగా నాహారమును సమకూర్చుచుండెను.

ఇట్లుండఁగా నొకనాఁడొక యావు మందలోనుండి తప్పివచ్చి పైరంతయుఁ దినివేసెను. ఇఁక మునులందఱు నాఁటికిఁ బస్తుండవలసినదే...కోపమున గౌతముఁడా యావు నొక గడ్డిపోఁచతో నదలించెను. అంతమాత్రముననే యా యావు క్రిందఁబడి విలవిలఁదన్నుకొని ప్రాణములు వీడెను. గోహత్య చేసితివి కాన నీ యాశ్రమమున నుండనొల్లమని మునులెల్లఁ గట్టుగా లేచిపోయినారు. గోహత్యాపాపము తనకుఁ జుట్టుకొనినందులకు విచారించి గౌతముఁడు శివుని గూర్చి గొప్ప తపము కావించెను. ఆ పరమశివుఁడు తన జటాజూటమునుండి గోదావరిని విడిచిపెట్టెను. గౌతముఁడా నదిని దన వెంటఁ గొనివచ్చి యావు చనిపోయిన ప్రదేశము మీఁదుగాఁ బ్రవహింపఁజేసి పాపవిముక్తుఁడైనాఁడు.

గౌతముఁడు తీసికొనివచ్చుటవలన నానది గౌతమి యైనది. ఆప్రదేశము గోష్పాదక్షేత్రమైనది. ఒక గోవు పేరి మీఁదుగా నింత పని జరుగుటచేఁ బ్రక్కనేయున్న గ్రామమునకు గోవూరను పేరువచ్చెను. గోహత్యాపాపమును క్షాళి

తముచేయఁగల పవిత్రత యా నదికిని, యా ప్రదేశమునకు నున్నది. అట్టి గోదావరీ నదీతీరమున, నా గోష్పాదక్షేత్రమునకు మూఁడు క్రోసులు యెగువను కుమారదేవ మున్నది. ఒక్క గోహత్య చేసినందులకే—అదియును హఠాత్సంభవము—కుమిలిపోయి గౌతముఁ డొక మహానది నావిర్భవింపఁ జేసినాఁడే! నేఁడు జరుగుచున్న గోహత్యాపాపములు ప్రపంచమంతయును సముద్రమయమైపోయినఁగాని క్షాళితము కావు కాఁబోలు!

తెల్లవారల యాహారమునకై పశువులను గుత్తగాఁ గొనుటకుఁ గుమారదేవమునకువచ్చిన నల్లదొరగా రదేపోకను బోయిరికాని, యట్టివారే చాలమంది కుమారదేవమునకుఁ జుట్టుపట్టులనున్న గ్రామములందుఁ బ్రవేశించి సఫలులైరి. రామయ్యగారి కుటుంబములోని వారివలె నుదాత్తులైనవా రా గ్రామములందు లేకపోవుటచే నా వ్యాపారము నరికట్టువారు లేరైరి. రాయలును కేశవుఁడును నీవిషయమును విని చాల బాధపడినారు. చాలఁగాలమునుండి యధర్మభయము వేరులు నాటియున్న కుమారదేవములోనే యత్యాచారములు మొలకెత్తుచుండఁ దక్కినవాని గతియేమి?

కేశవుఁడు నడుముకట్టుకొని గోసేవచేయువాఁడేకాని, యా యావశ్యకమునందఱకును బోధించి చేయింపశక్తిగలవాఁడు కాఁడు. ఆవిషయములో రాయలే సమర్థుఁడు. కేశవునిజీవితము సేవకును, రాయల జీవితము బోధనకు నేర్పాటైయున్నవి.

చంద్రయు, రజనియు నాయా కార్యములం దాయిరువురకును తోడ్పడుదురు. కాని సాహిత్యాచార్యుఁడైన యన్నగారీపని కొప్పుకొనఁడేమో యని కేశవుఁడు సందేహించినాఁడు. ఊరూరు దిరిగి గోమాహాత్మ్యమును గూర్చి యుపన్యసింప వలసినదని తా నన్నగారి నడుగుటకే వానికి ధైర్యము చాల లేదు. రాయలు తానై రంగమును బ్రవేశించుట కాలోచించు చుండెను.

ఇట్లుండగా వర్షర్తువు వచ్చెను. పెక్కుచోట్ల కుంభవృష్టి గురిసినది. గోదావరి వఱద లపరిమితముగా వచ్చి యొడ్డుననున్న యూళ్ళన్నియు నూటవేసెను. కుమారదేవమున నెచ్చటఁ జూచినను నీరు కాలువలై ప్రవహించినది. ఇందులకుఁదోడు పశువులలో నకస్మాత్తుగా జబ్బులు ప్రవేశించినవి. చూడ ముచ్చటయగు పశుసంతతి జబ్బులతో శల్యావశిష్టమయ్యెను. పశువులు కింక, దొమ్మ మొదలైన జబ్బులు తగిలి నిలుచున్నపాటునఁ జనిపోసాఁగినవి. మాంసవ్యాపారము వలననే పశుసంతతి తగ్గిపోవుచున్నదని కుఁదుచుండఁగాఁ గఱవులో నధికమాసము వచ్చినట్లయినది. ఊరిలో నారోగ్యవిషయములందును శ్రద్ధ తక్కువయ్యెను. జబ్బులు తగిలినవానికిఁ దగినవైద్యము చేయుటలోఁగాని, చనిపోయిన వానిని దూరముగాఁ బాతిపెట్టుటలోఁగాని గ్రామవాసులు శ్రద్ధ వహింపలేకపోయినారు — గ్రామమంతయు నూటతో నిండియుండుట వలన.

కేశవుఁడు పశువుల జబ్బులకు వలసిన మందుల నెట్లో సేకరించి యూరిలో జబ్బుతగిలిన పశువు లన్నిటికిని మందు లీయ నారంభించెను. రాయ లీ బీభత్సమునంతటిని గాంచి దుఃఖించినాఁడు. తమ్ముని యనుపమానమగు గోసేవను ప్రశంసించి తానును రైతుం కుత్సాహము నొసంగసాఁగెను. ఇంతలో, కేశవుని పడమటావునకును దొమ్మ తగిలినది. దాని పాలు త్రావుటచే దూడకుఁగూడ జబ్బుతగిలెను. దాని జబ్బును మళ్ళించుటకై కేశవుఁడును దన యావచ్ఛక్తి నుపయోగించెను. భర్తకుఁ జంద్ర సర్వవిధములఁ దోడుపడి గోతతికి మరల కళఁ దేరఁ బ్రయత్నించెను. కాని వారి కష్టము ఫలింపలేదు.

జబ్బు తగిలిన మఱునాఁటి రాత్రి పడమటావు గిజగిజఁ దన్నుకొన మొదలిడెను. 'దొమ్మ' దొంగరోగము. అది తగిలిన పశువు నశించుటయే కాని బ్రతికి బైటపడుటలేదు. మొదటిజాము దాఁటినది. తీతువు మరల నా వేపకొమ్మపైఁ జేరెను. దాని మొదటి యఱపునకుఁ బడమటా వదిరిపడెను. కేశవాదులు తీతువును బెదరఁగొట్టగా నది భయంకరముగఁ "దీ, తీ" యని యఱచుచు నెగిరిపోయినది. కేశవుఁడు తిరిగి చూచునప్పటికిఁ బడమటావు చచ్చిపడియున్నది. కేశవుఁడు ముద్దవలెఁ గూలఁబడిపోయినాఁడు. ఆతఁ డారాత్రి గోశవముపైఁ బడి పిల్లవానివగిది నేడ్చెను. మఱునాఁ డుదయమున గోశవము నొక నిర్మలప్రదేశమున భూస్థాపిత మొనర్చి దానిపైఁ

దులసికోటను గట్టించినారు. పడమటావున కంత్యక్రియలు గావించి జ్వరముతోఁ గేశవుఁడింటికి వచ్చెను.

అంతివఱకు ధైర్యము వహించియున్న కేశవుఁడు తన ప్రాణమగు పడమటావు చావగాఁ గ్రుంగిపోయినాఁడు. మరల నాతఁడు లేచి తిరుగలేను. గుండె బరువెక్కినవి. పిచ్చిచూపు పడెను. తాను లేవలేనిస్థితిలో నుండుటచేఁ జిట్టిని (పడమటావుదూడను) సంరక్షింపుమని చంద్రను నియోగించెను.

రాయలు కేశవుని కుపచారములుచేయ మొదలిడినాఁడు. రాయలు తన సంరక్షణకు దొరకొనుటను జూచి కేశవుని కేమో కొండంత బలము వచ్చినది. రెండురోజుల తరువాతఁ జిట్టి కూడఁ బ్రాణము వీడినది. జ్వరపుమైకములోనున్న కేశవుఁడు "చంద్రా! చిట్టి యెట్లున్నది!" అని తనయొద్దకువచ్చిన చంద్రను బ్రశ్నించెను. చంద్ర కనుల నీరు నింపుచు నిలిచినది. "చిట్టి" వెళ్ళిపోయినదని యాతఁడు గ్రహించినాఁడు. ఈశ్వరమ్మగారు వచ్చి కుమారుని నుదురు దడవిరి.

"అమ్మా! ఆనాఁడు నన్నడిగినావు—చిన్నా! ఏదియో కలతఁబొందినట్లున్నావే!" యని—"కుమారదేవమున గోవుల కేదియో యాపద రానున్నది. ఇఁక నాకీభాగ్యము కలుగదేమో" అని నే నంటిని. "అంతపనియు నైనదమ్మా!" అని కేశవుఁడు తల్లితోఁ జెప్పినాఁడు. ఈశ్వరమ్మగారు కుమారుని యావేదన గ్రహించిరి. ఆమెకు దుఃఖము పొంగివచ్చెను.

కాని ధీరురాలు కాన లోననే యడంచుకొనెను. రామయ్య
గారు కుమారునితో మాట్లాడనే లేకపోయిరి.

రాయలు తన తమ్ముని బాధకుఁ గరఁగిపోయినాఁడు. తానేమియును జేయక నింటఁ గూర్చుండుట కంటెఁ దమ్మునితోఁ గలిసి గోసేవచేయుచుఁ, బశుతతియుత్కృష్టతకై పాటుబడుట మంచిదికాదా యని తర్కించుకొనినాఁడు. తమ్ముని ధైర్యమిప్పుడు విచ్ఛిన్నమైపోయినది. ఈ సమయములోఁ దాను చేయూఁత నిచ్చుచో మరల నాతఁడుకోలుకొని గోసేవకై తన జీవితసర్వస్వమును వినియోగింపఁగలఁడు... ఒక నిర్ణయమునకు వచ్చి రాయలు రజనీకుమారి సాహాయ్యమునుగూడ నపేక్షించెను. ఆమె సంతోషముతో నొప్పుకొన్నది. రాయలు మహానందముతోఁ దమ్మునియొద్దకువచ్చెను.

"కేశవా!..." అని రాయలు మొట్టమొదటిసారిగాఁ దమ్మునిఁ బిలిచెను. అందఱాశ్చర్యముతో వానిని జూచిరి. కేశవుని దాపునకు రాయలు వచ్చెను. "కేశవా!" అని యాతఁడు తమ్మునిచేయి పట్టుకొనెను. విస్మయముతోఁ గేశవుఁడు రాయలను బరికించెను.

"కేశవా!...గోసేవయే గోవిందుని సేవ యని నమ్మియున్న నీ జీవితములో నొక చిన్నయడ్డు వచ్చిపడినది. అందులకు నీ వధైర్యము నొందవలదు. నీకు నాపూర్తిసాహాయ్యము నొసంగుదును. మన మిరువురమును గలిసి పశుతతిని మరల నున్నత స్థితికిఁ గొనివత్తము. నీవు ధైర్యము నొందితివా,

త్వరలోఁ గోలుకొనఁగలవు..." అని రాయలు కేశవునిచేతిలోఁ జేయివేసి చెప్పెను. "అన్నా! నేను ధన్యుఁడను. నే నింక విజయమందినట్లే" అని యాతఁ డానంద బాష్పములు రాల్చెను.

ఊరిలో జబ్బులు ప్రవేశించినప్పటినుండియుఁ గేశవుఁడు గోసేవలో నిమగ్నుడై యుండుటచే విజయుఁడు పొలములకుఁ బోవుటకు వీలులేకపోయినది. గోదావరి మంచి వఱదలమీఁద నుండుటచే గోదావరినదిలో స్నానముకూడ నాఁగిపోయెను. వానికిఁ బరిస్థితు లెవ్వియును బోధపడలేదు. సర్వ మయో మయముగా నున్నది. క్రమముగా నాతని దినచర్య మారి పోయెను. ప్రొద్దుటిపూఁట నన్నము తినుట మానివేసినాఁడు. చాల నాలస్యముగా నిదుర లేచును. లేచుటయే తడవుగఁ గాల్యకృత్యములను దీర్చుకొని యుద్యానవనములోనికిఁ బోయెడి వాడు. రెండుజాములు తిరుగువఱకు నే చెట్టు నీడలనో సంచ రించి యింటికిఁ దిరిగివచ్చును.

కుమారుని తిరుగుడును గాంచి రజనియు, రాయలును జాల భయపడిరి. . ఉదయమున నేదియైనఁ దినిపించుటకుఁ జాలఁ బ్రయత్నించిరి. కాని విజయుఁ డలవాటుపడలేదు. గట్టిగ గదిమినచో నేడ్చును. లాలించినచో నసలే వినఁడు. తల్లి దండ్రులకుఁ గుమారుని గూర్చి బెంగపట్టుకొన్నది. చేయు నదిలేక వాని యిష్టము వచ్చినటుల వదలివేసిరి. అయినను ఒక కంట నెల్లప్పుడును వానిని గాచియే యుండిరి. వాని కిష్టముకాని పనిని వా రెన్నఁడును జేయఁదొరకొనలేదు.

విజయుఁడు సాయంసమయమునందు గోదావరియొడ్డు నకువచ్చి నీళ్లలోఁ బాదములుంచి కూర్చుండెడివాఁడు. ఆకసమునఁ దిరుగాడు పక్షులను విజయుఁడు చిత్రముగఁ జూచుచుండును. నీటిపైఁ దేలిన మీనములను, అంతవఱకు నాకసమునఁ బల్టీలుగొట్టుచు నకస్మాత్తుగాఁ గాలంకున్నకొనిపోవు తీతువను జూచి "ప్రపంచ మింతేక దా!" యన్నట్లాతఁడు పకపక నవ్వును. అచ్చటఁ దిరుగాడుచుండు వారి మిత్రములు వారిని జూచి నవ్వినను బెదరును. ఇంక విజయుని నవ్విన కంతేయుండదు. గోజన కోకయూరుచొప్పునఁ బ్రచారము చేసివచ్చిన రాయలును, గేశవుఁడును జీఁకటి పడుచున్నదనగా స్నానార్థము గోదావరికి వత్తురు. అప్పుడు విజయుఁడును వారితో స్నాన మాచరించి యింటికేఁగును.

ఒకనాఁడు రజనీకుమారి విజయుని కూర్చుండఁబెట్టి వాని కక్షరములను నేర్పవలెనని ప్రయత్నించెను. విజయుని కిష్టములేక బలపమును బట్టుకొనుటకూడఁ జేతకానివానివలె నటించెను. రజనికి విసువువచ్చి కోపముతో నొక్కటి వేసినది. అంత ముక్కుమూసికొని నీటిలో మునిఁగిపోయెద నన్నట్లు "యమునా, యమునా" (గోదావరినదిని 'యమునా' యని మూఁగభాషలో నాతఁడనును) యనుచు మూఁడు మునుకలు వేసి రోషమును బట్టఁజాలక విజయుఁ డేడ్చెను. చదువుకొనుచున్న రాయలు వచ్చి, కుమారు నూరుకోఁబెట్టెను. విజయునికి దుఃఖ మెక్కుడైనది. తాతగారు వచ్చి మనుమని

దీసికొనివెళ్ళి లాలించిరి. రజని చాల నొచ్చుకొన్నది. ఆ తండ్రికొడుకులకుఁ గష్టము కలిగియుండునని యామె చాల బాధపడెను. ఇంక నెన్నడును దాను జెయ్యి చేసికొరాదని యామె నిశ్చయించుకొనెను. విజయుని కంత రోష మేల వచ్చినదో రాయ లూహింపలేకపోయినాఁడు. గోదావరినదిలో మునిఁగిపోయెద నన్నట్లాతఁ డేల సంజ్ఞ నొనర్చెనో?...

అనేకములగు నూహాలు రాయుల మనోవీథిని సంచరించి వాని మనస్సును గలఁచివేసినవి. చేతనున్న పుస్తకము నొకచోఁ బాఱవేసి యాతఁడు నిద్రింపఁ బ్రయత్నించెను. రజని రామయ్యగారున్నయెడకు వచ్చినది. అప్పటికి విజయుఁ డింకను నిదురపోలేదు.

"బాబూ! అమ్మ వచ్చినది. నిదురింపఁ బొమ్ము" అని రామయ్యగారు మనుమని బంపివేసిరి. రజని కుమారుని దోడ్కొనివచ్చి మంచముపైఁ బరుండెను. "విజయా! నాపైఁ గోపము వచ్చినదా!" అని యామె కుమారుని లాలించెను. లేదన్నట్లాతఁడు తలఁ ద్రిప్పెను—"మఱి యెందుల కంతగా నేడ్చినావు!" అని రజని మరల నడిగెను. ఆతఁడు సమాధానము జెప్పలేకపోయినాఁడు. మూఁగవాఁడు కానిచో నేమి సమాధానమును జెప్పెడివాఁడో?...తనపైఁ గోపములేదని విజయుఁడు చెప్పుటచే రజని దిగులులేక నిద్రించెను. కాని విజయుఁడు నిద్రింపలేదు. ఉదయమున వాని యెఱ్ఱవాఱిన కన్నులఁ గని రాత్రి యాతఁడు నిద్రింపలేదని తల్లి గ్రహించెను.

కారణము నూహించుకొని తాను పొరపాటుపడిన ట్లామె యెంచెను. రాత్రి యణఁగిపోయిన దిగులు మరల నుబికివచ్చెను. విజయుఁడు యథాప్రకారముగా నాల్గురోజులు సంచరించినాఁడు.

ఆనాఁ డేకాదశి. రాయలును, కేశవుఁడును చాల దూరములందున్న గ్రామములకుఁ బ్రచారము నిమిత్తమై వెళ్ళెడి ప్రయత్నములో నున్నారు. అంతకుఁ బూర్వ మాలస్యముగా లేచుచుండెడి విజయుఁ డానాఁడు పెందలకడనే లేచి కాలకృత్యములను నిర్వర్తించుకొని, తెల్లని యుడుపులను దాల్చి యుద్యానవనములోనికిఁ బోయెను. ఆతఁ డింతకాలము నుండియు గంధపుఁదోఁపుఁగోని కెన్నడును బోలేదు. ఆనాఁ డెట్లాగో గోదావరియొడ్డువెంబడినే నడిచి, మామిడితోఁపును దాఁటి యాతఁడు గంధపుఁ జెట్లను జేరినాఁడు. ఆ ప్రదేశమంతయును గమ్మని వాసనలతో నిండియున్నది.

జిలుఁగుకాంతులను బఱపుచుఁ దెల్లత్రాచు గంధపు మ్రాఁకును జుట్టుకొని విజయునకుఁ గంటఁబడెను. వాని కనులు చిలిపిచూపులతో విలసిల్లినవి. తదేకదీక్షతో నాతఁడు దానిని జూడసాఁగెను. అటనుండి వానికి ముందడుగు పడినదిగాదు. ఆ త్రాఁచు కనపడకపోయినచో నాతఁడల్లంతదూరము నడచి పోయెడివాఁడో?...గొప్ప గొప్ప త్రాఁచులు ప్రాణిహింస నొనఁగూర్చవు. అందువలన నా త్రాఁచు వానిని జూచియు నూరకొన్నది. విజయుఁ డొక చిన్న బెడ్డముక్క నేరి త్రాఁచుపై విసరెను. త్రాచు బుస్సుమనుచుఁ బడగ విప్పి

నది. విజయుఁడు భయపడి వెనుకకుఁ బరువెత్తెను. త్రాఁచు యథారీతిని గంధపుమ్రాఁకును జుట్టుకొని పరుండెను.

విజయుఁడు తిరిగి దగ్గఱకుఁ జేరెను. మరల నింకొక రాయి త్రాఁచుపై విసరెను. వెనుకటివలెనే త్రాఁచు భయపెట్టినది. విజయుఁడు పాఱిపోయి తిరిగివచ్చి యింకొక మాఱటులనే చేసెను. త్రాఁచునకు రోష మెక్కువైనది. పూర్తిగాఁ బడగవిప్పి గంభీరముగ ఫూత్కార మొనర్చెను. ఈసారి విజయుఁడు నిర్భయముగ నిలిచినాఁడు. త్రాఁచుపడగను గంధపుమ్రాఁకునకు వేసి కొట్టుకొనెను. పడగ చితికి రక్తముకాఱెను. మరల నింకొకమాఱు కొట్టుకొనెను. త్రాఁచు ప్రాణము లెగసిపోయినవి. నిశ్చేష్టుఁడై విజయుఁడు చూచుచుండెను.

త్రాఁచు ప్రాణవాయువులు గాలిలోఁగలిసిపోయినంతనే రామయ్యగారి పొలములో నీటిజల పడినచోట నూతినుండి ప్రవాహము వచ్చు టాఁగిపోయినది. అట్లేల నాఁగిపోయెనో కుమారదేవ వాసు లూహింపనే లేకపోయిరి. త్రాఁచు చని పోవుటకును, నీటిజల యాఁగిపోవుటకును గల యాంతరంగిక భావ మేమియో మనకును దురూహ్యము. త్రాఁచుచర్యను గాంచి విజయుఁడు భయపడినాఁడు. వాని తెల్లని యుడుపులపైఁ గూడ రక్తము చిందెను. వెన్వెంటనే యాతఁడు గోదావరి నదిలో స్నానమాచరింపనెంచి మామిడితోఁపున కెదురుగా నున్న రేవులో దిగినాఁడు.

విజయుఁ డింతవఱ కెన్నఁడు నొంటరిగా గోదావరిలో స్నాన మాచరించి యెఱుంగఁడు. ఆనాఁడు—పరధ్యానములో నున్నాఁడేమో— నీటిలో దిగి కమీజును నగమువఱకు విప్పెను. అకస్మాత్తుగా వాని కనులయెదుట రక్తసిక్తమైన పడగతోఁ ద్రాఁచు ప్రత్యక్షమైనది. విజయుఁడు చలించినాఁడు. కాలు జాఱిపోయినది. కమీజు నగమువఱకు విప్పుకొనియుం డుటచే నది చేతుల కడ్డమువచ్చెను. విజయుఁ డేఁక నిలువఁ ద్రొక్కుకొనలేక ప్రవాహముతో సాఁగిపోయెను.

## 12

గోదావరీమహానది నిత్యజీవనది. ప్రత్యేక నదులుగఁ బరిగణింపఁబడతగిన వైన గంగ, వరద, ఇంద్రావతి, శబరి మొదలైన ప్రవాహములు గోదావరి కుపనదు లగుటచే దాని వఱదలు విపరీతముగానుండును. ఆ నీరంతయును వ్యర్థముగ సముద్రమునఁ బడకుండ గోదావరికి దుమ్ముగూడెమునొద్దను, ధవళేశ్వరమునొద్దను రెండానకట్టలు కట్టఁబడినవి. అందువలన నేర్పడినకాల్వల నీటితోఁ బదిలక్షల యెకరములు మొదటి రెండవ పంటలు సాఁగుబడి యగుచున్నవి.

అట్లుపయోగపడిననీరుకాక ప్రతిసంవత్సరము నఱువది లక్షల ఘనపుటడుగుల నీరింకను వ్యర్థముగ సముద్రమునఁ బడు చున్నదని లెక్కలు తేల్పఁబడినవి. కుమారదేవమున కిఱువది మైళ్ళలోనున్న పోలవరమునొద్ద నొక యడ్డకట్టఁగట్టి భద్రా

చాలము మొదలు పోలవరమువఱకు నదినొక ప్రవాదముగా మార్చినచో నిప్పుడు వ్యర్థమగుచున్న నీటితో నది కిఱుప్రక్కల నున్న మెఱక ప్రదేశములకు సులువుగ నీటి సంపాదన జేసి కొన్ని లక్షల యెకరములను సాగుచేయవచ్చును. ఏలనోకో ప్రభుత్వ మింతవఱకు నా విషయమై శ్రద్ధ వహింపలేదు. కాని మరల నిప్పటిప్పుడా యోచనలు తలయెత్తుచున్నవి. ఈ ప్రవాదనిర్మాణము త్వరలోఁ బూర్తికానిచో రాజమహేంద్రవర ప్రాంతముల నదీగర్భమునఁ గ్రమాభివృద్ధి యగుచున్న లంకలు, నిసుక తిప్పలు డెల్టాలసాఁగుబడికే ముప్పు తేఁగలవు.

ఈ ప్రవాదనిర్మాణము జరిగినచోఁ గుమారదేవపుఁ బొలము లన్నియును సాఁగుబడియగును. ప్రజలందఱును దానికై వేచియున్న సమయములో విశ్వనాథుని బుణ్యమా యని రామయ్యగారి పొలములలో నీళ్లజల పడి దాదాపు వెయ్యి యెకరముల ఆయకట్టు, గ్రామమున కేర్పడినది. అందఱును మహానందము ననుభవించిరి. కాని త్రాఁచు చనిపోవుటతో నా జలము నకస్మాత్తుగా నాఁగిపోయెను. ఆ సమయమునకుఁ గేశవుడును, రాయలును గుమారదేవపు గోదావరి రేవులో నొక నల్లదొరగారితో వాదనలలో మున్గియుండిరి.

గోదావరిమీఁదుగా సనుపదారికొఱకై రాజమహేంద్రవరమునుండి గోవూరు వఱకును నంతెనకట్టుచున్న రోజులవి. వఱద లెక్కువగా వచ్చుటచే నచ్చటఁ బనిచేయుచున్న జనము నకును, దక్కిన తెల్లవారికిని మాంసము సర్దుబాటుచేయుదు

నని యీ నల్లదొర పైకము తీసికొని పోలవర ప్రాంతములలోఁ బశువులను గొని మందగాఁ దోలుకొని వచ్చుచుఁ గుమార దేవపుత్రేవులో మకాము చేసినాఁడు. ఊరికి వెళ్ళవలెనని ప్రయాణమగుచున్న రాయలును, గేశవుఁడు నచ్చటికిఁ బరుగెత్తిరి. గోమాంసభక్షణము పాపహేతువనియుఁ దెల్లవారి తిండికై పవిత్రమగు గోవు నమ్మివేయుట యాత్మద్రోహము దేశద్రోహముకూడ నగుననియును రాయలు లా దొరకు బోధించెను. ఆతఁడును మన పూర్వులే గోమాంసమును దినియున్నారనియు, నందుచే నది తప్పుకాదనియు వాదించెను. తుదకు రాయలు తన వాదము నిట్లు ముగించెను—

"గోమాత సాత్త్వికరూపపుముద్ర. యుగయుగముల నుండియుఁ దన సర్వస్వము మానవునికై యర్పించివేసినది. పూర్వులును గోమాంసమును దినియున్నారనుట చేతకాని వాదము. ఏది తన కెక్కువ ప్రీతియో, ఏది యెక్కువ పవిత్రమో దాని నాహుతిచేయుట యజ్ఞమగును. సర్వజ్ఞులైన మహర్షు లట్లొనరించిరి. గోశ్రీకి మూలపీఠముగఁ గామధేనువును బెట్టుకొని వారు గోవును బరమపూజ్య భావముతోఁ జూచిరి. మనకా పవిత్రభావములేదు. ఆ సంస్కారమునులేదు. వారిలో నున్న సర్వగుణములనెడ వైముఖ్యమును జూపి, మనకుఁ గావలసిన యొక్కచోటను వారినుదాహరించినంతమాత్రమున వాదనకు బలము చేకూడదు......

"తృప్తితీరిన తరువాత మనము భుజింపము. ఇంత నీరు గోదావరిలో నున్నదని యంతనీటిని ద్రాగము. మీ కిష్ట మున్నచో నిక్కడ మన ఋషుల నాదర్శముగా గ్రహింపుడు. మిగుల ముగ్గి చెట్లనుండి రాలిపడిన పండ్లనుమాత్రమే తిని వారు బ్రతికిరి. అట్టి మాంసమును దినవలెనని యంతగా బాధ యున్నచో జనిపోయిన వానిని దినరాదా? పారశీక దేశస్థులు శవమును బ్రాణితృప్తికై విడిచిపెట్టివేయుదురట. అది యుత్తమ మార్గము. అట్లు తినుట కిష్టములేనిచో బ్రతికి బలము సంపాదించుకొనుట కాహారపదార్థములే లేవా? ఇట్లంటి వని కూరగాయలను దినుటయు జీవహింసయే యని మీరందు రేమో? అప్పుడిక నరమాంసమును దినుటయును దప్పుగా దని నేను వాదింతును. మీ రొప్పుకొందురా!......" తక్కిన జంతుజాలమంతటిలోను గోవు పరమసాధువు అది మానవుని ప్రాణమిత్రము. ఈ మూగజంతువును గాపాడనినాడు మన దేశమునకును ముక్తిలేదని మీ రెఱుంగవలయును."

ఆనల్లదొరగారు సమాధానమును జెప్పలేకపోయినారు. రాయలవాదమున కంగీకరించి తను పశ్చాత్తాపమును దెలియ పఱచిరి. ఆయన గోవులకై ఖర్చు పెట్టిన ధనమునంతటిని రాయ లును గేశవుడు నింటికడనుండి తెప్పించి యిచ్చివేసి గోవులను దమ పొలములకు దోలిపెట్టిరి. ఈ మహోదార కార్యదీక్షను బరికించి కుమారదేవవాను లాశ్చర్యపడి పోయినారు.

విజయముసాధించి కేశవుఁడును, రాయలు నింటికివచ్చిరి. సౌధప్రాంగణములో నడుగువెట్టునప్పటికి నూతినుండి నీటిజల వచ్చు టూఁగిపోయినదని తెలిసెను. కేశవుఁడు కంగారుగాఁ బొలమువైపు పరుగెత్తెను. నీటిజల యూఁగిపోవుటకుఁ గారణ మూరయలేక రాయలు మేడమీఁదికివచ్చెను. నాఁడుదయముననే యుద్యానవనములోనికిఁ బోయిన విజయుఁ డింతవఱకు నింటికి రాలేదని రజని చెప్పెను. రాయల కాశ్చర్యముమీఁద నాశ్చర్యమును, భయమునుగూడఁ గలిగెను. అతఁ డుద్యానవనములోనికిఁ బోయి వెదకినాఁడు. గోదావరియొద్దు నెక్కి విజయుని గట్టిగాఁ బిలిచినాఁడు. జవాబులేదు. వానికి నదరు కల్గినది. హతాశుఁడై చేయునదిలేక యింటికిఁ దిరిగివచ్చెను. విచారముతోఁ బొలమునుండి వచ్చిన కేశవుఁ డిది విని కొయ్యబారెను. నీటిజల యూఁగిపోవుటను దలంచుకొనుచు రామయ్యగారు వచ్చి "ఉదయమునుండియు విజయుఁడు కన్పింపనే లేదేమమ్మా!" యని యడిగిరి. ఆయనవెంట నీశ్వరమ్మగారును వచ్చిరి. ఈ విషయము తెలిసినంతనే వారి మొగములు వెలవెలఁబోయినవి.

ఆ రాత్రియు, మఱునాఁడును విజయునికొఱకై చుట్టుపట్టుల గ్రామములు, తోఁటలు, పొలములు నన్నియును గాలించివేసినారు. ఎక్కడను విజయుని జాడయైనఁ దెలియలేదు. రామగిరికి, విజయేశ్వరమునకు, విశ్వనాథు నొద్దకును గూడ కొందఱు వెళ్ళివచ్చిరి. భారతీ భవానీ గిరిరావులును,

కుమారమోహన దంపతులును కుమార దేవమునకు వచ్చిరి. భవాని గిరిరావులు తమంత తాము వచ్చుటచే నందఱి యంతరంగముల నానందరేఖ యొకటి నుదయించి బుద్బుదము వలె దుఃఖసముద్రమున మటుమాయమయ్యెను. అందఱకును దుఃఖ మినుమడించినది. రజనీకుమారిదుఃఖమున కంతు లేక పోయెను. తనపైఁ గోపించి విజయుఁ డెచటకేని వెడలిపోయె నేమో యని యామె కుమిలిపోవుచున్నది. భవాని వదినకు ధైర్యము చెప్పెను. ఆమె విజయుని జూడనేలేదు. "బాల పాలకైన వచ్చితిని గాదే" యని బాధపడెను ఆ బాధతో నామె యన్న మొగమును జూడలేక పోయినది.

విశ్వనాథుఁడు బయలుదేరి వచ్చి మాధవీమందిరమును బ్రవేశించెను. అందఱును లేచి నిలువఁబడిరి. విశ్వనాథుని మోమునఁ బ్రశాంతత తాండవించుచున్నది. ఆ మొగమును గాంచినచో నిప్పులు కురియు కేసరియుఁ బిల్లివలె నైపోవును. భరింపరాని దుఃఖముతోఁ గ్రుంగిపోయిన మానిసి నవజీవమును బొందును. వానిని జూచుచు రాయలు, రజనియు మంత్ర ముగ్ధులవలె నైపోయిరి. విశ్వనాథుఁ డందఱను స్తిమితముగఁ గూర్చుండ నియమించెను. శిష్యు లిరువురును గురుపాద ములపైఁబడి తమకుమారుఁ డగుపడునాయని దీనముగఁ బ్రార్థించిరి.

"పుత్రులారా! మనస్సు నచంచలముగఁ జేసికొండు. దుఃఖములు మన కొక్కరికే వచ్చునవికావు. విజ్ఞులైనవారు

దుఃఖముల నధైర్యము చెందకుఁడు. మీ పుత్రునికి కేమియును భయము లేదు. వానికి నీటిగండ మున్నది. అది గడిచి నిన్నక బైటపడును. మరల విజయుఁడు మీకు నవ్యరూపముతోఁ గనపడును." అని విశ్వనాథుఁడు బోధించెను. నీటిగండము మాట విసినంతనే రాయలును, గజలియుఁ గ్రుమ్మిపడిరి. విజయుఁడు "యమున" లో మునిగిపోదు నని చేసినసంజ్ఞ కిది యర్థము కాఁబోలు !

విజయుఁడు నురల కంటఁ బడునని విని యందఱు నమందానంద మొందిరి. అందును నవ్యరూపమును దాల్చు నట!...ఇంతవఱకును బావ యను వానిని జూడని భారతి విజయుఁడు తిరిగి వచ్చునని విని యుత్సాహముతోఁ జిందులు త్రొక్కసది. విశ్వనాథుఁడు భారతిని జూచి యాశ్చర్యపడెను. ఆమెను జేరఁ బిలిచి ముంగురులను త్రేళ్లతో దువ్వుచు "నీ పే రేమి తల్లీ!" యని ప్రశ్నించెను. "భారతి" యని యామె చెప్పెను. విశ్వనాథుఁడును, రాయలు నొకేపరి భారతిని దేఱి పారఁజూచినారు. భారతీయ సంస్కృతి యంతయు నామెలోఁ బ్రతిబింబించి యున్నదని వారు తలంచిరి. "అమ్మా! నీవు నిజముగ భారతివే! అందులకు సందేహము లేదు." అని రాయలు మనస్సులో ననకొనెను. విశ్వనాథుఁడు భవాని వైపుతిరిగి యిట్లు చెప్పినాఁడు: "అమ్మా! భారతి నీ యొక్క భాగ్యమే కాదు. ఆమెను విశ్వభారతినిగా గుర్తింపుము."

భవాని కన్నులలో నానందము వెల్లివిరిసినది. గిరిరావు సంతోషమున నానందబాష్పములు రాల్చెను.

"పుత్రులారా! విజయుఁడు కనబడునంతవఱకు నోపికతో నుండుఁడు. దుఃఖమును దరిఁ జేరనీయవలదు. అమ్మా! రజనీ! నీవు రాయలయొద్ద శ్రద్ధతో సాహిత్యమును జదువుము. కుమారుఁ డంకమున లేనిలోటును నీవు నూఱిచిపోఁగలవు." అని శిష్యులకు విశ్వనాథుఁడు తిరిగి యుపదేశించెను. ఈశ్వరమ్మ గారును, రామయ్యగారు నీ పరిస్థితులకుఁ దట్టుకోలేక పోయిరి. విశ్వనాథుఁడు వారిద్దఱిని దనయాశ్రమమునఁ గొంతకాలము నివసింపఁగోరెను. వా రంగీకరించిరి. కుమారమోహన దంపతులు కూఁతుకు ధైర్యము గఱపి విశ్వనాథునితో వెడలిపోయిరి.

భవాని తన విజయమును రాయలతోఁ జెప్పి తనకా శక్తి వానివలననే వచ్చినదనియు, నందులకుఁ గృతజ్ఞురాల ననియు నామె యన్నను బ్రశంసించెను. భవాని ధైర్యమునకు రాయలు వెఱఁగొందెను. తన చెల్లెలు తనకొక పాఠమును జెప్పెనని యాతఁ డానందించెను. భారతి మేనమామల యొద్దకును, నత్తలయొద్దకును జాలఁజనవుగా వచ్చినది. భారతి యున్న వారమురోజులలోను జంద్రకు విజయుఁడులేని లోటు కన్పింపలేదు. గిరిరావుబాబు బావగార్లతోఁ జాలఁజనవుగాఁ బ్రవర్తించినాఁడు. కొమరితె కాఁపురము కుదుటఁ బడిన దని యీశ్వరమ్మగారును, రామయ్యగారును మనస్సులో మహానందమందిరి. ఒక వారమురోజులు గిరిరావుబాబు కుమార

దేవమునందుండి భారతీ భవానులతో రామగిరి వెళ్ళిపోయెను. వెళ్ళుచు "వదినా! త్వరలో విజయునితోడనున్న నిన్ను జూడఁగలనని యాశించుచున్నాను" అని భవాని రజనీకుమారి తోఁజెప్పెను. ఆనాఁడే యీశ్వరమ్మగారును, రామయ్య గారును విశ్వనాథాశ్రమమున కేఁగిరి.

కుమార దేవమున జబ్బులు ప్రవేశించి గోతతిని హాని గూర్చినవి. వరిచేలు చాల బాగుగా నాటినవనుకొనుచున్న సమయములో నీటిజల వచ్చి కాఁగిపోవుటచేఁ బంటంతయును మాఁడిపోయెను. దీనితో రైతులు హాహాకారము నొనర్చిరి. కొట్లలో నిలువయున్న ధాన్యము నంతటిని కేశవుఁడు రైతులకుఁ బంచిపెట్టించెను. జబ్బులచే నావులు చనిపోయిన పేద రైతులకు రాయలు తాము నల్లదొరగారియొద్దకొన్న యావులను నసముగాఁబంచి వానిని వారివశము చేసినాఁడు. దీనితో రైతులందఱు నాయన్నదమ్ములకుఁ గృతజ్ఞులైరి. మరలఁ దమ ప్రాచీన ధర్మములను బునరుద్ధరించుటకు వారు పూనుకొనిరి.

మాగాణి వ్యవసాయమున కిప్పుడు స్వస్తిచెప్పఁ బడెను. కేశవుఁడు తమ పొలములో నక్కడక్కడ నూతులను ద్రవ్వించి, మోటలతో నీరుదోడించి యన్నిరకముల పంట లను బండించుటకుఁ బ్రయత్నములు చేయసాఁగెను. గోదావరి నదీతీరస్థము లగుటచే నూతులలో జల చాలఁ బైనే పడు చుండెను. తక్కిన రైతులుకూడ నీపద్ధతినే యనుసరించిరి. మిరపచేలకాలము వచ్చునప్పటికి నూతులు పూర్తియైనవి.

అందఱును జాలవలతకు మిరపప్పెరే వేసినారు. చేలు బాగుగా నాటినవి. చంద్ర యోపికతో నుత్సాహముతో నూరల గోసంరక్షణ భారము వహించినది. కాని యామెకు విజయుఁ డిప్పుడు కూడ లేకపోవుటచేఁ బూర్వమంత చుఱుకుఁదనము లేకపోయినది.

రజనీకుమారి దీక్షతో సాహిత్యమును జదువ మొదలిడెను. రాయలు వీణ నేర్చుకొందు నన్నాఁడు. రజని రాయలకు గురుత్వమును వహించినది. సాహిత్యములో రాయలు రజనికి గురువు. సాయంకాలములం దిరువురు నుద్యానవనము లోనికి బోదురు. ఇప్పుడు కృతకసరస్సు ఎండిపోయినది. ఉద్యానవనములోఁ గూడ నచ్చటచ్చట మోతులుత్రవ్వఁబడెను. రాయలు నీరుతోడును. రజని బోదెలవెంట నీరు కొంపోయి పూలచెట్లకుఁ బెట్టుచుండును. పిమ్మట నిరువురును గోదావరిలో స్నానమాచరింతురు. గోదావరి కంటఁబడఁగనే రజనీకుమారి గుండె జల్లుమనును. రాయలు దీర్ఘనిశ్వాసము విడుచును. మరల విజయుఁ డెన్నఁడు కంటఁబడునో?...

గృహభారమంతటిని జంద్రాకేశవులు వహించుటచే రజనికి రాయలకు నింటిపనులతో నిమిత్తము లేకపోయినది. పూర్వము విశ్వనాథాశ్రమమునఁ దాముగడిపిన వినిర్మల స్వేచ్ఛామయ జీవితములను వారిప్పు డనుకరించుచుండిరి. నాఁటికిని నేఁటికిని భేదము గురుదేవుఁడు వెంటలేఁడు. నాఁటివి యాశాపూరిత ప్రేమోదయ దివసములు. ఇంచుమించుగ శరీ

హైక్యములకుఁ దపాతపావడిన రోజులవి. ఇవి యాత్మైక్యమునకుఁ దపస్సుచేయు రోజులు. ఆప్రేమ స్వసుఖమునకు దారి తీసినది. ఈయైక్యము విశ్వమానవకళ్యాణమును బోధించు దోహదకారణము.

విజయుఁడు గోదావరిలోఁ బడిపోవు నప్పటికి రజనీ కుమారి రెండు నెలల గర్భవతి. ఇప్పుడైదవనెల దాఁటినది. ఒక నాఁటి సాయంకాలమున నిరువురును గంధపుఁదోఁపులోనికిఁ బోయిరి. మామిడితోఁపులోని చాఁవృక్షములు పెద్దవై పడి పోయినవి. గంధపుఁ జెట్లును జాల గుబురుగాఁ బెరిగిపోయినవి. పూర్వము తాము పేళ్లను జెక్కిన గంధపుఁజెట్టు మొదట ద్రాఁచుయొక్క యస్థిపంజరము వారికిఁ గన్పించెను.

"రజనీ! మన కాఁగిలి స్థిరముగానుండుటకుఁ బూఁటకాఁపైన ద్రాఁచు చనిపోయినదిసుమా!" అని రాయలు హృదయ భారముతో నన్నాఁడు. రజనికిఁ బూర్వము తానన్నమాట జ్ఞప్తికి వచ్చెను.

"ఈద్రాఁచు చనిపోవుటయు, మన విజయుఁడు కనపడక పోవుటయు నొకే సమయమున జరిగియుండుననుకొందును." అని రజని యనెను. రాయలు తలయూఁపెను. అనుమానముతో వారు గంధపుద్రాఁకను వెదకినారు. ఎక్కడను దాము చెక్కిన పేళ్లు కన్పడలేదు. ద్రాఁనంతయును బాగుగాఁ బెరిగిపోయి యుండుటచేఁ బై బెరడు కలిసిపోయినది. ఆవిషయము వారి గుర్తునకు రాలేదు. ఇరువురి మనములలో

నేవియో చెప్పరాని భావములు ప్రవేశించినవి. త్రాఁచుతోఁ బాటు తమ యైక్యమును నశించిపోదుకదా!...

నిశ్శబ్దముగ నిరువురును గోదావరిలో స్నానమాచరింప కయే యింటికిఁ దిరిగివచ్చిరి. అదిచూచి చంద్రాకేశవులు భయమందిరి. ఆ రాత్రి వారికన్నము రుచింపలేదు. వెఱ్ఱిమొఱ్ఱి యాలోచనలతోఁ బండుకొనిరి. నగమురాత్రి గడచెను. రాయలు నిద్రించెనేమోయని రజని యటు చూచెను. రజని నిద్రించెనేమోయని రాయ లిటుచూచెను. మరల నిరువురును గనులు మూసికొనిరి. ఉదయముననే రాయలు ప్రార్థనచేసెను. రాత్రి నిదురపట్టక యల్లిన పద్యము నొకదానిని రజని బిగ్గరగాఁ జదివినది. ఆచార్యుఁడగు రాయలు "రజనీ! అందుఁదప్పు లున్న"వనెను. "లే" వన్నది రజని. ఆమెను దిరిగి చదువుమని రాయలు తప్పులున్న స్థానములను జూపెను. ఆమె యొప్పు కొనలేదు. "రజనీ! పూర్తిగా మేల్కాంచితివా!" యని రాయ లడిగెను. రజనిలేచి నిలుచున్నది.

"పూర్వసంప్రదాయబద్ధమైన సనాతన కవిత్వము గిజ గిజఁ దన్నుకొను యజ్ఞపశువు వంటిది. గాలి పిల్లలవలెను, మొగిలు కన్నెలపగిదిని, బర్వులిడు స్వేచ్ఛాయుత నవ్యకవిత్వమును నే వార్షింతును" అని యామె సమాధానమిచ్చెను. రాయలింక మాటాడలేదు. వాదించినను వినెడి యూహాలో నిప్పుడామె లేదు.

# 13

ఆనాఁడు గోదావరీప్రవాహముతో సాఁగిపోయిన విజయుని గొందఱు పడవవాండ్రు రక్షించి యాతఁడు త్రాగిన నీటిని గ్రక్కించివేసిరి. మన్యపు సరకులను జవుకగాఁ గొని తెచ్చి గోదావరివంతెన కట్టుచున్నవారి కమ్ముటకై పడవ వేసికొని వాడపల్లెనుండి పోలవరమును పోవుచున్న యా పడవ వాండ్రు తమతోఁగూడ విజయుని దీసికొనిపోయిరి. విజయుఁడు వారు పెట్టిన యేపదార్థమును ముట్టలేదు. ఆతఁడేమి తినునో వారికిఁ దెలియలేదు. అట్లు నాల్గురోజులు విజయుఁ డుపవాసములు చేసెను. దానితో నాతఁడు బాగుగాఁ జిక్కిపోయినాఁడు. పోలవరము చేరినతరువాత వారిలో నొకఁడు కొన్నిఫలములను దెచ్చి విజయుని కిచ్చెను. సంతోషముతో విజయుఁ డాఫలములను దినెను. అప్పటినుండియు వారు తిరిగి వచ్చువఱకు విజయునికి ఫలములే యొసంగుచుండెడివారు. వాడపల్లె చేరినతరువాత విజయు నేమి చేయవలెనో వారు నిశ్చయించుకోలేకపోయినారు. బాలుఁడు కులీనునివలెఁ గన్పడుచున్నాఁడు. మాటలేదు; పిల్లలందఱివలె నన్నిపదార్థములను దినఁడు. యోగివలె నెల్లప్పుడు నేదియో ధ్యానములో నుండును. ఒక విచిత్రవ్యక్తివలె నున్నాఁడీతఁడని వారనుకొనిరి.

ఒక నాల్గునెలలు విజయునిఁ దమకూడఁ ద్రిప్పుకొని వారు విసువుచెందిరి. ఈపరమయోగి మన కెందులకని యనుకొని వా రొకనాఁటియుదయమున విజయుని గోదావరిగట్టు

మీఁదికిఁ దీసికొనివచ్చి విడిచివేసిరి. విజయుఁడు గోదావరి కెగు వగా నడక మొదలుపెట్టి విశ్వనాథాశ్రమము వఱకు వచ్చెను. ఇఁక నాతఁడు నడువలేకపోయెను. కుటీరమును జూచి గట్టు దిగి వటవృక్షముకడకు వచ్చినాఁడు. ఎదురుగా ధ్యానములోనున్న విశ్వనాథుఁడు వానికంటఁబడెను. వానిని జూడఁగనే యేలొకో విజయుఁడు నిలువెల్ల నణఁకిపోయి కెవ్వున కేక వేసినాఁడు. తోడనే విజయుని గొంతునుండి విడివడి వానికి మాటలు వచ్చెను. విజయుని జీవితములో క్రొత్తయాశ ప్రారంభమైనది.

విశ్వనాథుఁడు ధ్యానము ముగించి కనులు తెఱచి యెదురుగా నున్న విజయునిపైఁ జల్లనిచూపులు ప్రసరింపఁ జేసినాఁడు. విజయునిలో నపూర్వమగు చలనము కలిగెను.

గురు ర్బ్రహ్మా గురు ర్విష్ణు ర్గురు ర్దేవో మహేశ్వరః
గురు స్సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥
అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా
చక్షు రున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః ॥

అని తన కూహవచ్చినప్పటినుండియుఁ బ్రతినిత్యమును దండ్రి చదువగా వినియున్న శ్లోకములను బఠించి విజయుఁడు విశ్వనాథుని యెదుట సాష్టాంగ పడినాఁడు. విశ్వనాథుఁడు ప్రేమతో "సకలశాస్త్రవిశారదుఁడవుకమ్ము" అని దీవించుచు వానిని లేవనెత్తెను. విశ్వనాథుఁడు విజయుని గుర్తించినాఁడు. వాని యానందమున కంతులేకపోయెను. ఈశ్వరమ్మగారిని, రామయ్యగారిని బిలిచెను. విజయుఁడు తాతగారిని, నాయ

నమ్రముగ గుర్తించి వినయముతో నమస్కరించెను. అమాంతముగా మనుమని యెత్తుకొని వారిరువు రానందబాష్పములచే వాని శిరమును దడిపివేసిరి.

ఆ మువ్వురు నాశ్రమమునందే యుండ నియమించి విశ్వనాథుఁ డానాఁడే బయలుదేరి కుమారదేవము వచ్చెను. ఆచార్యు నాకస్మికాగమనమునకు విస్మయ మొందుచు శిష్యులిరువురును గురుపాదములకుఁ బ్రణమిల్లి లోనికిఁ గొంపోయిరి. వారి మొగముల వైవర్ణ్యమును గాంచి విశ్వనాథుఁడు కారణ మడిగెను. రజని సమాధానమొసంగ సిగ్గిలెను. రాయలు త్రాఁచు, గంధపుమ్రాఁకుల వృత్తాంతమును, దను భేదాభిప్రాయములను దాఁపక గురునికి నివేదించినాఁడు. అంత విశ్వనాథుఁడు శిష్యుల నిరువురను దోడ్కొని గంధపుఁజెట్టుకడ కేఁగెను. రాయలయొద్దనున్న బాకుతో విశ్వనాథుఁడు చెట్టు బెరడు నూడఁదీసెను. మ్రానిలోఁ గలిపివ్రాఁత కనిపించినది. ఆతురతతో రాయలు పైనున్న రజనీకుమారి పేరు చదివెను. రజనీకుమారి రాయలపేరు చదివినది. ఇరువురు నొండొరులఁ జూచుకొనిరి. వారిలోఁ గ్రిందటిరోజునఁ బ్రవేశించిన చెప్పరాని భావములన్నియును మటుమాయమైనవి. విశ్వనాథుఁడు మందహాస మొనర్చి యిట్లు బోధించినాఁడు—

"అమ్మాయీ! నీవు సంగీతమున నిధివి. సాహిత్యము దానికి వన్నె పెట్టుననియుఁ దానఁ గుమారుఁడు వెంటలేఁడను విచారమును మఱతువనియు నేను నిన్ను సాహిత్యమును

జనువునుంటిని. రాయలు సాహిత్యాచార్యుఁడు...”—రాయల కనులు వింతకాంతితో మెఱిసినవి— “... శిష్యులను నేను ప్రశంసింపరాదు. కాని యవసర ముండుటచేఁ బ్రస్తావింపక తప్పినదిగాదు. రాయలు నిండుకుండవంటివాఁడు. తీక్ష్ణముగ నాలోచించినచో నీకే తెలియఁగలదు. నీ మార్గము నీది. వానిపథము వానిది. ఒకరి నింకొకరు విమర్శించుకొనుట కధికారములేదు.”-రజని చూపులతో క్షమాపణ వేఁడుకొన్నది. రాయలు నవ్వెను. మఱునాఁటికి రామగిరినుండి యా ముగ్గురు నాశ్రమమునకు వచ్చు నేర్పాట్లు కావింపుమనియు, మీరు నల్గురును రేపకడనే రాయలు దేరి యచ్చటికి రండనియు విశ్వనాథుఁడు రాయలతోఁ జెప్పి వెడలిపోయెను. ఏమో యున్నదని వారినువ్వురనుకొనిరి. రామగిరికి వెంటనే రాయలు కబురుజేసెను.

ఉదయముననే రజనీ రాయలును, చంద్రాకేశవులును విశ్వనాథాశ్రమమునకు వచ్చిరి. విజయుఁడు వారి కెదురుగా వచ్చి తల్లిదండ్రులకు నమస్కరించెను. తల్లిదండ్రు లిరువురు నానందాశ్చర్యములతోఁ గుమారు నొక్కమాఱే యెత్తుకొనిరి. చంద్రాకేశవు లిరువురు నచేతనులభంగి నిల్చి పరికింప సాఁగిరి.

“అమ్మా! ఇంతవఱకును మూఁగవాఁడనై మీహృదయములకుఁ గష్టము కల్గించితిని. క్షమింపవలయును.” అని విజయుఁడు వినమ్రుఁడైనాఁడు. అనల్గురును మొదటనే యాకాశ

వాణియో పల్కుచున్నదనుకొనిరి. కాని విజయుఁడే మాట్లాడు చున్నాఁడని వారు గ్రహించినారు. విజయునికి మాటలుకూడ వచ్చినవే!... "మరల విజయుఁడు మీకు నవ్యరూపముతోఁ గన్పడు" నని విశ్వనాథులు చెప్పినమాట కిదేయర్థము కాఁబోలు ... తాను గర్భవతినన్నమాట మఱచిపోయి విజయుని జంకకు నెత్తికొని రజనీకుమారి కుమారుని ముద్దులతో నింపివేసెను. బావగారున్నా రన్నమాటయే మఱచిపోయి చంద్రశోడికోడలి చంకనుండి విజయుని లాఁగికొని "కన్నయ్యా!" యనుచు నుప్పొంగిపోయెను. కేశవుఁడును రాయలు నానందస్వాంతులై యట్టె నిలిచిపోయిరి.

రామగిరినుండి భారతీభవానీగిరరావులును విజయేశ్వర...నుండి కుమారమోహన దంపతులును జాము ప్రొద్దెక్కునప్పటి కాశ్రమమునకు వచ్చిరి. మరల నామూఁడు కుటుంబములు నొక్కసారిగా హర్షాక్రాంతమైనవి. విశ్వనాథుఁడు యోగాభ్యాసమును ముగించివచ్చెను. వినయముతోఁ గృతజ్ఞతతో నందఱు లేచి నిలఁబడిరి. వారిని గూర్చుండ నియమించి విశ్వనాథుఁ డిరువురు జమీందారుల మొగమై యిట్లు చెప్పెను.

"మీకుటుంబములన్నియు నొడుదుడుకులను దాఁటి బైట బడినవి. ఇంక మీరు సుఖముగా నుండఁగలరు. కాని దేశమంతయును దప్పుత్రోవలఁబడి నిర్వీర్యమైపోవుచున్నది. ఒక దేశము దాస్యబద్ధ మగుటకుఁ గారణ మింకొకరి ప్రాబల్యము

కాదు. ఆజాతి నిస్తేజమగుటయే ముఖ్యకారణము. ఏదేశమేని సంపన్నతనొందుట యనునది యాజాతి సంస్కృతిపై నాధార పడి యుండును. అట్టి సంస్కృతి మనకిప్పుడున్న విద్యావిధానమువలన రాదు. కావున మీయైశ్వర్యము నంతటిని వినియోగించి యీయాశ్రమమునే కేంద్రముగఁ జేసి దుర్గతిని బడిపోవుచున్న దేశమునకు, విశ్వమునకుఁ గూడ సత్పథమును బోధింపఁగలుగు నొక గురుకులమును స్థాపింపుఁడు. మా శ్రీగురుపాదులు నాకుఁ బ్రసాదించిన విద్య నంతటిని నేనిదివఱకే శిష్యులకుఁ బంచి యిచ్చివేసితిని. వారిరువురును గురుకులాభ్యున్నతికై తమ జీవితములను ధారపోయుదురు. రాయులు గురుకులాచార్య పదవిని నిర్వహింతురు. మన విజయుఁడును, భారతియు నీగురుకులమున మొట్టమొదటి శిష్యులుగా గ్రహింపఁబడుదురు. ఈగురుకులము "విశ్వభారతి"యై విశ్వమునకు మార్గదర్శకమగునుగాక!"—జమీందారులు భారమును శిరసా వహించిరి. రజనియు రాయులు నుత్సాహమును జూపిరి. విజయుఁడు, భారతియు నొండొరులను జూచుకొనిరి. ఇరువురకు నదియే ప్రథమ పరిచయము.

గురుకులమునకుఁ గావలసిన క్రొత్త కట్టడములను త్వరలోఁ బూర్తికావించిరి. కట్టడపు నిర్మాణములు జరుగుచుండగా రజనీకుమారి పుత్రుని గనెను. తల్లిదండ్రుల యనుమతి మీఁదను, విశ్వనాథు ననుజ్ఞతోడను రాయు లాబాలుని విజయేశ్వరాధీశులకు దత్తతగా నొసంగెను. వేసఁగి దాఁటఁగానే

విశ్వనాథుఁడు స్వయముగా గురుకులమునకుఁ బ్రారంభోత్సవమును గావించెను. "విశ్వభారతి" తన కార్యక్రమమును బ్రారంభించినది. సిద్ధసంకల్పుఁడగు విశ్వనాథుఁడు హిమాలయములకు వెడలిపోయెను.

విశ్వభారతీ గురుకులమునకు వివిధ దేశములనుండి ఘనులగు నధ్యాపకులు రావింపఁబడిరి. దేశ మన్ని మూలలనుండియు విద్యార్థులు గురుకులమునకు రాఁదొడగిరి. అన్ని విషయములలోను విద్యగఱపఁబడు చుండెను. శిక్షాకాల మెనిమిది సంవత్సరములు. ఆంతకాలమును విద్యార్థులు గురుకులము నందే నివసింపవలెను. అధ్యాపకులు నందేయుందురు. విద్యార్థులకు నధ్యాపకులకు నిరంతర సంబంధము స్థిరపడియుండవలెనని యందలి కట్టుబాటు. సర్వమానవ సౌభ్రాతృత్వమునకు, విశ్వశాంతికి నది పుట్టినిల్లు. అందు జాతి, మత, వర్ణ విభేదములు నాస్తి. గురుకులమే భారమును వహించి విద్యార్థులను దేశాటనము చేయించును. శిక్షాకాలము పూర్తియగునప్పటికి తమతమ యభిమాన విద్యలందుఁ బ్రవీణులగుదురు. ఆసక్తి, శక్తియున్నచో నింకను బరిశ్రమచేయుటకు వీలున్నవి. సమస్తదేశాధిపతులును "విశ్వభారతి" ని గౌరవించి, తమ తమ సాహాయ్యములను బ్రకటించిరి. గురుకులము ప్రపంచమునకుఁ గేంద్రస్థానమై యొప్పుచుండెను. ఆ గురుకుల శ్రీకి గోదావరినది హొయలు వన్నెలు దిద్దుచున్నది.

సంవత్సర మొకటి గడచెను. భవాని మగశిశువును, జంద్ర యాఁడు శిశువును గనిరి. ఆ శిశువు లిరువురకును రామయ్యగారి పేరును, ఈశ్వరమ్మగారిపేరును బెట్టినారు. తామిరువురకును విద్యమందవలెనన్న యర్థ మందిమిడి యున్నది.

విశ్వభారతీ గురుకుల ప్రథమ వార్షికోత్సవమునాఁడు కులపతియైన రాయలు తెలుఁగు సాహిత్యములోని యందములను, దాని గొప్పతనమును, ఆ సాహిత్యమును నిర్మించి, పెంచిన మహానుభావుల యాధిక్యమునుగూర్చి యనర్గళముగ నుపన్యసించెను. అప్పుడే తీసి "వడపోత పెట్టిన యిక్షురసము" వలె రాయల యుపన్యాసము నడిచినది. తరువాత సంగీతాధ్యాపకురాలగు రజనీకుమారి వీణియపై మృదుల గానామృతమును వర్షింపఁజేసెను. ఆ భార్యా భర్తలను జూచి యాంధ్రదేశ ముప్పొంగినది. భరతవర్షము గర్వపడినది. విదేశములు తలలూపినవి. మఱునాఁ డెక్కడఁజూచినను వారిప్రశంసయే. నాఁటి రాత్రి మరల రాయులన్నాఁడు.

"రజనీ! నీవు సంగీత కళాధిదేవతవు. శృంగార రసాకృతివి" అని—రజని సమాధాన మిచ్చినది.

"నాథా! మీరలు మహాత్ములు; నేనెంత దానను!..."

రజని సమాధానమునకు రాయ లానందమున నామె చెక్కిలిపై వ్రేలితో మీటినాఁడు.

---

సరస్వతీ పవర్ ప్రెస్, రాజమహేంద్రవరము 7018/1952